ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
మంగళవారం 6, మే 2025

వేటు మొదలైంది!

వైద్యశాఖ ఉద్యోగుల్లో అలజడి

ఐఫోన్‌లో ముఖహాజరును ట్యాంపరింగ్ చేసిన వారిపై హెల్త్ డైరెక్టర్ ఆగ్రహం


- కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించాలని ఆదేశం
- ఇద్దరు మెడికల్ ఆఫీసర్లపై చర్యలు
- రెగ్యులర్ వారికి సంజాయిషీ నోటీసులు

ఒంగోలు కలెక్టరేట్, మే 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్యారోగ్యశాఖలో ముఖహాజరును ఐఫోన్ ద్వారా ట్యాంపరింగ్ చేసిన కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించాలని ఆశాఖ డైరెక్టర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 4న 'ముఖహాజరు మాయాజాలం.. విధులకు ఎగనామం' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంతో వైద్యశాఖలో అలజడి రేగింది. అక్రమాలకు పాల్పడ్డ ఉద్యోగులపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు శ్రీకారం చుట్టింది. అందుకోసం వైద్యులు, సిబ్బంది ముఖ హాజరు (ఎఫ్‌ఆర్ ఎస్)ను ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా వేసేవిధంగా చర్యలు తీసుకుంది. అయితే ప్రభుత్వం సాధారణ ఫోన్లకు యాప్‌ను రూపొందించగా జిల్లాలోని 16 మంది మెడికల్ ఆఫీసర్లు ఆ యాప్‌ను ఐఫోన్ల ద్వారా ట్యాంపరింగ్ చేశారు. వారు పనిచేసే చోట ఎఫ్‌ఆర్ఎస్ వేయకపోయినా అక్కడే వేసినట్లు చూపించింది. ఈ విషయాన్ని వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు గుర్తించి చర్యలకు ఉపక్రమించారు. జిల్లాలో కాంట్రాక్టు కింద ఇరువురు మెడికల్ ఆఫీసర్లు పనిచేస్తున్నారు. ఐఫోన్ ద్వారా ఎఫ్‌ఆర్ఎస్‌ను ట్యాంపరింగ్ చేయడంతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారిని తొలగించాలని డీఎంహెచ్‌వోను హెల్త్ డైరెక్టర్ ఆదేశించారు.



200 మంది ఉద్యోగులు కూడా..

మరోవైపు వైద్యశాఖలో సుమారు 200 మంది వరకు రెగ్యులర్ ఉద్యోగులు ఫోన్ ట్యాంపరింగ్ ద్వారా హాజరుతోపాటు విధులకు ఆలస్యంగా వెళ్తున్నట్లు గుర్తించారు. వారిలో కొందరు పనిచేసే వైద్యశాల వద్దకు వెళ్లి ముఖ హాజరు వేసి లోపల అడుగు పెట్టకుండానే తిరిగి సాయంత్రం ఎఫ్‌ఆర్ఎస్ వేస్తున్నట్లు కూడా పసిగట్టారు. వారందరికీ సీసీఎల్‌ఏ రూల్ ప్రకారం సంజాయిషీ నోటీసులు జారీ చేయాలని డైరెక్టర్ ఆదేశించారు. దీంతో ఉద్యోగుల్లో అలజడి రేగింది. ఇప్పటివరకు ఇష్టానుసారంగా వ్యవహరించిన వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రెగ్యులర్ వారిని కేవలం సంజాయిషీ నోటీసులతో వదిలేస్తారా? కఠిన చర్యలు తీసుకుంటారా? అన్న ఆందోళన వారిలో నెలకొంది. .





ఈనెలలోనే అన్నదాత సుఖీభవ
2.50 లక్షల మందికి లబ్ధి

- మూడు విడతల్లో ఒక్కొక్కరికి రూ.20వేలు
- కౌలు రైతులకూ వర్తింపు
- ప్రభుత్వం మార్గదర్శకాలు
- అమలులోకి మరో కీలక ఎన్నికల వాగ్దానం

అన్నదాతకు అండగా..

రైతన్నలకు తీపికబురు. పంట సాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. 'అన్నదాత సుఖీభవ' పేరుతో అర్హులైన కర్షకులకు రూ.20వేల ఆర్థిక సహాయాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయబోతోంది. ఎన్నికల ముందు టీడీపీ కూటమి అన్నివర్గాలకు మేలుచేసే మేనిఫెస్టోను విడుదల చేసింది. అందులో ప్రకటించిన పలు పథకాలను ఒక్కొక్కటిగా ఇప్పటికే అమలు చేస్తోంది. తాజాగా అన్నదాత సుఖీభవను ఈ నెలలో అందించనుంది. అందుకు సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేసింది. అవి సోమవారం జిల్లా వ్యవసాయశాఖ అధికారులకు అందాయి. లబ్ధిదారుల జాబితాను ఈనెల 20వతేదీలోపు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అందులో స్పష్టం చేసింది. జిల్లాలో సుమారు 2.5లక్షల మంది రైతులకు లబ్ది చేకూరనుంది.

ఒంగోలు, మే 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ఆయా వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తాజాగా లక్షలాది మంది రైతులకు ఆర్థిక సహకారం అందించే కీలక పథకం అమలుకు ఉపక్రమించింది. ఈనెలలోనే దాన్ని వర్తింపజేయనుంది. కేంద్ర ప్రభుత్వం 'పీఎం కిసాన్' పేరుతో ఏటా ఒక్కో రైతుకు రూ.6వేలు ఇస్తుండగా ఆ పథకంతో రాష్ట్ర ప్రభుత్వం తమ వంతు ఆర్థిక సాయాన్ని కలిపింది. ఆ ప్రకారం అన్నదాత సుఖీభవ పేరుతో అందించే రూ.20వేలలో రూ.6వేలు కేంద్రం నుంచి రానుండగా మిగిలిన రూ.14వేలను రాష్ట్రప్రభుత్వం ఇవ్వనుంది. అలాగే కేంద్రం మూడు విడతలుగా ఆ మొత్తం ఇస్తుండగా రాష్ట్రప్రభుత్వం కూడా తాము ఇచ్చే రూ.14వేలను మూడు విడతలుగా రైతుల ఖాతాల్లో జమచేయనుంది.

4.78లక్షల రైతు కమతాలు

జిల్లాలో మొత్తం 4.78 లక్షల రైతు కమతాలు ఉన్నాయి. అందులో 2.62 లక్షల సన్నకారు, 1.29 లక్షల చిన్న రైతులు ఉన్నారు. మరో 87వేలు ఇతర కమతాలు ఉన్నాయి. జిల్లాలో సాధారణంగా సుమారు 6.80 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వివిధ రకాల పంటలు సాగు చేస్తారు. ఇదిలాఉండగా పీఎం కిసాన్ పథకం కింద జిల్లాలో 2.44 లక్షల మందికి ఆర్థిక సహాయం అందుతోంది. వారందరికీ రాష్ట్రప్రభుత్వం అమలు చేయనున్న అన్నదాత సుఖీభవ పథకం వర్తించనుంది. పీఎం కిసాన్‌లో కౌలు రైతులకు నగదు ఇవ్వడం లేదు. అయితే రాష్ట్రప్రభుత్వం ఈ పథకాన్ని అర్హులైన కౌలు రైతులకు కూడా వర్తించేలా ఉత్తర్వులు ఇచ్చారు. వారిని వ్యవసాయ, రెవెన్యూ అధికారులు గుర్తించాల్సి ఉంటుంది.

అధికారులకు ఆదేశాలు

ప్రభుత్వ నూతన మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో తొలివిడత అన్నదాత సుఖీభవ పథకం 2.50 లక్షల మందికిపైగా రైతులకు అందే అవకాశం ఉంది. ఈ పథకంలో ఎవరెవరు అనర్హులు అనేది కూడా ప్రభుత్వం మార్గదర్శకాల్లో వివరించింది. తదనుగుణంగా లబ్ధిదారులైన రైతుల జాబితాలను సిద్ధం చేసి వ్యవసాయ శాఖ కమిషనర్ పోర్టల్‌లో నిక్షిప్తం చేయాలని జిల్లా అధికారులను ఆదేశించింది. కాగా అన్నదాత సుఖీభవ మార్గదర్శకాలు సోమవారం అందాయని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. తదనుగుణంగా అర్హులైన లబ్ధిదారుల జాబితాలను ప్రభుత్వం ఇచ్చిన గడువులోపు రూపొందించి నివేదిస్తామని ఆయన చెప్పారు.

అంతా ఆన్‌లైన్‌లోనే..

అన్నదాత సుఖీభవ పథకం అమలులో గ్రామస్థాయిలోని వ్యవసాయ శాఖ అసిస్టెంట్లు, రెవెన్యూలోని వీఆర్వోలు కీలకం కానున్నారు. లబ్ధిదారుల ఎంపికను ప్రాథమికంగా వారు చేస్తారు. ఆ జాబితాను వారు ఆన్‌లైన్‌లో యాప్‌లో నమోదు చేస్తే మండల స్థాయిలోని తహసీల్దార్, వ్యవసాయ శాఖ అధికారి పరిశీలించి ఓకే చేయాలి. వాటిని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి (డీఏవో) పరిశీలించి వ్యవసాయశాఖ కమిషనర్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తే సదరు జాబితాలోని రైతు ఖాతాలకు నగదు జమ అవుతుంది.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా ఆటకట్టు!

ముగ్గురు అరెస్టు

రూ. 85 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు స్వాధీనం

- వివరాలను వెల్లడించిన ఎస్పీ దామోదర్
- ముఠా నాయకుడిపై 111 కేసులు



దొంగల వద్ద స్వాధీనం చేసుకున్న నగలు, గంజాయి, హైడ్రాలిక్ కట్టర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్, ఇతర పోలీసు అధికారులు

ఒంగోలు క్రైం, మే 5 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం స్మగ్లింగ్‌తోపాటు ఇళ్లలో దొంగతనాలు చేయడంలో అందెవేసిన ముఠాను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వారి వద్ద రూ.85లక్షల విలువైన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులతోపాటు ఆరు కిలోల గంజాయి, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. కారులో తిరుగుతూ పట్టపగలు ఇంటి తాళాలను కట్ చేసి లోపలికి వెళ్లి దోచుకోవడంలో ఆ ముఠా ఆరితేరింది. ఇటీవల ప్రకాశం, నెల్లూరు, కడప, అనంతపురం, అన్నమయ్య జిల్లాల్లో 16 చోట్ల వారు దొంగతనాలు చేశారు. ఎర్రచందనం స్మగ్లింగ్ చేయడమే వృత్తిగా ఎంచుకున్న కడప జిల్లాకు చెందిన ఈ ముఠా పనిలో పనిగా చోరీలు చేయడం కూడా అలవాటు చేసుకుంది. దొంగతనం చేసి తిరిగి వెళుతుండగా వారి కారును ఆపే ప్రయత్నం చేసిన ఎస్ఐ జీపునే ఢీకొట్టి తప్పించుకున్న నేరచరిత్ర వారిది. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ దామోదర్ వివరాలను వెల్లడించారు.

పట్టుబడింది ఇలా..


ఎస్పీ కథనం మేరకు.. కడప జిల్లా చాపాడు మండలం ఖాదర్‌పల్లికి చెందిన చీమపర్తి ఫక్రుద్దీన్ అలియాస్ పోగోడు అలియాస్ బొండోడు, అదేగ్రామానికి చెందిన చింపర్తి అలియాస్ సింపతి మహబూబ్‌పీరా, ప్రొద్దుటూరుకు చెందిన గాండ్ల లతీఫ్ బాషాలు ఆదివారం మధ్యాహ్నం పొదిలిలోని ఎస్‌వీకేపీ కాలేజీ బస్‌షెల్టర్‌లో అనుమానాస్పదంగా కనిపించడంతో పొదిలి పోలీసులు పట్టుకున్నారు. విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ముఠాకు ఫక్రుద్దీన్ నాయకత్వం వహిస్తాడు. వారి వద్ద రూ.81లక్షల విలువైన 924.33 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.4.2లక్షల విలువైన 3.800 కిలోల వెండి వస్తువులు కలిపి మొత్తం రూ.85.20 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. అదేసమయంలో కారు, అందులో 6.190 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిపైన ఐదు జిల్లాల్లో 16 కేసులు ఉన్నాయి. ఈ ముఠాకు నాయకుడైన ఫక్రుద్దీన్‌పై 111 ఉన్నాయని, వీటిలో 74 ఎర్రచందనం కేసులని ఎస్పీ దామోదర్ వెల్లడించారు.

గత నెలలో ఎస్ఐ కారును ఢీకొట్టి పరారైన ముఠా

పొదిలిలో గతనెల 14న బీరం నాసరరెడ్డి ఇంట్లో చోరీ జరిగింది. 27 సవర్ల బంగారు ఆభరణాలు, 2 కిలోల వెండి అపహరణకు గురయ్యాయి. దీంతో సీసీ ఫుటేజీ సేకరించిన పోలీసులు దొంగల ముఠా కడప జిల్లాకు చెందినదని గుర్తించారు. వారి కదలికలపై నిఘా ఉంచారు. ఆతర్వాత గతనెల 17న కావలిలో దొంగతనం చేసిన ముఠా కారులో ప్రొద్దుటూరు వైపు వెళుతున్నట్లు మన జిల్లా పోలీసులు గుర్తించారు. కడప జిల్లా ఎస్పీ ద్వారా ప్రొద్దుటూరు ఎస్ఐని అప్రమత్తం చేశారు. అయితే దొంగల ముఠా ప్రొద్దుటూరు ఎస్ఐ జీపును ఢీకొట్టి పారిపోయింది. దీంతో అప్పటి నుంచి వారిపై నిఘా ఉంచిన పొదిలి సీఐ వెంకటేశ్వరరావు ఆదివారం పొదిలిలో అనుమానాస్పదంగా బస్‌షెల్టర్‌లో ఉన్న వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. దొంగల ముఠాగా గుర్తించి అరెస్టు చేశారు.

పోలీసులకు రివార్డులు అందజేసిన ఎస్పీ

దొంగల ముఠాను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ, పొదిలి సీఐ టి.వెంకటేశ్వర్లు, ఎస్ఐలు వేమన, టి.రాజ్‌కుమార్, బ్రహ్మనాయుడుతోపాటు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. వారికి ప్రశంసాపత్రాలతోపాటు రివార్డులను అందజేశారు. సమావేశంలో మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ఉన్నారు.



ఆస్తమానం ఇబ్బందే..!

- ఈ వ్యాధికి దూమపానం.. వాయు కాలుష్యమే కారణం
- నేడు ఆస్తమా వ్యతిరేక దినం
- అందుబాటులో వైద్యం

అమ్మనబ్రోలులో ఏం జరిగింది?

- ప్రత్యక్ష సాక్షులను విచారించిన పోలీసులు
- హంతకముఠా నేత నుంచి ముఖ్య సమాచారం
- చివరి దశలో వీరయ్య హత్యకేసు దర్యాప్తు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

తెలుగుదేశం పార్టీ నాయకుడు ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య కేసులో పోలీసు దర్యాప్తు చివరి దశకు చేరింది. హంతక ముఠాకు నాయకత్వం వహించిన వ్యక్తి ఇచ్చిన సమాచారంతో సోమవారం విచారణను ముమ్మరం చేశారు. తదనుగుణంగా ఆయా ఘటనలకు సంబంధించి ప్రత్యక్ష సాక్షులను విచారించి వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేశారు. ముఠాకు నాయకత్వం వహించిన వ్యక్తి ఇచ్చిన సమాచారంతో వీరయ్య చౌదరి స్వగ్రామమైన అమ్మనబ్రోలులో అసలేం జరిగింది? పూర్వాపరాలు.. హంతక ముఠాకు హైదరాబాద్‌లో ఉన్న వ్యాపారి, మండలంలో ఉన్న రేషన్ మాఫియా డాన్‌కు ఉన్న సంబంధాలపై సోమవారమంతా ఆరా తీశారు.

కీలక సమాచారం రాబట్టిన పోలీసులు

వీరయ్య హత్య కేసులో సూత్రధారులు ఎంత మంది ఉన్నప్పటికీ ప్రధాన పాత్రధారుడిగా గుర్తించిన ఇసుక వ్యాపారిని పోలీసులు పట్టుకోగలిగినట్లు తెలిసింది. నెల్లూరుతో అతనికి ఉన్న సంబంధాల నేపథ్యంలో అక్కడ పని చేస్తున్న ఒక డీఎస్పీ.. నిందితుడిని అదుపులోకి తీసుకుని జిల్లా పోలీసులకు అప్పగించినట్లు సమాచారం. విచారణలో ఇసుక వ్యాపారి పలు అంశాలను వెల్లడించినట్లు తెలిసింది. ఆయన ఇచ్చిన సమాచా రానికి అనుగుణంగా లోతైన దర్యాప్తునకు పోలీసులు దిగారు. అమ్మనబ్రోలు సమీపంలో రొయ్యల చెరువుల నిర్వహణ, కనపర్తి నుంచి ఇసుక అక్రమ రవాణాకు సంబంధించిన అంశాల్లో హతుడు వీరయ్యకు, సూత్రధారులకు మధ్య వివాదం పెరిగినట్లు గుర్తించారు. అమ్మనబ్రోలుకు చెందిన లిక్కర్ వ్యాపారి రొయ్యల చెరువులకు గుండ్లకమ్మ నుంచి మంచినీటిని మళ్లిస్తూ చెరువుల్లో నుంచి వచ్చే వృథా నీటిని పొలాల్లోకి వదులుతున్నట్లు తాము వీరయ్య దృష్టికి తీసుకెళ్లామని, ఆ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు సోమవారం పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. వీరయ్య మాట్లాడటంతో కలెక్టరు వెంటనే వాటిని నిలిపివేయించినట్లు వారు చెప్పారు. దీంతో ప్రత్యర్థులు కసి పెంచుకున్నారు. అలాగే హంతక ముఠా నాయకుడు ఇచ్చిన సమాచారం మేరకు కనపర్తి నుంచి ఇసుక అక్రమ రవాణా ఎవరు చేస్తున్నారు, ఎవరు అడ్డుకున్నారన్న విషయంపైనా పోలీసులు విచారణ చేపట్టారు. హంతక ముఠాకు నాయకత్వం వహిస్తున్న వ్యక్తే ఇసుక వ్యాపారి. ఆయన అమ్మనబ్రోలులో వీరయ్య వ్యతిరేకులతో కలిసి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు తెలిసింది. దాన్ని అధికారులతో తనకున్న పరిచయాలను ఉపయోగించి వీరయ్య ఆపివేయించినట్లు పోలీసుల విచారణలోనూ నిర్ధారణ అయినట్లు తెలిసింది.



వీరయ్య హత్య జరిగిన భవనం (ఫైల్)

పలు విషయాలు కొలిక్కి

హైదరాబాద్‌లో ఉన్న అమ్మనబ్రోలుకు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త ఇచ్చిన భరోసా, ఆర్థిక సహకారం కిందిస్థాయిలో గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు, మరోవైపు రేషన్ మాఫియా డాన్ వీరికి తోడైనట్లు సమాచారం. హంతక ముఠాకు నాయకత్వం వహించిన ఇసుక వ్యాపారి పాత్రపై నిర్దిష్ట సమాచారాన్ని ఈ రెండు రోజుల్లో పోలీసులు సాధించగలిగినట్లు తెలిసింది. వీరికున్న రాజకీయ నేపథ్యాన్ని ఇప్పటికే గుర్తించారు. బుధవారం వీరయ్య పెద్దకర్మ జరుగుతోంది. ఈనేపథ్యంలో వచ్చే 24 గంటల వ్యవధిలో కేసు ప్రాథమిక దర్యాప్తును ఒక కొలిక్కి తేవాలని పోలీసులు భావిస్తున్నారు. ప్రధాన అంశాలను వెల్లడించి వారి అదుపులో ఉన్న సూత్రధారులు, పాత్రధారుల అరెస్టులు చూయించి తదుపరి దర్యాప్తు చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

ఆత్మహత్యా.. అనారోగ్యమా?

- ఒంగోలులో యువకుడి మృతిపై అనుమానాలు
- సాధారణ మరణమే అంటున్న కుటుంబీకులు

ఒంగోలు క్రైం, మే 5 (ఆంధ్రజ్యోతి) : నగరానికి చెందిన ఓ యువకుడి మృతి పలు అనుమానాలకు, ప్రచారాలకు దారితీసింది. అతను విజయవాడలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. అయితే పోలీసులు విచారణకు పిలిచి మాట్లాడి అవసరమైతే మరలా రావాలని ఆదేశించడంతోనే అతను ఆందోళనకు గురై ఆత్మహత్య చేసుకున్నాడన్న ప్రచారం నడిచింది. టీడీపీ నేత వీరయ్య హత్య కేసులో ముమ్మర దర్యాప్తు చేస్తున్న పోలీసులు కీలక పాత్రధారిగా ఉన్న వ్యక్తితో సదరు యువకుడికి ఆన్‌లైన్‌లో లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. అతడిని గతనెల 28న విచారణకు పిలిచారు. విచారించిన అనంతరం అవసరమైతే మరోసారి రావాల్సి ఉంటుందని చెప్పి పంపారు. మరుసటిరోజు అతను అనారోగ్యానికి గురైనట్లు సమాచారం. దీంతో బాధితుడిని ఒంగోలులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. యువకుడి మృతికి అనారోగ్యమే కారణమని కుటుంబీకులు, బంధువులు చెబుతున్నారు.



డిపాజిట్లు రూ.3కోట్లు గోల్‌మాల్

- పరారీలో బ్యాంకు మేనేజర్
- ఆందోళనలో ఖాతాదారులు

పామూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): పామూరు పట్టణంలోని నెల్లూరు రోడ్డులో ఉన్న ఓ వాణిజ్య బ్యాంకులో సుమారు రూ.3 కోట్ల డిపాజిట్ నగదు గల్లంతైంది. సంబంధిత బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ ప్రస్తుతం పరారీలో ఉన్నారు. ఇందుకు సంబంధించి బ్యాంకు అధికారులు మరో మేనేజర్‌ను నియమించి విచారణ చేయిస్తున్నారు. పట్టణానికి చెందిన ఓవ్యాపారి రూ.ఒక కోటి 6 లక్షలు డిపాజిట్ చేశారు. అందుకు సంబంధించి కౌంటర్ ఫైలు, దానిపై బ్యాంకు ముద్ర అన్నీ సక్రమంగా ఉన్నప్పటికీ ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. అలాగే, మరో పది మందికి సంబంధించిన డిపాజిట్లు, రుణాలకు సంబంధించి చెల్లింపుల్లో తేడాలు ఉన్నాయి. ఈక్రమంలో బ్యాంకు మేనేజర్ పరారవడంతో విషయం బయటకు పొక్కింది. డిపాజిట్‌దారులకు అనుమానాలు తలెత్తి బ్యాంకు ఖాతాల్లోని బ్యాలెన్స్‌ను చూసుకోవడంతో సొమ్ము లేదన్న విషయం తేలింది. ఈవిషయమై బ్యాంక్ సిబ్బంది స్థానిక పోలీసులను సంప్రదించారు. ఖాతాదారులకు సంబంధించి ఎంత నగదు పోయిందో చెక్ చేసుకొని ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని వారికి పోలీసులు తెలిపారు. దీంతో చేసేదిలేక బ్యాంకు ఉన్నతాధికారుల ఆదేశాలతో మరో మేనేజర్‌ను నియమించి రహస్య విచారణ చేస్తున్నారు. దీనిపై బ్యాంకు సిబ్బంది స్పందించడం లేదు. ఖాతాదారులు మాత్రం ఆందోళన చెందుతున్నారు.

ఆమోదించాలా..? అడ్డు చెప్పాలా ?

తొలిసారి అజెండాలో 124 అంశాలు

'అత్యవసరం' పేరుతో ముందస్తు పనులపై అసంతృప్తి!

టీడీపీ, జనసేన కార్పొరేటర్ల మధ్య కుదరని స్నేహం

నగరంలో తాగునీరు, పారిశుధ్యం పట్టని పాలకవర్గం

నేడు ఒంగోలు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం



నగర కార్పొరేషన్ కార్యాలయం (ఫైల్)

ఒంగోలు కార్పొరేషన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరపాలక సంస్థ పాలకవర్గం నాలుగేళ్ళు పూర్తి చేసుకుని ఐదో సంవత్సరంలో అడుగుపెట్టినా ఇంకా బాలారిష్టాలు వెంటాడుతున్నాయి. పాలకవర్గం పెద్దలు తీసుకునే ఏకపక్ష నిర్ణయాలతో కొందరు కార్పొరేటర్లు దూరంగా ఉండగా, అధికారికంగా నిర్వహించే కార్యక్రమాలకు తమకు ఆహ్వానం లేకపోవడంపై దూరంగా ఉంటున్నారు. మరోవైపు డివిజన్‌లలో వేధిస్తున్న అభివృద్ధి పనుల సమస్య, పారిశుధ్యం, తాగునీటి సమస్యలపై చర్చించేవారు కరువయ్యారు. ఇదిలా ఉండగా మంగళవారం జరగనున్న పాలకవర్గ సమావేశంలో భారీగా అజెండాలో అంశాలు పొందుపరగా, అందులో ప్రజా సమస్యల కన్నా ముందస్తు ప్రగతి పనులకే ప్రాధాన్యత ఇవ్వగా అందులోనూ నగరంలోని యాభై డివిజన్‌లకు గాను ఓ పన్నెండు డివిజన్లకే ప్రాధాన్యత ఇవ్వడంపై పలువురు కార్పొరేటర్లు గుర్రుగా ఉన్నట్లు సమాచారం. సుమారుగా 54 అజెండా అంశాలలో పనులు చేయకుండానే ముందస్తు అనుమతులు ఇవ్వడంపైనా కొందరు కార్పొరేటర్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ముఖ్యంగా విపత్తులు, అత్యవసర సమయాల్లో మాత్రమే ఇనానిఫికేషన్ పనులు చేపట్టాల్సి ఉండగా, ఎలాంటి విపత్తులు లేకపోయినా, గతంలో పనులకు అంగీకారం తెలిపి, నేడు జరగనున్న కౌన్సిల్‌లో ర్యాటిఫికేషన్ ద్వారా ఆమోదం తెలిపేందుకు పాలకవర్గం పెద్దలు దృష్టి సారించారు. అత్యవసరం పేరుతో చేపట్టిన కొన్ని పనులు నేటికీ ప్రారంభించకపోగా వాటిని ఇప్పుడు ఆమోదించడానికి చర్చించడంపై పలువురు కార్పొరేటర్లు అసహనంగా ఉన్నట్లు తెలుస్తోంది. గడిచిన నాలుగేళ్లలో ప్రజా సమస్యలపై పెద్దగా నోరు విప్పని కొందరు కార్పొరేటర్లు చివరి సంవత్సరంలోనైనా ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తారా ? అనే చర్చ సాగుతోంది.

ఆ కార్పొరేటర్లు కలిసి వస్తారా ?

పాలకవర్గం ఏర్పాటైన తొలి రోజుల్లో ఏడుగురుతో ఉన్న టీడీపీ సభ్యులు గత ఏడాది ఎన్నికల తర్వాత క్రమంగా తమ బలాన్ని పెంచుకున్నారు. అయితే ఇటీవల కాలంలో వైసీపీని వీడి, మరో 20 మంది జనసేనలో చేరడంతో కూటమి సభ్యుల సంఖ్య 46కు పెరిగింది. అయితే ప్రస్తుతం వారి కూటమి పాలకవర్గం సంఖ్య పెద్దగానే ఉన్నప్పటికీ వారి మధ్య సమన్వయం కొరవడిందనే విషయం బహిరంగమే. అయితే నేడు జరిగే కౌన్సిల్ సమావేశంలో నిబంధనలకు వ్యతిరేకంగా అజెండాలో పొందుపరిచిన కొన్ని అంశాలను జనసేన కార్పొరేటర్లు ఆమోదించాలా ? వద్దా అనేది సందేహం వారిలో కనిపిస్తున్నట్లు సమాచారం.

అడ్డంకులు లేకుండా ఆమోదానికి చర్యలు

అయితే కౌన్సిల్ సభ్యుల మధ్య ఉన్న దూరంతో అంశాలు చర్చించి, ఆమోదించడంలో అడ్డంకులు లేకుండా ఉండేందుకు అధికారులు, పాలకవర్గం పెద్దలు చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఇప్పటికే టీడీపీ కార్పొరేటర్లు ఆమోదం తెలిపేందుకు సిద్ధంగా ఉండగా, జనసేనలో చేరిన కార్పొరేటర్లు ఆమోదించాలా ? అడ్డు చెప్పాలా ? మౌనంగా ఉండాలా ? అనే సందిగ్ధంలో ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తంగా తొలిసారిగా భారీ అజెండా అంశాలపై చర్చ సాదాసీదాగా సాగుతుందా? లేక ప్రజాసమస్యలపై వాడీవేడిగా చర్చిస్తారా ? అనేది చూడాల్సి ఉంది.

అందరినోట ఆ రెండు సమస్యలే..!

నగరంలో పారిశుధ్యం పరిస్థితి మరింత అధ్వానంగా ఉండటంతోపాటు, వేళాపాళా లేని తాగునీటి సరఫరాతో ప్రజల్లో అసంతృప్తి కనిపిస్తుంది. అటు అధికారుల మధ్య సమన్వయ లోపం, మరోవైపు సిబ్బందిలో బాధ్యతా రాహిత్యం ప్రధాన కారణంగా కనిపిస్తున్నది. ఇదిలా ఉంచితే నగరంలో వీధుల్లో ఎక్కడి చెత్త అక్కడే ఉండగా, నీటి సరఫరా వేళలో మార్పులు, పైపులైను మరమ్మతులు, నీటి శుద్ధిలేని నీటి సరఫరాపై పాలకవర్గం పనితీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి. కార్పొరేషన్ పాలకవర్గం ఏర్పాటు అయి సుమారు నాలుగేళ్లు పూర్తి కాగా, నేటికీ ప్రజల సమస్యలపై నోరు విప్పిన వారు లేకపోవడంపై అసహనం వ్యక్తం అవుతోంది. నేడు అత్యవసర పనులకు ఆమోదం తెలియజేస్తారా ? ప్రజల సమస్యలకు ప్రాధాన్యత ఇస్తారా అనేది చర్చనీయాంశమైంది.

అవీ..ఇవీ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి వెంకటనాయుడు

నగదు రహిత లావాదేవీలు నిర్వహించాలి

ఒంగోలు(రూరల్), మే5(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీలలో నగదు రహిత లావాదేవీల నిర్వహణకు గ్రామపంచాతీ కార్యదర్శులను సిద్ధం చేయాలని జిల్లాపంచాయతీ అధికారి జి .వెంకటనాయుడు అన్నారు. ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం టంగుటూరు, ఒంగోలు,కొత్తపట్నం ,మద్దిపాడు మండలాలకు చెందిన ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న డీపీవో మాట్లాడుతూ నగదు రహత లావాదేవీలకు డిమాండ్ నోటీస్‌లు కూడా జనరేట్ కావాల్సిన అవసరం ఉన్నదన్నారు. వసూలు చేసిన నగదు గ్రామపంచాయతీ ఖాతాలో జమ చేసి తరువాత జిల్లా గ్రంథాలయానికి పంపటం చేయాలన్నారు. గ్రామాలలో తాగునీటిసమస్య ఉన్నట్లయితే వెంటనే తెలియచేయాలన్నారు. ఈకార్యక్రమంలో నాలుగు మండలాల ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు పాల్గొన్నారు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 5(ఆంధ్రజ్యోతి) : విలేజ్‌హెల్త్ క్లినిక్‌లో గత ఆరేళ్ల నుంచి పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె సోమవారానికి ఏడవ రోజుకు చేరింది. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు చేస్తున్న సమ్మెకు ఏపీఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కే శరత్‌బాబు, ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డిలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిటీహెల్త్ ఆఫీసర్లు చేస్తున్న సమ్మెకు ఎన్‌జీవో సంఘం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీవో సంఘం ఒంగోలు తాలూకా అధ్యక్షుడు కొత్తపల్లి మంజేష్, అసోసియేషన్ నాయకులు ఎం. రాజేష్, శ్రీకాంత్, ప్రసన్న, జీవన్ జ్యోతి, జే రమేష్, రామాంజనేయులు, కామేష్ తదితరులు ఉన్నారు.



పొలాల్లో మట్టి నమూనాలను సేకరిస్తున్న ఏవో వెంకట్రావు

భూసార పరీక్షలు తప్పనిసరి

నాగులుప్పలపాడు, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి మూడేళ్లకోసారి రైతులు తప్పనిసరిగా తమ పొలాల్లో మట్టిని పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.వెంకట్రావు సూచించారు. వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో నాగులుప్పలపాడులోని రైతులకు మట్టి నమూనా సేకరణ, భూసార పరీక్షలపై అవగాహనా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి వెంకట్రావు మాట్లాడుతూ మట్టి పరీక్షలు చేయించి వాటి ఫలితాల ఆధారంగా భూమిలో సేంద్రియ కర్బనం, స్థూల పోషకాలు సూక్ష్మపోషకాలు, చౌడు లక్షణాలు, లవణ సూచిక గురించి తెలుసుకోవచ్చని తెలిపారు. తద్వారా రసాయన ఎరువులు తగిన విధంగా వాడుకోవచ్చని తెలియజేశారు. 2025-26 ఏడాదికి గాను 1,100 మట్టి నమూనాలు తీసి పరీక్షలకు పంపించనున్నట్లు సూచించారు. అనంతరం క్షేత్ర స్థాయిలో మట్టి నమూనాలను తీసే విధానాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



సమ్మర్ క్యాంపులో చిన్నారులు

చిల్డ్రన్ సమ్మర్ క్యాంపు ప్రారంభం

ఒంగోలు కలెక్టరేట్, మే 5 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం బాలోత్సవం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో చిల్డ్రన్ సమ్మర్ క్యాంపు ప్రారంభమైంది. మొదటి రోజు ఆటలు, పెపర్లతో బొమ్మలు వేయడం, పేపర్ కంటింగ్‌తో కొత్త ఆకారాలు చేయడం, వారి ఇష్టాలకు తగిన విధంగా, స్వేచ్ఛగా అడుతూ, పాడుతూ ఈ క్యాంపును నిర్వహించారు. వేసవిలో విద్యార్థులు సెల్‌ఫోన్, టీవీలకు బానిసలు కాకుండా వారిలో సృజనాత్మకతను బయటకు తీసేందుకు, దేశభక్తి భావాలు నింపేందుకు ఇటువంటి సమ్మర్ క్యాంపులు దోహద పడుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా కార్యదర్శి కే రమాదేవి, పీఎన్‌ఎం నగర కార్యదర్శి ఇంద్రజ్యోతి, వీరస్వామి, మ్యాజిక్ రామన్, వినోద్ ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

చీమకుర్తి,మేస్(ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రపాడు గ్రామంలో కిశోర బాలికలకు సైబర్‌నేరాలపై అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. సైబర్ నేరాలపై చిన్ననాటినుంచే అవగాహన కల్గి ఉండాలని మహిళా పోలీస్ మాదవి సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ,ఆశ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్జీదారులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దు

కలెక్టర్ అన్సారియా హెచ్చరిక



గ్రీవెన్స్‌లో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, మే 5(ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారం కోసం అర్జీదారులను ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటే సహించేది లేదని కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. వారి సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక కలెక్టరేట్ లోని గ్రీవెన్స్ హాలులో సోమవారం మీ కోసం కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పలు రకాల సమస్యలను విన్నవించారు. జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణతో కలిసి అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ఈసందర్భంగా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ మీ కోసం కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో అర్జీదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నందున ప్రతి ఒక్క అర్జీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టివాటికి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కారం చూపాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వచ్చిన అర్జీలను నిర్దేశించిన గడువులోపు పరిష్కరించాలన్నారు. అర్జీలు రీఓపెన్ కాకుండా చూసుకోవాలని ఆదేశించారు. అధికారులు ప్రతిరోజూ లాగిన్ అయ్యి ఆన్‌లైన్‌లో వచ్చిన వినతులను చూడాలన్నారు. సాంకేతిక సమస్యల వల్ల క్షేత్ర స్థాయిలో పరిష్కరించలేని అర్జీలు వస్తే ఆ విషయాన్ని ప్రజలకు అప్పుడే స్పష్టంచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి. చిన ఓబులేషు, డిప్యూటీ కలెక్టర్లు జాన్సన్, పార్థసారథి, వరకుమార్, విజయజ్యోతి తదితరులు ఉన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 80 ఫిర్యాదులు



ఫిర్యాదుదారుల సమస్యను వింటున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు క్రైం, మే5(ఆంధ్రజ్యోతి):పోలీసు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వివిధ ప్రాంతాలనుంచి 80 మంది తమ సమస్యలను ఎస్పీ ఏఆర్.దామోదర్‌కు విన్నవించారు. సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో జిల్లాలోని పలుప్రాంతాల నుంచి తమ సమస్యలను ఎస్పీకి నేరుగా విజ్ఞప్తి చేశారు. దీంతో సంబంధిత అధికారులకు ఫోన్ చేసి చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చారు. గ్రీవెన్స్‌లో భూవివాదాలు, చీటింగ్ కేసులు ఉన్నాయి. కార్యక్రమంలో మహిళ పోలీసు స్టేషన్ డీఎస్పీ రమణకుమార్, ఒంగోలు రూరల్ సీఐ ఎన్.శ్రీకాంత్ బాబు,ట్రాఫిక్ సీఐ పాండురంగారావు,సీసీఎస్ సీఐ జగదీష్ తదితరులు ఉన్నారు.

తర్లుపాడు పోలీసు స్టేషన్‌కు డ్రోన్ కెమెరా అందజేత

తర్లుపాడు పోలీసు స్టేషన్‌కు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వెలుగు కాశీరావు డ్రోన్ కెమారాను ఎస్పీ ఏఆర్. దామోదర్‌కు అందజేశారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డ్రోన్ కెమెరా అందజేసిన కాశీరావును ఎస్పీ అభినందించారు.

ఎస్టీ వర్గీకరణ చేసి యానాదులకు న్యాయం చేయాలి



ధర్నాలో మాట్లాడుతున్న యానాది రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పెంచయయ్య

ఒంగోలు కలెక్టరేట్, మే 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అన్ని విధాలుగా వెనుకబడిన యానాదులకు మేలు చేకూర్చేందుకు ఎస్టీ వర్గీకరణ చేపట్టాలని యానాది రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్యయానాది డిమాండ్ చేశారు. సమితి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాకు జిల్లా అధ్యక్షుడు కే మాల్యాద్రి అధ్యక్షత వహించారు. ధర్నాలో పెంచలయ్య యానాది మాట్లాడుతూ రాష్ట్రంలో పదిలక్షల మంది యానాదులు ఉన్నారన్నారు. గిరిజన తెగలలో అత్యధికంగా యానాదులు ఉన్నా అన్ని విధాలుగా వెనుకబడి ఉన్నారని తెలిపారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నందున ఎస్సీ వర్గీకరణ మాదిరిగా ఎస్టీ వర్గీకరణ చేసి యానాదులకు ఉద్యోగ, రిజర్వేషన్ల పరంగా మేలు చేకూర్చాలన్నారు. టీడీపీ ప్రభుత్వ హయంలో నెల్లూరులో ప్రత్యేకంగా ఐటీడీఏ కార్యాలయాన్ని ఏర్పాటు చేసిందని, అయితే తదనంతరం అధికారంలో ఉన్న కాంగ్రెస్, వైసీపీ ప్రభుత్వాలు దాన్ని నిర్వీర్యంచేసిందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉన్న యానాదులకు న్యాయం చేసేందుకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరారు. యువగళం పాదయాత్రలో యువనేత నారా లోకేష్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి పిట్ల భాస్కరరావు, చేవూరు సుబ్బారావు, బాపట్ల బ్రహ్మయ్య, చలంచర్ల పెద బ్రహ్మయ్య, మాకాని హనుమంతరావు, చేవూరు దుర్గాప్రసాద్, నాగరాజు, చెంబేటి ఉష, కల్లూరి వరలక్ష్మి, జున్ను కళ్యాణి తదితరులు ఉన్నారు.

విపత్తులపై ముందస్తుగా జాగ్రత్త చర్యలు తీసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 5(ఆంధ్రజ్యోతి) : ప్రకృతి విపత్తుల సమయంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా చూడాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ఈ దిశగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో ఉరుములతో కూడిన వర్షం,గాలి దుమారం ఉంటుందని వాతావరణ శాఖహెచ్చరించిన నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణతో కలిసి సోమవారం మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇలాంటి విపత్తుల సమయంలో గ్రామ స్థాయి సిబ్బంది అందరూ క్షేత్ర స్థాయిలోనే ఉండాలన్నారు. పిడుగుపాటుకు దారితీసే పరిస్థితులు, ఆయా సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. డప్పు చాటింపుతో పాటు ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. వాతావరణ మార్పులపై ప్రభుత్వం నుంచి ఎప్పటికప్పుడు వస్తున్న హెచ్చరికలను గమనించి ఆయా విషయాలను ప్రజలకు చేరవేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేషుతో పాటు అధికారులు ఉన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా, అధికారులు

అప్రమత్తంగా ఉండాలి

మద్దిపాడు :ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎలాంటి ప్రాణ నష్టం లేకుండా జాగ్రత్త వహించాలని ఎంపీడీవో శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ విపత్తుల సమయంలో గ్రామీణ స్థాయి సిబ్బంది అందరూ క్షేత్రస్థాయిలో ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో డప్పు చాటింపు, ప్రచార మాధ్యమాల ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.

రొయ్యల చెరువుల తవ్వకాలు నిలుపుదల చేయాలి

ఒంగోలు(రూరల్), మే 5(ఆంధ్రజ్యోతి) : : కొప్పోలు గ్రామం రెవెన్యూపరిధిలోని నల్లవాగుకు దక్షిణం వైపున అడ్డగోలుగా చేపట్టిన రొయ్యల చెరువుల అక్రమ తవ్వకాలను వెంటనే నిలుపుదల చేయాలని కొప్పోలు గ్రామరైతులు సోమవారం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు విన్నవించుకున్నారు. ఈ మేరకు ఒంగోలు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో కొప్పోలు గ్రామరైతులు వినతి పత్రం అందజేశారు. వెంకటరత్నం, శ్రీనివాసరావు, ప్రభావతి, తదితర గ్రామరైతులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

మద్దిపాడు, మే 5(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ నారాయణ రెడ్డిని సోమవారం వీఆర్‌ఏ సంఘ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సంఘ నాయకుడు యాదాల రాజు మాట్లాడుతూ వీఆర్‌ఏల సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో రాఘవులు, ఉన్నం సావిత్రి, పూనూరి నరసయ్య, తోట పూర్ణచంద్రరావు, ఇస్రాయిల్, అనిల్ ఉన్నారు.



టీడీపీ కార్పొరేటర్లతో సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల

డివిజన్ సమస్యలపై దృష్టి సారించాలి

- ఎమ్మెల్యే దామచర్ల
- టీడీపీ కార్పొరేటర్లతో సమావేశం

ఒంగోలు, కార్పొరేషన్, మే 5 (ఆంధ్రజ్యోతి): డివిజన్లలో పర్యటించి, ప్రజల సమస్యలు తెలుసుకోవాలని ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ సూచించారు. సోమవారం ఒంగోలులోని ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ కార్పొరేటర్లతో ఎమ్మెల్యే సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ అభివృద్ధి పనులు చేసే విషయంలో వెనకడుగు వేయవద్దన్నారు. ప్రజలతో మాట్లాడి తన దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే అధికారులతో మాట్లాడి ప్రతిపాదనలు కోరాలని తెలిపారు. ముఖ్యంగా డివిజన్లలో ప్రజలతో మాట్లాడి పారిశుధ్యం, తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలని తెలిపారు. సమావేశంలో మేయర్ గంగాడ సుజాతతోపాటు, డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, ఇతర టీడీపీ కార్పొరేటర్లు పాల్గొన్నారు. అంతకుముందు కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు దామచర్ల శంకుస్థాపన చేశారు. స్థానిక 15వ డివిజన్‌లోని రామనగర్‌లో రూ. 60 లక్షలతో గ్రీన్‌బెల్ట్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత 16వ డివిజన్‌లోని ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాతతోపాటు, స్థానిక డివిజన్ కార్పొరేటర్లు, కమిషనరు కే. వెంకటేశ్వరరావు, ఎంతః చంద్రయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జూనియర్ లెక్చరర్ల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు విద్య, మే 5(ఆంధ్రజ్యోతి) : కాంట్రాక్టు జూనియర్‌లెక్చరర్ల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టు లెక్చరర్ల జేఏసీ నాయకులు కోరారు. సోమవారం ఉండవల్లిలో విద్యాశాఖమంత్రి నారా లోకేషను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు.మంత్రిని కలిసిన వారిలో జేఏసీ రాష్ట్ర చైర్మన్ కుమ్మరికుంట సురేష్, కో చైర్మన్ కల్లూరు శ్రీనివాస్‌లు ఉన్నారు.

ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 12నుంచి జరగనున్న ఇంటర్మీడియేట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక క లెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో పరీక్షల నిర్వహణపై పలు శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మొదటి సంవత్సరం విద్యార్థులు 15,428 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 5,309 మంది పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. అందుకోసం జిల్లాలో46 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 12వతేదీ నుంచి జరిగే పరీక్షలు ఉదయం 9గంటలకు మొదటి సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం 2.30 గంటలకు రెండవ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుతో పాటు పరీక్షా కేంద్రాల సమీపంలోని జెరాక్స్‌సెంటర్లను మూసి వేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటితో పాటు విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో సీసీకెమెరాలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జేసీ ఆదేశించారు. జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్, ఆర్‌ఐవో ఎ. సైమన్‌విక్టర్ మాట్లాడుతూ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేషుతో పాటు పలు శాఖల అధికారులు ఉన్నారు.

నేటి నుంచి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు

నాగులుప్పలపాడు, మే 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నాగులుప్పలపాడులో వేంచేసిన శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి 61వ వార్షిక ఆరాధనోత్సవాలు నేటి నుంచి 12 వరకు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ స్వామి వార్లకు విశేష పూజలు, వాహన సేవలు, గ్రామోత్సవం, 12న స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

షిర్డీ సాయి పాదుకలకు చీమకుర్తిలో ఘనస్వాగతం

చీమకుర్తి, మే5 (ఆంధ్రజ్యోతి): షిర్డీ నుంచి విచ్చేసిన సాయిబాబా ఉపయోగించిన పాదుకలు సోమవారం చీమకుర్తి సాయిసంత్సంగ కేంద్రానికి చేరుకున్నాయి.సాయి భక్తులు పాదుకలకు హారతులు ఇచ్చి పెద్దఎత్తున స్వాగతం పలికారు.పాదుకలను భక్తులు సందర్శించి పూజలు జరిపారు. పాదుకలు తీసుకువచ్చిన షిర్డీ సంస్థాన్ నిర్వాహకులను ఘనంగా సత్కరించారు.

పదిలో ప్రతిభ చాటిన వారికి సత్కారం

పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించి ప్రతిభచాటిన కాపు విద్యార్థినులకు సోమవారం జిల్లా కాపుసంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. చీమకుర్తికి చెందిన రౌతు తేజోవర్షిత 597 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొందింది. మరో విద్యార్థిని ఉక్కలం లక్ష్మీమేఘన 580 మార్కులు సాధించింది. వీరిద్దరిని టీడీపీ జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి అవిశినేని వెంగన్న ఘనంగా సత్కరించి,బహుమతులు అందచేసి అభినందించారు.

మెట్లమీద నుంచి జారి పడి ఏఆర్ కానిస్టేబుల్ మృతి


ఒంగోలు క్రైం, మే5(ఆంధ్రజ్యోతి) ఇంట్లో మెట్లమీద నుంచి జారి పడి ఏఆర్ కానిస్టేబుల్ నున్నా రమణయ్య(51) మృతి చెందాడు. ఈ సంఘటన స్థానిక భాగ్యనగర్ 4వ లైన్ నవ్య ఎన్‌క్లేవ్ ప్లాట్ నంబరు 102 లో సోమవారం జరిగింది. ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న రమణయ్య ఉదయం నెల్లూరు బస్టాండ్‌లో డ్యూటీ చేసి ఇంటికి వెళ్లాడు. ఇంటి ముందు ఉన్న నీళ్ల డ్రమ్ములు నుంచి కారిన నీటిపై అడుగు వేసి జారి పడి మృతి చెందినట్లు అయన భార్య శివరంజని ఫిర్యాదు చేసింది. ఈమేరకు ఒంగోలు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇరువురి అరెస్టు

పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఇరువురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని వారి వద్ద 2కిలోల 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం స్థానిక పార్వతమ్మ గుడి వద్ద నివాసం ఉంటున్న పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కత్తా కు చెందిన షాజుద్దీన్ సర్ధార్, గులాం మండల్ లు ఎంబ్రాయిడింగ్ పనులు చేస్తూ జీవిస్తున్నారు. వారు పశ్చిమబెంగాల్ నుంచి గంజాయి తెచ్చి విక్రయిస్తుండగా స్పెషల్ స్క్వాడ్ పోలీసులు ఇరువురను అదుపులోకి తీసుకొని ఒంగోలు వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● ఆస్తమా అంటే..?

ఊపిరితిత్తులోని వాయునాళాలకు వచ్చే సమస్యను ఆస్తమా అంటారు. దీనికి మూలం అలర్జీ, శ్వాసనాళాలు పూర్తిగా సంకోచించి వాపు మూలంగా శ్లేష్మం ఎక్కువగా తయారై ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు రావడం, ఒక్కోసారి ప్రాణాలు కూడా పోయే అకాశం ఉంది. లక్షణాల ఆధారంగా ముందుగానే గుర్తించి చికిత్స తీసుకోవడం ఉత్తమం.



● కారణాలు.. లక్షణాలు...

దీర్ఘకాలికంగా దుమ్మూ, దూళిలో పనిచేయడం, పొగతాగడం, పెంపుడు జంతువుల వెంట్రుకలు, రసాయనాలకు ఎక్కువగా గురికావడం వలన ఆస్తమా సోకవచ్చు. దీర్ఘకాలికంగా దగ్గు, చాతీ పట్టేసినట్లు ఉండటం, శ్వాస తీసుకునేటప్పుడు పిల్లికూతలు రావడం, అలసట, శ్వాస ఆడకపోవడం, చర్మం లేదా పెదవులు నీలం రంగులోకి మారడటం వంటి మార్పులు కనిపిస్తాయి




● గుర్తించడం ఎలా ?

ఎక్స్‌రేల ద్వారా వ్యాధి వచ్చిందా, లేదా అని నిర్ధారణ చేసుకోవచ్చు. పల్మరీ ఫంక్షన్ నిర్ధారణ పరీక్ష ద్వారా కూడా పూర్తిస్థాయిలో రోగి ఊపిరితిత్తుల పనితీరు తెలుసుకోవచ్చు. అలాగే వంశనుగత చరిత్ర, అలర్జీ, ఎగ్జిమాకు సంబంధించిన పరీక్షలు, ముక్కు, గొంతు, చాతీ పరీక్షలు, కఫం పరీక్ష, చర్మ పరీక్షలు, శ్వాసమీటర్ పరీక్ష ద్వారా తెలుస్తుంది.

ఆస్తమానం ఇబ్బందే..!


ఈ వ్యాధికి దూమపానం.. వాయు కాలుష్యమే కారణం

నేడు ఆస్తమా వ్యతిరేక దినం



• అందుబాటులో వైద్యం • రిమ్స్‌లోనూ ప్రత్యేక వార్డు ఏర్పాటు

ఒంగోలు, కార్పొరేషన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత రోజుల్లో ఆస్తమా(ఉబ్బసం)తో బాధపడుతున్నవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇది దీర్ఘకాలిక వ్యాధిగా వైద్యులు చెబుతున్నారు. ఒక్కసారి వచ్చిందంటే జీవితాంతం కొనసాగుతూనే ఉంటుందని పేర్కొంటున్నారు. ఈ వ్యాధిని పల్మనరీ ఫంక్షన్ వైద్య పరీక్ష ద్వారానే నిర్ధారించవచ్చని చెబుతున్నారు. అవగాహన, ముందస్తు జాగ్రత్తలతో ఈ వ్యాధి బారినపడకుండా ఉండవచ్చు. నేడు ప్రపంచ ఆస్తమా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి కథనం.



ముఖ్య లక్ష్యమిదే...

2025 ప్రపంచ ఆస్తమా దినోత్సవం ముఖ్య లక్ష్యం అందరికీ పీల్చే చికిత్సలను అందుబాటులోకి తీసుకురావడం. ఆరోగ్యంపై ఆస్తమా దాడులను నివారించడానికి కీలకమైన కార్టికోస్టెరాయిడ్స్ వంటి వాటికి ముఖ్యమైన ఇన్హేలర్ మందులే సమానమనే ప్రాధాన్యతను నొక్కి చెబుతుంది. ఇన్హేలర్ చికిత్సలను అందుబాటులోకి తీసుకురావడంతోపాటు ఆస్తమా సంబంధిత ఆస్పత్రిలో చేరడం ద్వారా వైకల్యాలు, మరణాలను తగ్గించడమే ఈ దినోత్సవం లక్ష్యంగా పెట్టారు.

నివారణ చర్యలు

బ్రాంకోడైలేటర్స్, కార్టికోస్టిరాయిడ్స్, యాంటీబయోటిక్స్, నాసిల్ స్ప్రే మందులు వాడితే ఉపశమనం కలుగుతుంది. వీటిని దీర్ఘకాలికంగా వాడటం వలన దుష్ప్రభావాలు కలుగుతాయి. పిల్లల్లో ఎదుగుదల ఆగిపోవడంతో పాటు, మానసిక ఆందళన, బరువు పెరగడం, జ్ఞాపకశక్తి లోపించడం వంటి ఇతర సైడ్ ఎఫెక్ట్ వస్తాయి. వీలైనంతవరకు వాటికి దూరంగా ఉండటంతోపాటు మెడిటేషన్, యోగా క్రమం తప్పకుండా చేయడం ద్వారా ఉపశమనం పొందవచ్చు.



చల్లని గాలిలో తిరగకూడదు. వర్షంలో తడవకూడదు. పడని పదార్థాలు తినకూడదు. మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలి. అవకాశం ఉన్నప్పుడల్లా వేడి నీరు తాగడం అలవాటు చేసుకోవడం తోపాటు, దూమపానం, గాలి, దుమ్ముకు దూరంగా ఉండాలి.

ఆస్తమా నియంత్రణకు కార్యాచరణ

డాక్టర్ రంజిత్ బాషా, పల్మనాలజి హెచ్ఓడీ, జీజీహెచ్



ఆస్తమా వస్తే ఇన్‌హేలర్ వాడాల్సి ఉంది. దానిని వాడలేని వృద్ధులు, చిన్నారులు నెబులైజర్ ఉపయోగించాలి. ఇది జీవితాల సమస్య కాబట్టి నిరంతరం చికిత్స అవసరం. అస్తమా బారినపడినవారు మాస్కులు, కర్చీఫ్ ధరించాలి. మందులు వాడుతుంటే తగ్గినట్టుగా ఉందని మధ్యలోనే ఆపివేయకూడదు. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ప్రాణాంతకంగా మారే అవకాశం ఉంది. ఒంగోలు జీజీహెచ్‌లో ఆస్తమా రోగుల కోసం ప్రత్యేక వార్డులను కూడా ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ మహిళా ఉద్యోగుల ప్రసూతి సెలవులు పెంపు

ఒంగోలు విద్య, మే 5 (ఆంధ్రజ్యోతి) : వివాహితులైన మహిళా ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వివాహిత అయిన ప్రభుత్వమహిళా ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగినులతో సమానంగా 180 రోజులకు పెంచుతూ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి పీయూష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ప్రసూతి సెలవులు 120 రోజులు(నాలుగు నెలలు) మాత్రమే ఇచ్చేవారు. ఇక నుంచి 180 రోజులు అంటే ఆరు నెలలు పూర్తి జీతంలో వినియోగించుకొనేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఇప్పటి వరకు ఇద్దరు జీవించి ఉన్న పిల్లలకు మాత్రమే ప్రసూతి సెలవులు మంజూరు చేసేవారు. జనాభాపెంపుపై ఇటీవల కాలంలో ప్రభుత్వం గట్టిగా ఫోకస్ పెట్టింది. ముఖ్యమంత్రి కూడా జనాభా పెంపుదలకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ప్రసూతి సెలవు మంజూరుకు ఇద్దరు పిల్లల నిబంధనను తొలగించారు. దీంతో ఎంత మంది పిల్లలున్నా వివాహిత మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు మంజూరు చేస్తారు.

మళ్లీ మారిన ప్రత్యేక తరగతుల పనివేళలు



పదో తరగతి విద్యార్థులు

ఒంగోలు విద్య, మే 5 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతిలో ఫెయిలైన విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల పనివేళలు మళ్లీ మారాయి. క్షేత్ర స్థాయిలో సాధ్యాసాధ్యాలను పరిగణనలోకి తీసుకోకుండా విద్యాశాఖ ఉన్నతాధికారులు అదరబదరా ఉత్తర్వులు జారీ చేయడం,దానిపై వ్యతిరేకత రావడంతో వాటిని మళ్లీ సవరించడం అధికారులకు పరిపాటిగా మారింది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఏప్రిల్ 28 నుంచి జిల్లాలో ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 8నుంచి 12 గంటల వరకు ప్రతిరోజూ తరగతుల నిర్వహణకు షెడ్యూల్ ఇచ్చారు. ఇదిలా జరుగుతుండగా ఈనెల 1నుంచి పాఠశాల విద్యాక మిషనర్ ప్రత్యేక తరగతుల నిర్వహణకు ఉత్తర్వులు ఇచ్చారు. ఆ ఉత్తర్వుల మేరకు రోజూ ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు తరతులు నిర్వహించాలి. సెలవు దినాలు, పండుగ రోజుల్లో కూడా ప్రత్యేక తరగతులు నిర్వహించాలి. అయితే కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులపై ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. మండుతున్న ఎండల్లో రెండుపూటల తరగతుల నిర్వహణ ఏలా అని టీచర్లు ప్రశ్నించారు. క్షేత్ర స్థాయిలో వ్యతిరేకత రావడంతో ప్రత్యేక తరగతుల పనివేళలను మళ్లీ సవరించారు. ఉదయం 8నుంచి 11.45 గంటల వరకు మాత్రమే నిర్వహించాలని కమిషనర్ తాజాగా ఆదేశాలు జారీ చేశారు. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న టీచర్లకు ఎరన్ లీవులు మంజూరు చేయాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న మంజుల, సంఘ నేతలు

తీవ్ర ఒత్తిడిలో విద్యారంగం

ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల

ఒంగోలు విద్య, మే 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అనుసరిస్తున్న అస్తవ్యస్త విధానాలతో రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం తీవ్ర ఒత్తిడికి గురవుతుందని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు సిహెచ్. మంజుల ఆందోళన వ్యక్తం చేశారు. 117 జీవో రద్దు అనంతరం ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు, పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ, టీచర్ల పునర్విభజనకు వ్యతిరేకంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాలో మంజుల మాట్లాడుతూ దశాబ్దాల నుంచి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలల వ్యవస్థ కుప్పకూలిపోయే ప్రమాదం పొంచి ఉందని విమర్శించారు. ప్రాథమిక పాఠశాలల స్థానంలో 1, 2 తరగతులతో ఫౌండేషనల్ స్కూళ్లు వేల సంఖ్యలో ఏర్పాటు చేస్తూ ప్రాథమిక విద్యకు విఘాతం కలిగిస్తున్నారని ఆరోపించారు. పాఠశాలలకు టీచర్ల కేటాయింపులో శాస్త్రీయత లోపించిందన్నారు.ఒకరకమైన పాఠశాలలకు ఒక్కొక్క విధమైన ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి పాటిస్తూ పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు.ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బి. శేషారావు, పి. హనుమంతరావు, శేఖర్‌రెడ్డి, కె. తిరుమల, కె. రవి, జేవీఆర్, యోహాన్‌రెడ్డి, బషీరున్నీసా తదితరులు ఉన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి రూ.15.63లక్షల ఆదాయం

సింగరాయకొండ, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలో దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధి గాంచిన వరాహ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వచ్చేనెల 6 నుంచి 16 వరకూ జరగనున్నాయి. ఈ సందర్భంగా రంగుల రట్నాలు నడుపుకోవడం, కొబ్బరిచిప్పలు పోగు చేసుకోవడం, టెంకాయలు, కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీం అమ్ముకొనేందుకు ఆలయంలో సోమవారం దేవదాయ అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు.



లక్ష్మీనరసింహస్వామి

రంగులరాట్నం వేలంపాటకు పలువురు పోటీ పడ్డారు. మోర్ల ప్రసన్నలక్ష్మి రూ.12.10లక్షలకు దక్కించుకున్నారు. కొబ్బరికాయులు అమ్ముకునే హక్కును సింగరాయకొండకు చెందిన కోలపర్తి రాజశేఖర్ రూ.1.91లక్షలకు సొంతం చేసుకున్నారు. కొబ్బరిచిప్పలు పోగుచేసుకునే హక్కును వరికుంట ఆంజనేయులు రూ.1.10 లక్షలకు.. లడ్డు, కలకండ అమ్ముకునే హక్కును కూడా ఆయనే రూ.52,500కు దక్కించుకున్నారు. కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీం విక్రయాలకు సంబంధించిన పాటకు ఎవ్వరూ ముందుకురాకపోవడంతో మరోరోజు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. వేలంపాటలో కందుకూరు దేవదాయ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఈవో కృష్ణవేణి, ప్రధాన అర్చకులు ఉదయగిరి వెంకట శేషాలక్ష్మీనరసింహాచార్యులు, రికార్డు అసిస్టెంట్ బాపట్ల బ్రహ్మయ్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

రెవెన్యూ అధికారులకు మంత్రి స్వామి ఆదేశం

పొన్నలూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ అధికారులు ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సూచించారు. స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సమస్యల పరిష్కార వేదికలో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కార మార్గాలను తెలియజేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి వివిధ సమస్యలపై అర్జీలను అందజేశారు. సాంఘిక సంక్షేమశాఖ డీడీ లక్ష్మానాయక్, కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, మైనారిటీ వెల్ఫేర్ అధికారి పార్థసారథి, తహసీల్దార్ పుల్లారావు, ఎంపీడీవో సుజాత, వీఆర్వోలు పాల్గొన్నారు.



వృద్ధుడు ఇచ్చిన అర్జీని పరిశీలిస్తున్న మంత్రి స్వామి

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు

అక్రమ కేసులు పెడితే తీవ్ర పరిణామాలు

సంపద సృష్టిస్తామని చెప్పి అమరావతిలో దోపిడీ

అన్ని వర్గాల ప్రజలను ముంచిన కూటమి ప్రభుత్వం

ఒంగోలు కలెక్టరేట్, మే 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ వైసీపీ కార్యకర్తలపై అక్రమ కేసులను బనాయిస్తున్నారని వైసీపీ జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు ఆరోపించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీసులు టీడీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక విస్మరించిందని విమర్శించారు. పంటలకు గిట్టుబాటు ధరలు కూడా కల్పించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. అమరావతిలో సంపదసృష్టిస్తామని చెప్పి రాజధాని పేరుతో చంద్రబాబు దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో వైసీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతూ వేధింపులకు పాల్పడుతున్నారన్నారు. వైసీపీ అధికారంలోకి వస్తే కార్యకర్తల చేత అక్రమ కేసులు పెట్టిస్తామని హెచ్చరించారు. పోలీసు అధికారులను కూడా వదిలిపెట్టేది లేదన్నారు. వైసీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు.



మాట్లాడుతున్న నాగేశ్వరరావు, పక్కన నాగార్జున, చెవిరెడ్డి, బూచేపల్లి

ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలతో భేటి

తొలుత జిల్లాలో జరుగుతున్న పరిణామాలపై వైసీపీ జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు సమావేశమయ్యారు. ఆయా నియోజకవర్గాలవారీగా అక్రమ కేసులు బనాయింపులు, కార్యకర్తలపై వేధింపులపై చర్చించినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ మంత్రి మేరుగ నాగార్జున, నియోజకవర్గ ఇన్‌చార్జులు అన్నా రాంబాబు, నారాయణ, చుండూరి రవిబాబు, బత్తుల బ్రహ్మానందరెడ్డి ఉన్నారు.

విద్యుత్ అధికారుల బద్ధకం

యానాది కాలనీలో చెట్టుకు లైటు బిగించిన వైనం

స్తంభం తెచ్చినా పాతకుండా పక్కన పడేసిన సిబ్బంది

కంభం, మే 5 (ఆంధ్రజ్యోతి) : కంభం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఇరిగేషన్ కాలువ పక్కనే ఉన్న యానాది కాలనీలో విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ స్తంభానికి బిగించాల్సిన వీధిలైట్లను అక్కడున్న వెలగచెట్టుకు బిగించి చేతులు దులుపుకున్నారు. వివరాల్లోకి వెళితే.. బస్టాండ్ దగ్గరలో మీ-సేవ పక్కన సుమారు 10 యానాది కుటుంబాల వారు నివసిస్తున్నారు. వీరంతా కంభం పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్నారు. వీరు నివసించే గృహాల చుట్టూ దట్టంగా చిల్లచెట్లు పెరిగి ఉండడంతో పారిశుధ్య వారు చీకట్లో ఇళ్లకు వెళ్లడం ఇబ్బందిగా మారింది. దీంతో విద్యుత్ స్తంభం బిగించి వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరగా అధికారులు స్తంభం తెచ్చి దానిని పాతేందుకు బద్ధకించారు. స్తంభాన్ని అక్కడే పడవేసి పక్కనే ఉన్న వెలగచెట్టుకు వీధి లైటును బిగించి కనెక్షన్ ఇచ్చారు. స్తంభం పాతకుండా చెట్టుకు లైటు ఎందుకు బిగించారని కార్మికులను ప్రశ్నించగా అధికారులు గుంత తీసేందుకు డబ్బులు అడగ్గా తమ వద్ద లేవని చెప్పడంతో చెట్టుకు బిగించి వెళ్లారని యానాదులు చెబుతున్నారు. గాలి, వర్షం కురిసే సమయంలో చెట్టు కొమ్మలు ఊగి కరెంటు వస్తూ పోతూ ఉంటుందని తెలిపారు.రెండు విద్యుత్ స్తంభాలను పాతి వీధిలైట్లు బిగించాల్సిన అధికారులు ఇలా నిర్లక్ష్యంగా చెట్ల కొమ్మలకు తీగలు అల్లి లైటు బిగించడంపై విమర్శలు వస్తున్నాయి. ఈవిషయమై విద్యుత్ ఏఈని వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.



వెలగచెట్టుకు ఏర్పాటు చేసిన లైటు

ప్రకృతి వ్యవసాయ కూరగాయల విక్రయం

కొండపి, మే 5 (ఆంధ్జ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో రైతులు పండించిన కూరగాయలు, ఆకుకూరలను ఆశాఖ సిబ్బంది స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం విక్రయించారు. వ్యవసాయాధికారి విజయ్‌కుమార్ పరిశీలించారు. ఈ కూరగాయాలను తినడం వలన ఆరోగ్యంగా ఉండవచ్చని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ వీటిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి రంజిత్‌కుమార్, ఏఈవో కుమార్, ఐసీఆర్పీలు జ్యోత్స్న, గౌతమి, మాలకొండయ్య పాల్గొన్నారు.

ఇకనైనా ఆర్టీసీ బస్టాండ్‌ను నిర్మిస్తారా..?

- రోజూ రాష్ట్ర నలుమూలల నుంచి దోర్నాలకు బస్సులు
- వందల సంఖ్యలో యాత్రికుల ప్రయాణం
- వసతుల కల్పనపై అధికారుల తాత్సారం

పెద్ద దోర్నాల, మే 5 (ఆంధ్రజ్యోతి) : దిగువ శ్రీశైలంగా పిలిచే దోర్నాలలో ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం కలగానే మిగిలిపోయింది. దక్షిణ కాశీగా ప్రఖ్యాతి గాంచిన పుణ్యక్షేత్రం శ్రీశైలంలో కొలువైన శ్రీభ్రమరాంబికా మల్లికార్జున స్వామివార్లను దర్శించుకునేందుకు రాష్ట్ర ప్రజలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, హర్యానా, గుజరాత్ వంటి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి వెళ్తుంటారు. శ్రీశైలం వెళ్లాలంటే దోర్నాల మీదుగా ప్రయాణించాల్సిందే. అంతేగాక మామూలు గానే విజయవాడ, పుట్టపర్తి, అనంతపురం, కర్నూలు, మహానంది, బెంగళూరు, రాయ్‌చూర్, విశాఖపట్నం, కాకినాడ, మచిలీపట్నం, తణుకు, విజయనగరం, కడప, తిరుపతి, ఎమ్మిగనూర్, హైదరాబాద్ తదితర ముఖ్య పట్టణాలకు దోర్నాల నుంచి నేరుగా బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. రోజూ వందకు పైగా బస్సులు, వేల సంఖ్యల్లో యాత్రికులు ప్రయాణిస్తున్నారు. ఇంత రద్దీ, ఆదాయం ఉన్నప్పటికీ బస్టాండ్‌ను నిర్మించే విషయంలో ఆర్టీసీ అధికారులు ఎందుకు చొరవచూపడం లేదని ప్రయాణికులు అసహనం


దోర్నాల బస్టాండ్ స్థలంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రేకుల షెడ్డు

వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. వసతి, తాగునీరు, మరుగుదొడ్లు లేక పిల్లలు, వృద్ధులతో ఇక్కట్లకు గురవుతున్నట్లు చెప్తున్నారు. వర్షాకాలంలో బస్సులు నిలిపే చోట బురద, గుంతల్లో మురుగు నీరు చేరి బస్సు ఎక్కేందుకు పడుతున్న ఇబ్బందులు చెప్పలేనివి. ఎండాకాలం పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది.

రేకుల షెడ్డే దిక్కు

దోర్నాలలో ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం కోసం అనువైన స్థలం లభించందనే చెప్పవచ్చు. కేంద్రం నడిబొడ్డున నటరాజ్ కూడలిలో ఆర్‌అండ్‌బీ స్థలం అక్కరకు వచ్చింది. దోర్నాల పరిధిలోని రోడ్లన్నీ జాతీయ రహదారులుగా మారడంతో ఎకరంపైగా ఉన్న ఆర్‌అండ్‌బీ స్థలంలో 43సెంట్ల భూమిని ఆర్టీసీకి కేటాయించారు. అయితే బస్టాండ్ నిర్మాణానికి నిధులు కూడా మంజూరయ్యాయి. అయితే పట్టణానికి చెందిన కొందరు తమదంటూ కోర్టును ఆశ్రయించడంతో పనులు నిలిచిపోయాయి. ఈ క్రమంలో అయినముక్కల గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ వెంకట రమణారెడ్డి యాత్రికుల సౌకర్యార్థం సొంత నిధులతో తాత్కాలికంగా రేకుల షెడ్డును నిర్మించారు. ఆ షెడ్డే కొంతవరకు ప్రయాణికులకు దిక్కయింది. ఎక్కువ మంది ఇక్కడ తలదాచుకునేందుకు వీలుపడదు. పలువురు బస్టాండ్ ఆవశ్యకతపై ఆర్టీసీ ఎండీకి, ప్రజాప్రతినిధులకు ఎన్నో సార్లు వినతి పత్రాలు అందజేశారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు కలెక్టర్ అన్సారియా, సబ్ కలెక్టర్ వెంకట సహదిత్‌ను స్థలం చూపించి పరిస్థితిని వివరించారు. ఇకనైనా బస్టాండ్ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

వైభవంగా పట్టాభిరాముని వార్షికోత్సవం

బండలాగుడు పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

బేస్తవారపేట, మే 5 (ఆంధ్రజ్యోతి) : బేస్తవారపేట మండలంలోని జేసీ అగ్రహారం గ్రామంలో శ్రీ పట్టాభిరామ స్వామి 9వ వార్షికోత్సవం వైభవంగా జరుగుతోంది. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలను అశోక్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మండల పార్టీ అధ్యక్షుడు సోరెడ్డి మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పూనూరు భూపాల్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, ఏ ఇంద్రసేనారెడ్డి, రామకోటయ్య, గంగయ్య యాదవ్ పాల్గొన్నారు.

20న జరిగే సమ్మెను జయప్రదం చేయండి

మార్కాపురం వన్‌టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వామపక్ష నాయకులు కోరారు. ఏఐటీయూసీ కార్యాలయంలో సీఐటీయూ, ఏఐటీయూసీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా నాయకులు అందె నాసరయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రఫీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి అమలుకై చేస్తున్న ప్రయత్నాలు అడ్డుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రూబెన్, సుబ్బరాయుడు, నాగరాజు, ఏఐటీయూసీ నాయకులు షేక్ ఖాశిం, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

మరుగుదొడ్ల కూల్చివేత ఘటనపై మౌనమేల

- నేటికీ దుండగులపై చర్యలు తీసుకోని అధికారులు
- కోట్ల విలువ చేసే స్థలంపై కొందరి కన్ను
- 12 ఏళ్ల గడువు ఉండగానే పగులగొట్టారని
- లీజుదారుల ఆవేదన

పొదిలి, మే 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పెద్దబస్టాండ్ సమీపంలోని నగరపంచాయతీ మరుగుదొడ్లను కొంతమంది గుర్తు తెలియని దుండగులు పగులగొట్టి రెండేళ్లయింది. అయినా నేటికీ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. 2023 జూన్‌లో అర్ధరాత్రి కొంతమంది మాకు సంబంధించిన స్థలంలో మరుగుదొడ్లు ఎందుకు నిర్మించారంటూ ధ్వంసం చేశారని బాధితులు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా వారిపై చర్యలు తీసుకోకపోవడంతో మూడు నెలల తర్వాత దానిని పూర్తిగా నేలమట్టం చేశారు. అయితే అప్పటి నగరపంచాయతీ కమిషనర్ లీజుదారులకు ఆధారాలు తెచ్చుకోవాలని సూచించారు. లీజుదారులు సుభానీ, అంజమ్మ వారి దగ్గర ఉన్న అగ్రిమెంట్ డాక్యుమెంట్లు చూపించినా అధికారులు కూల్చివేతదారులపై చర్యలు తీసుకోలేదు. పొదిలి నడికూడలిలో ప్రధాన వ్యాపార సముదాయం నిత్యం రద్దీగా ఉంటోంది. అదే పెద్దబస్టాండ్ సెంటర్. ఇక్కడి కాలువను ఆనుకొని నగర పంచాయతీ స్థలం ఉంది. అందులో మహిళలకు, ప్రయాణికులకు అవసరమని అప్పటి సర్పంచ్ స్వర్ణ గీత లీజు అగ్రిమెంట్‌పై మరుగుదొడ్లు నిర్మించారు. పట్టణానికి చెందిన సుభాని సొంతంగా మరుగుదొడ్లు నిర్మించుకొని 25 ఏళ్లకు లీజు పూర్తయ్యాక పంచాయతీకి అప్పగించే విధంగా అగ్రిమెంట్ చేశారు. 13 సంవత్సరాలు లీజు అయిపోయింది. మరో 12 సంవత్సరాలు లీజు ఉండగానే కూల్చివేశారు. నగరపంచాయతీ కమిషనర్, పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని బాధితులు వాపోతున్నారు. కూలగొడుతున్న తంతు మొత్తం అధికారులు చూసినా ఆలపలేకపోయారని పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు. అంతా నేలమట్టం చేసిన తరువాత ఆస్థలంలో హెచ్చరికబోర్డ్‌ను ఏర్పాటు చేయడం విచిత్రం. పొదిలిలో ప్రభుత్వ ఆస్తులను కాపాడడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే విషయం దీంతో స్పష్టమవుతుందని పలువురు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులకే రక్షణ లేకపోతే ప్రైవేటు ఆస్తులను ఎలా కాపాడుతారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అక్రమణదారులపై చర్యలు తీసుకొని ప్రజలకు, ప్రయాణికులకు అవసరమైన మరుగుదొడ్లను నిర్మించాలని పలువురు కోరుతున్నారు.


దుండగులు పగులగొట్టిన మరుగుదొడ్లు (ఫైల్)


అగ్రిమెంట్ చూపిస్తున్న సుభాని, అంజమ్మ (ఫైల్)



కూల్చివేసిన తరువాత అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

ఈదురు గాలులతో వర్షం

ఎర్రగొండపాలెం రూరల్ మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అయ్యంబొట్లపల్లి, గంగాపాలెం, గోళ్లవిడిపి, మురారిపల్లి గ్రామాలలో సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ఆయా గ్రామలలో చెట్లు నేలకూలాయి. విద్యుత్ కు అంతరాయం ఏర్పడిందని ప్రజలు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు వాటిని తొలగించి విద్యుత్‌ను సరఫరా చేశారు. అయినా కొన్ని ఏరియాలో విద్యుత్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఏదుర్కొన్నారు.

8న విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశం

ఎర్రగొండపాలెం, మే 5 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం తాలూకా యూనిట్ ప్రభుత్వ విశ్రాంత, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ సమావేశం 8వ తేదీన స్థానిక విశ్రాంత ఉద్యోగుల కార్యాలయంలో జరుగుతుందని అధ్యక్షుడు డీ బాదరయ్య సోమవారం తెలిపారు. ఉదయం 8గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గ ఎన్నిక జరుగుతుందని విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయ ఉద్యోగులు పాల్గొనాలని కోరారు.


పెద్దపులి పాదముద్రలను పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు

ఒంటరిగా అడవిలోకి వెళ్లొద్దు

కంభం, మే 5 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అటవీ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు సాయంత్రం 5 నుంచి ఉదయం 7 గంటల వరకు ఒంటరిగా అడవిలోకి వెళ్లవద్దని మార్కాపురం డిప్యూటీ రేంజర్ ప్రసాద్‌రెడ్డి సూచించారు. అర్ధవీడు మండలంలో గత 3 నెలలుగా పలు ప్రాంతాలలో పెద్దపులి సంచరిస్తూ పశువులను చంపుతున్నదని తెలిపారు. ఆయా ప్రాంతాలలో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. పెద్దపులి పాదముద్రలను అటవీ సిబ్బంది సేకరించినట్లు ఆయన తెలిపారు.

ఉప ఖజానాధికారికి సన్మానం


వరకుమార్‌ను సన్మానిస్తున్న రిటైర్డ్ ఉద్యోగ సంఘ నాయకులు

గిద్దలూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ సర్వీస్ అసోసియేషన్ ప్రకాశం జిల్లా శాఖ సహాధ్యక్షునిగా ఎంపికైన గిద్దలూరు ఉప ఖజానాధికారి పీవీ వరకుమార్‌ను రిటైర్డ్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. నిబద్ధత గల వ్యక్తికి అసోసియేషన్ ద్వారా సేవ చేసే అవకాశం లభించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి, ప్రతినిధులు భాస్కర్‌రెడ్డి, రంగయ్య, వెంకటస్వామి, వీరారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు నీతి కథల బోధన


క్యారమ్స్ నేర్చుకుంటున్న విద్యార్థులు

గిద్దలూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయంలో జరుగుతున్న శిక్షణ తరగతుల్లో భా గంగా సోమవారం విద్యార్థులకు దేశభక్తి గేయాలను నేర్పించడంతోపాటు నీతి కథలను బోధించారు. అనంతరం క్యారమ్స్, చెస్, డ్రాయింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. యోగాసనాలను నేర్పించి, యోగాతో కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు లక్ష్మీప్రసన్న, శివప్రసాద్ పాల్గొన్నారు.

బేస్తవారపేట : గ్రంథాలయంలో సోమవారం జరిగిన శిక్షణ తరగతులకు 20 మంది విద్యార్థు లు హాజరయ్యారు. స్వాతంత్ర సమరయోధుల త్యాగాలు, ఇంగ్లీష్ గ్రామర్, స్పోకెన్ ఇంగ్లీష్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

గిద్దలూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో అసంబంధ విధానాలను అవలంబిస్తున్నారని ఆరోపిస్తూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం చేపట్టారు. రెవెన్యూ కార్యాలయం ఆవరణలో సోమవారం జరిగిన నిరసన కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జోనల్ కన్వీనర్ టి.సుబ్బరాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రస్తుతం ప్రవేశపెడుతున్న 9రకాల పాఠశాలలను ఉపసంహరించుకుని రెండు రకాల పాఠశాలల విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలలకు పూర్వ ప్రాథమిక విద్యను అనుసంధానించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ అంజనేయరెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు మూర్తయ్య, రమేష్‌బాబు, రమణరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉరుముల సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి

మార్కాపురం, మే 5 (ఆంధ్రజ్యోతి): ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షాలు కురిసే సమయంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సచివాలయ సిబ్బంది సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు సూచన మేరకు పట్టణంలోని అన్ని సచివాలయల పరిధిలోని సిబ్బంది ప్రకృతి విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఉరుములు, మెరుపులు సమయంలో హఠాత్తుగా పిడుగులు పడే అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాలు, వర్షం పడే సమయంలో చెట్ల కింద నిలబడవద్దని తెలిపారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సచివాలయ సిబ్బంది

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

32వ వార్డులో డీప్ బోర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, మే 5 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. 32వ వార్డులోని చర్చి వద్ద సోమవారం నూతన డీప్ బోర్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శివారు కాలనీల్లో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసిందన్నారు. ఆయా ప్రాంతాల్లో అవకాశం ఉన్న మేరకు నూతన డీప్‌బోర్లు వేయిస్తామన్నారు. అంతేకాక ట్యాంకర్ల ద్వారా కూడా నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా వార్డులో నెలకొన్న పలు సమస్యలను మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, టీడీపీ నాయకులు మాలపాటి వెంకటరెడ్డి, షేక్ మౌళాలి, కౌన్సిలర్లు నాలి కొండయ్య యాదవ్, చిన్నషెక్షావలి, పఠాన్ హుసేన్‌ఖాన్ పాల్గొన్నారు.


కొబ్బరికాయ కొట్టి డీప్ బోర్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

పార్టీ కోసం కష్టపడే వారికే పదవులు

గ్రామ కమిటీల ఎంపిక సమావేశంలో టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, మే 5 (ఆంధ్రజ్యోతి) : పార్టీ కోసం అహర్నిశలు కష్టపడుతున్న వారికే గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శుల పదవులకు ఎంపిక చేయాలని మండల కమిటీ నాయకులను టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఆదేశించారు. షీలాస్కూల్ ఆవరణలో సోమవారం జరిగిన పుల్లలచెరువు మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ మండల అధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్ అధ్యక్షోపన్యాసం చేశారు. కుటుంబ సాధికారసారథలను నియమించడంలో జిల్లాలో ఎర్రగొండపాలెం ప్రథమ స్థానంలో ఉందని ఎరిక్షన్‌బాబు అన్నారు. అన్ని గ్రామాల్లో పార్టీ సంస్థాగత పదవులకు మే 18వ తేదీలోపు కమిటీలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారని, ఆ మేరకు కమిటీను ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ కమిటీలు, అనుబంధ సంఘాలు, క్లస్టర్ యూనిట్, టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శి పదవులకు కమిటీలను నియమిస్తున్నట్లు ఎరిక్షన్‌బాబు తెలిపారు. గ్రామాల్లో కార్యకర్తల అభిప్రాయం మేరకు గ్రామ కమిటీలకు అభ్యర్థులను ఎన్నుకోవాలని మండల కమిటీ నాయకులకు ఆదేశించినట్లు చెప్పారు. అనంతరం గ్రామపంచాయతీలవారీగా గ్రామ కమిటీ కార్యవర్గాలను ఎంపిక చేశారు.

కార్యక్రమంలో పుల్లలచెరువు మండల మాజీ అధ్యక్షుడు శనగా నారాయణరెడ్డి, కాకర్ల కోటయ్య, మేడికొండ లక్ష్మీనారాయణ, బీవీపుబ్బారెడ్డి, సంజీవరెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పుల్లలచెరువు మండల టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

వైభవంగా భక్తాంజనేయుని వార్షికోత్సవాలు

మార్కాపురం రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎల్‌బీఎస్ నగర్ గ్రామంలో వెలసిన శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో 36వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో 36వ వార్షికోత్సవ వేడుకలు 5 వ తేదీ సోమవారం నుంచి 9 వతేదీ శుక్రవారం వరకు ప్రత్యేక పూజ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మొదటి రోజు సోమవారం అంకురార్పణ, కలశ స్థాపన, అఖండ జ్యోతి స్థాపన, పతాక ఆవిష్కరణ, సంకీర్తన, హరేరామ హరే కృష్ణ ఏకాహం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. పరిసర ప్రాంతాల ప్రజలు ప్రత్యేక పూజల్లో పాల్గొని కాయ కర్పూ రం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఉభయదాతలు

ర్యాంకర్ విద్యార్థినికి సన్మానం

గిద్దలూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన భవనాసి సాయిమోహిత ఇంటర్ ప్రథమ సంవత్సర ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంక్ సాధించారు. ఈ మేరకు మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు సాయిమోహితను సోమవారం ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సూరె నాగేశ్వరరావు, కార్యదర్శి రామచంద్రుడు, కోశాధికారి చంద్రశేఖర్, కోఆర్డినేటర్ గర్రె పుల్లయ్య, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు పాల్గొన్నారు.

పుచ్చకాయల ముక్కల అందజేత

గిద్దలూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : వేసవి తీవ్రతతో బాధపడుతున్న ప్రజలకు వాసవి జాగృతి మిత్ర మండలి క్లబ్ పుచ్చకాయ ముక్కలను అందచేశారు. సుమారు 200 మందికి దాత బీవీ రామాంజనేయులు సహకారంతో పుచ్చకాయ ఒప్పలను అందించినట్లు క్లబ్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు హరికృష్ణ, చెంచయ్య, వెంకటేశ్వర్లు, రామాంజనేయులు పాల్గొన్నారు.


శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

కనులపండువగా రామదండు శోభాయాత్ర

చెన్నంపల్లి నుంచి చాపలమడుగుకు తరలిన భక్తులు

పుల్లలచెరువు, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెన్నంపల్లిలో కోదండ రామస్వామి రామదండు శోభాయాత్ర కార్యక్రమం వైభవంగా జరిగింది. సోమవారం చెన్నంపల్లి గ్రామ పెద్దల ఆధ్వర్యంలో రామదండులో భాగంగా స్వామి వారి పీఠాన్ని గ్రామంలోని విధుల్లో ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం చాపలమడుగు గ్రామానికి పీఠాన్ని చేర్చి గ్రామ పెద్దలకు అప్పగించారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద బోడా చెన్నప్ప నాయుడు, తమ్మినేని మస్తాన్‌రెడ్డి, తమ్మినేని రామిరెడ్డి, బోగోలు ఏగిరెడ్డి, భైరెడ్డి చిన్న గాలిరెడ్డి, దేశిరెడ్డి చిన్న గాలిరెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలి

పామూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించి ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సక్రంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ అన్నారు. పట్టణంలోని డీవీపాలెంలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం పౌష్టకాహారాన్ని అందజేయాలన్నారు. కార్యక్రమంలో కార్యకర్త రామసుబ్బులు, తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

దొనకొండ, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరవల్లిపాడు గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు సోమవారం త్రిపురాంతకం సీఐ హసాన్ నేతృత్వంలో దాడి చేశారు. తొమ్మిది మందిని అరెస్టు చేసి రూ.54,860 నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పీసీపల్లిలో చలివేంద్రాల ఏర్పాటు

పీసీపల్లి, మే 5(ఆంధ్రజ్యోతి): పీసీపల్లి మండలంలో కూటమి నేతల ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రాలను ఏర్పాటుచేశారు. పీసీపల్లి బస్టాండు సెంటరులో టీడీపీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య, పెదయిర్లపాడు, పీసీపల్లి బ్యాంకు సెంటరులో జనసేన పార్టీ సెంట్రల్‌కమిటీ సభ్యుడు మాదాసు రమేష్‌లు చలివేంద్రాలను ఏర్పాటుచేశారు. వీటిని తహసీల్దార్ సీహెచ్ ఉష, ఎంపీడీవో ప్రభాకరశర్మ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రాంప్రసాద్, ఎస్సై జి.కోటయ్య, వీరయ్య, రహిముల్లా, చినబ్రహ్మయ్య, పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ట్రైసైకిళ్లు అందజేత

పామూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురై మంచానికే పరిమితమైన ఆరుగురికి గాదంశెట్టి సుబ్బారావు ఆర్థిక సహకారంతో సూర్యచంద్ర సేవా సంస్థ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ డీవీ మనోహర్ ఆధ్వర్యంలో సోమవారం ట్రైసైకిల్‌లు అందజేశారు. కార్యక్రమంలో సయ్యద్ అమీర్‌బాబు, మాచర్ల రహిమాన్, షేక్ నజీర్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ముండ్లమూరు, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళ, బుధ, గురువారాల్లో ఉరుములతో పాట పిడుగులు పడే అవకాశాలు ఉన్నాయని, మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎల్ .లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వీఆర్వోలు గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేమాల్సిన అవసరం ఉందన్నారు. పోలాలకు వెళ్లే రైతులు, పశువుల కాపరులు చెట్ల వద్ద ఉండవద్దని తెలపాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ మూర్తి, సీనియర్ అసిస్టెంట్ శేషగిరిరావు పాల్గొన్నారు.

సెలవుపై వెళ్లిన ఈవోఆర్‌డీ

తాళ్లూరు, మే 5(ఆంధ్రజ్యోతి): ఈవోఆర్‌డీ కె.సుందరామయ్య సెలవుపై వెళ్లారు. గతంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా ఉన్న ఆయన గ్రూప్ పరీక్షల కోసం మూడున్నరనెలల పాటు సెలవుపై వెళ్లారు. ఇటీవల విధుల్లో చేరారు. మరలా గ్రూప్ పరీక్షలు ఉన్నాయంటూ రెండు నెలలపాటు సెలవుపై వెళ్లినట్లు తెలిసింది. ఈవోఆర్‌డీ సెలవుపై వెళ్లినందున ఇన్‌చార్జ్‌ని నియమించి పంచాయతీల నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలని పలువురు సర్పంచ్‌లు కోరుతున్నారు.

ఆధునికీకరణ పనులను నాణ్యతగా చేయాలి

ముండ్లమూరు, మే 5(ఆంధ్రజ్యోతి): మోదేపల్లి మేజర్ పరిదిలో సాగర్‌కాలువ ఆధునీకరణ పనులను రైతులకు ఉపయోగపడేలా చేయించాలని మోదేపల్లి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు ఎన్ఎస్‌పీ డీఈ పూర్ణచందు, జేఈలు ప్రసాద్, సత్యనారాయణను కోరారు. సోమవారం ఎన్ఎస్‌పీ అధికారులతో కలిసి ఆధునీకరణ కింద చేపట్టే పనుల ప్రదేశాలను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో పనులు జరిగేలా అధికారులు చూడాలన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ముండ్లమూరు, మే 5(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక ధృడత్వం కలుగుతుందని ఎస్ఐ కె.కమలాకర్ అన్నారు. సోమవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మాధవీలత, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావు, బేతపూడి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

4 యూపీ స్కూళ్లు అప్‌గ్రేడ్

ముండ్లమూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగసపాలెం, పెదఉల్లగల్లు, సుంకరవారిపాలెం, శంకరాపురం గ్రామాల్లో ఉన్న యూపీ స్కూళ్లను హైస్కూళ్లుగా మారుస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. తూర్పుకంభంపాడు, నాయుడుపాలెంలో ఉన్న యూపీ స్కూళ్లను రద్దు చేసి మోడల్ స్కూళ్లలో విలీనం చేశారు.

రైల్వే పనులను వేగవంతం చేయాలి

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



ర్వేల్వే స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, మే 5 (ఆంధ్రజ్యోతి): నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే పనులను వేగవంతం పూర్తి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. సోమవారం పట్టణ సమీపంలోని కలగట్ల వద్ద ఉన్న రైల్వే స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే ఆగస్టులో రైల్వే లైన్ ప్రారంభం కావాల్సిన నేపథ్యంలో అన్ని పనులు పూర్తయ్యేవిదంగా అధికారులు మరింత చొరవ చూపాలని సూచించారు. ముఖ్యంగా ప్రయాణికులకు మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు మరింత దృష్టి సారించాలన్నారు. కనిగిరి నియోజకవర్గంలో దాదాపు మూడు ర్వైల్వే స్టేషన్‌లు తుది దశకు చేరుకున్నట్లు అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. యడవల్లి, కనిగిరితో పాటు గార్లపేటలో కూడా స్టేషన్ నిర్మాణ పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫ్లైఓవర్ బ్రిడ్జలు, కవర్ బ్రిడ్జిలతో పాటు ప్లాట్‌ఫాంలు, ప్యాసింజర్ వెయిటింగ్ హాల్స్ పనులు వేగవంతగా జరుగుతున్నట్లు వివరించారు. ఆయా పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. మహిళల కోసం ప్రత్యేకంగా వెయిటింగ్ గదులు, ఏసీ ప్రయాణికుల కోసం వసతి గదులు, జనరల్ క్లాస్ ప్రయాణి కులకు మరింత అనుకూలంగా ఉండే వసతులు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇటీవల బయోగ్యాస్ ప్లాంట్ శంకుస్థాపన సందర్భంగా కనిగిరికి వచ్చిన సందర్భంలో మంత్రి నారా లోకేష్ ఆగస్టులో రైల్వే లైన్ ప్రారంభమవుతున్నట్లు ప్రకటించిన విషయాన్ని అధికారులకు ఎమ్మెల్యే గుర్తు చేశారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు, కాంట్రాక్టర్‌లు, తహసీల్దార్ రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా ఎన్‌ఏపీ పైపులైన్లు

» తరచూ పగులుతున్న వైనం
» తాగునీటి సరఫరాకు తీవ్ర ఆటంకం
» ఇబ్బందులు పడుతున్న ప్రజలు

దర్శి, మే 5(ఆంధ్రజ్యోతి): దర్శి ఎన్‌ఏపీ రక్షిత మంచినీటి పథకం రోజురోజుకు నిర్వీర్యం అవుతుంది. సుమారు 45 సంవత్సరాల క్రితం నిర్మించిన ఎన్‌ఏపీ పైపులైన్లు తరచూ పగిలిపోతున్నాయి. ప్రతిరోజు ఏదో ఒకచోట పైపులైన్ పగులుతుండటంతో మంచినీటి సరఫరాకు తీవ్ర ఆటంకం కల్గుతుంది. పగిలిన పైపులైన్లు గుర్తించి మరమ్మతులు చేసేందుకు అనేకరోజుల సమయం పడుతుంది. ఈనేపథ్యంలో ఆయా ప్రాంతాల ప్రజలు మంచినీరు అందక ఇబ్బందులు పడుతున్నారు.

దర్శి పట్టణంలో ప్రధాన పైపులైన్లు తరచూ పగులుతుండటంతో గ్రామాలకు కూడా మంచినీటి సరఫరా ఇబ్బందిగా మారింది. కొన్నిరోజుల క్రితం గడియార స్తంభం వద్ద మెయిన్ పైపులైన్ పగిలి అనేకరోజులు ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతం దర్శి-పొదిలి రోడ్డులో దద్దాలమ్మ గుడి వద్ద పైపులైన్ మళ్లీ పడిలిపోయింది. దర్శి-కురిచేడు రోడ్డులో కూడా మెయిన్ పైపులైన్ పగిలిపోయింది. దీంతో దర్శి పట్టణంలోని అనేక ప్రాంతాలకు మంచినీటి సరఫరా నిలిచిపోయింది.

గత మూడు రోజులుగా సిబ్బంది అనేకచోట్ల తవ్వి చివరకు పగిలిన ప్రాంతాన్ని గుర్తించారు. సుమారు



దర్శి-కురిచేడు రోడ్డులో పైపులైన్ పగిలిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ పిచ్చయ్య



దద్దాలమ్మ గుడివద్ద పగిలిన పైపులైన్లను మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

47 సంవత్సరాల క్రితం నిర్మించిన పైపులైన్ కావటంతో సుమారు ఏడు అడుగుల లోతులో పైపు లైన్లు ఉన్నాయి. పగిలిన ప్రతిసారీ అక్కడ గుంతలు తీసి పగిలిన పైపులైన్లు గుర్తించేందుకు సిబ్బందికి ఇబ్బందికరంగా మారింది. ఇదిలా ఉండగా పగిలిన పైపులైన్ మరమ్మతులను నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య పరిశీలించారు. పైపులైన్ మరమ్మతులను వీలైనంత త్వరగా పూర్తిచేసి ఆ ప్రాంతాలకు మంచినీరు సరఫరా చేయాలని సూచించారు. ఆయన వెంట ఏఈ హనుమాన్‌బాబు, సిబ్బంది ఉన్నారు.

దయనీయస్థితిలో దొనకొండ గ్రంథాలయం

» వేసవి విజ్ఞాన తరగతులకు దూరమైన విద్యార్థులు
» అందుబాటులోలేని పోటీ పరీక్షల పుస్తకాలు



దొనకొండలోని గ్రంథాలయం

దొనకొండ, మే 5(ఆంధ్రజ్యోతి): దొనకొండలోని గ్రంథాలయం మొక్కుబడిగా సాగుతోంది. ఎటువంటి పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు లేవు. కేవలం రెండు మూడు న్యూస్ పేపర్లతో గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నారు. కొన్ని సంవత్సరాలుగా గ్రంథపాలకుడు లేడు. పక్కాభవనం లేక ప్రజలు సంచరించని ప్రదేశంలో అద్దె భవనంలో నడుస్తోంది. గ్రంథాలయ సంస్థ ఆదేశాల మేరకు అన్నీ మండలాల్లోని గ్రంథాలయాల్లో వేసవి సెలవుల్లో విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు వివిధ కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. పుస్తక పఠనం, కథలు చెప్పించటం, ప్రముఖులతో అవగాహన సదస్సులు, ఆటలపై ఆసక్తి ఉన్నవారికి చెస్, క్యారమ్స్ నిర్వహించటం, స్పోకెన్ ఇంగ్లీష్, చిత్రలేఖనం వంటి అంశాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నారు.

అయితే, స్థానిక గ్రంథాలయానికి ఇతర మండలాలకు చెందిన గ్రంథపాలకులను ఇన్‌చార్జ్‌లుగా నియమిస్తున్నారు. దీంతో వారు వారంలో ఒకరోజు మాత్రమే వచ్చిపోతున్నారు. ఫలితంగా, దొనకొండ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించడం లేదు. తద్వార ఈప్రాంత విద్యార్థులు వేసవి విజ్ఞాన తరగతులకు దూరమయ్యారు. గ్రంథాయాన్ని తెరచేందుకు ఒక మహిళను ఏర్పాటుచేశారు. ప్రతిరోజు గ్రంథాలయాన్ని ఆమె మధ్యాహ్నం వరకు తెరుస్తుంది. అందుబాటులో ఉన్న న్యూస్‌పేపర్లను ఒకరిద్దరు వచ్చి చదువుకుంటుంటారు. వరుసగా ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వెలువడుతుండటంతో పోటీ పరీక్షలకు నిరుద్యోగ యువకులు సిద్ధపడేందుకు గ్రంథాలయంలో అందుకు సంబంధించిన ఎటువంటి పుస్తకాలు లేవు. దీంతో నిరుద్యోగ యువకులు ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. ఇప్పటికైనా గ్రంథాలయ సంస్థ ఉన్నతాధికారులు స్పందించి దయనీయస్థితిలో ఉన్న దొనకొండ గ్రంథాలయానికి రెగ్యులర్ గ్రంథపాలకుడిని నియమించాల్సిన అవసరం ఉంది. అన్నిరకాల పుస్తకాలను అందుబాటులో ఉంచి గ్రంథాలయం అందరికీ ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలని పాఠకులు కోరుతున్నారు.

అస్తవ్యస్తంగా తహసీల్దార్ కార్యాలయం

» ఇతర పనులతో తాళ్లూరు ముఖంచూడని సిబ్బంది
» వివిధ సర్టిఫికెట్ల కోసం రోజులతరబడి ప్రదక్షిణలు



తాళ్లూరు తహసీల్దార్ కార్యాలయం

తాళ్లూరు, మే 4(ఆంధ్రజ్యోతి): తాళ్లూరు తహసీల్దార్ కార్యాలయ పనితీరు అస్తవ్యస్తంగా తయారయింది. నిన్నమొన్నటివరకు కొంతమేర ప్రజలు, విద్యార్థులు, రైతుల సమస్యలను పరిష్కరించేవారు. ప్రస్తుతం గత నాలుగు నెలలుగా అటువంటి పరిస్థితిలేదు. దీంతో సమస్యలు పరిష్కారంకాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయం సిబ్బంది ఎక్కువ కాలం ఒంగోలు ఆర్‌డీవో కార్యాలయానికే పరిమితమవుతున్నారు. దీంతో ప్రజల సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఏకలవ్య నగర్ ఎస్టీలు తమకు భూముల పంపిణీలో న్యాయం చేయాలని హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆదేశించినా అమలుచేయక పోవటంతో ఎస్టీలు కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేశారు. హైకోర్టు ఉత్తర్వులతో గత నెలన్నర రోజులుగా అధికశాతం ఆసమస్యను పరిష్కరించుకునేందుకు నిత్యం ఒంగోలు ఆర్‌డీవో కార్యాలయానికి సిబ్బంది వెళుతున్నారు. దీంతోపాటు రీసర్వేను వేగవంతంగా పూర్తి చేసేందుకు విఠలాపురం, బెల్లంకొండవారిపాలెం, రామభద్రాపురం గ్రామాలకు సిబ్బందిని టీమ్‌లుగా నియమించారు. ఈక్రమంలో కార్యాలయం వైపు సిబ్బంది కన్నెత్తి చూడటంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. సచివాలయాల్లో కుల, ఆదాయ, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లకోసం దరఖాస్తు పెట్టుకున్నవారు తహసీల్దార్ సంతకాల కోసం కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కొందరు వీఆర్వోలు తమ ల్యాగిన్‌లోకి వచ్చిన వివరాలను తహసీల్దార్ ల్యాగిన్‌కు పంపటంలో కూడా జాప్యం చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. దీనికితోడు ప్రజలు నిత్యం వీఆర్వోల కోసం పడిగాపులు కాయాల్సి వస్తుంది. తమ పొలాలకు సంబంధించి రైతులు మ్యుటేషన్ కోసం దరఖాస్తు పెట్టుకొంటే, నెలల తరబడి పరిష్కరించకుండా రిజెక్ట్ కొడుతున్నారు. అయితే, మ్యుటేషన్ల విషయంలో సిబ్బంది ఆచితూచి వ్యవహరిస్తుండటంతో రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాళ్లూరు తహసీల్దార్ కార్యాలయ పనితీరు మెరుగుపరిచి ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కరించేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

రీసర్వేలో తప్పులను సరిదిద్దడంలేదు!

తెల్లమేకల కాటమరాజు, శింగనపాలెం



శింగనపాలెం గ్రామంలో ఇటీవల రీసర్వే నిర్వహించారు. పూర్వీకుల నుంచి సంక్రమించిన ఆస్తిలో 13 సెంట్ల విస్తీర్ణాన్ని తగ్గించారు. దీనిపై గత రెండు నెలలుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాను. రీసర్వేలో తన భూమిని తగ్గించి రికార్డుల్లో నమోదు చేయగా సరిదిద్దమని కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారంకాలేదు.

రికార్డులు సమర్పించినా మ్యుటేషన్ చేయలేదు

సానె సాయి, సోమవరప్పాడు



తన వద్దగల భూమికి మ్యుటేషన్ కోసం సచివాలయంలో దరఖాస్తు పెట్టినా పరిష్కారం కాలేదు. దాదాపు ఐదు నెలలుగా తిరుగుతున్నా రెవెన్యూ అధికారులు ఏవేవో మాటలు చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది అందుబాటులో ఉండటంలేదు. ఆర్థిక ఇబ్బందులతో పొలం అమ్ముకుని అప్పులు తీరుద్దామన్నా మ్యుటేషన్ కాకపోవటంతో ఇబ్బందులు పడుతున్నాం.

నాణ్యమైన విద్యుత్‌ను అందజేయడమే లక్ష్యం



సిబ్బందితో మాట్లాడుతున్న ఈఈ శ్రీనివాసులు

ముండ్లమూరు, మే 5(ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో పెట్టుకొని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించటమేకాక ఎలాంటి అవాంతరాయాలు లేకుండా చూడటం జరుగుతుందని ఈఈ పి.శ్రీనివాసులు అన్నారు. గత మూడు రోజుల నుండి మండలంలోని పోలవరం గ్రామానికి త్రీఫేస్ విద్యుత్ సౌకర్యంలో అవాంతరాలు ఏర్పడ్డాయి. దాన్ని సరిచేసేందుకు సోమవారం ఈఈ శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ ఏడీఏ కృష్ణారెడ్డి ఏఈ చిన్నఅంకబాబులు సిబ్బందిని గ్రామానికి పంపి లోపం ఎక్కడఉందో గుర్తించారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో లోపం గుర్తించి సరిచేశారు. అనంతరం పోలవరం గ్రామానికి త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించారు.

ఈసందర్భంగా సబ్‌స్టేషన్‌లో ఈఈ శ్రీనివాసులు సిబ్బందితో మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని ఏగ్రామంలోనూ అంతరాయం కలగకుండా చూడాలన్నారు. మెరుగైన విద్యుత్‌ను వినియోగదారులకు అందించటం జరుగుతుందన్నారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అందితే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పెండింగ్ విద్యుత్ బకాయిలను స్పెషల్‌డ్రైవ్ ద్వారా వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏడీఏ కృష్ణారెడ్డి, ఏఈ టి.అంకబాబు, లైన్‌ఇన్‌స్పెక్టర్ సాంబయ్య, లైన్‌మెన్ ఆంజనేయులు, మధు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ తాటికొండ శ్రీను

ఉపాధి పనులను వేగవంతం చేయాలి

తాళ్లూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులను వేగవంతం చేయాలని ఎంపీపీ తాటికొండ శ్రీను అన్నారు. పలుచోట్ల పనులులేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సోమవారం స్థానిక ఎంపీపీ చాంబర్‌లో ఉపాధి కార్యాలయ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఉపాధి పనులు నత్తనడకగా జరుగుతున్నాయన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లను అప్రమత్తం చేసి కూలీలకు ఉపాధి కల్పించాలన్నారు. ఉపాధి కార్యాలయ సిబ్బంది సమన్వయంతో ముందుకుసాగి పనుల వివరాలను గ్రామంలోని ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి చేపట్టాలన్నారు. ఉపాధి పనులకు వస్తామన్న ప్రతి వ్యక్తికి జాబ్‌కార్డు అందజేయాలన్నారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, ఏపీవో వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలివ్వాలి

పామూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని టీడీపీ మండల బీసీ సంఘం నాయకుడు మల్లెబోయిన గురుబ్రహ్మం కోరారు. ఈమేరకు సోమవారం తహసీల్దార్ బీవీ రమణరావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని తిరగలదిన్నె గ్రామంలోని 119/2,3,5,6లో గల ప్రభుత్వం భూమిలో బీసీ సామాజిక వర్గానికి నివేశన స్థలాలు మంజూరు చేశారన్నారు. అందులో 354 ఇంటి స్థలాల్లో 150 మందికి 5సెంట్లు చొప్పున ఇచ్చారన్నారు. మిగిలిన ప్లాట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటిని కొందరు నాయకులు అమ్ముకొంటున్నారని అన్నారు. విచారణ చేసి వాస్తవ లబ్ధిదారులకు స్థలాలు కేటాయించాలని కోరారు. దీనిపై విచారణచేసి న్యాయం చేస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బొట్ల నాగార్జున, మాజీ సర్పంచ్ ఎం.గురుబ్రహ్మం, టి.ప్రసాద్ పాల్గొన్నారు.

కాగా గ్రీవెన్స్‌లో వివిధ సమస్యలపై ఆరు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ రమణరావు తెలిపారు. ఇళ్ల స్థలాల కోసం సీపీఐ నాయకులు అర్జీ అందజేశారు.

'పత్రాలు లేకుంటే వాహనాలు సీజ్ చేస్తాం'

కనిగిరి, మే 5 (ఆంధ్రజ్యోతి): తగిన పత్రాలు లేకుండా ఉన్న వాహనాలను సీజ్ చేస్తామని డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్ అన్నారు. పట్టణంలోని మంగలిమాన్యం, దొరువు బజార్, కాశిరెడ్డిబజార్, కాశిరెడ్డి కాలనీల్లో సోమవారం వేకువజామునను కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ ఖాజావలి, ఎస్ఐలు టి.శ్రీరాం, కృష్ణపావనిలతో కలసి ప్రతి ఇంటిలో సోదాలు నిర్వహించారు. పాత నేరస్థులు, రౌడీషీట్ తెరచిన వ్యక్తుల జీవన విధానాలను విచారించారు. పోలీసులు నిర్వహించిన కార్డెన్ సెర్చ్‌లో 30 ద్విచక్రవాహనాలు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. వాటికి పత్రాలు లేకపోవటంతో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గంజాయి విక్రయాలపై సమాచారం అందిస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

ప్రమాదవశాత్తు జామాయిల్ తోట దగ్ధం

ముండ్లమూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులో సోమవారం మధ్యాహ్నం సోమేపల్లి రాములుకు చెందిన ఆరు ఎకరాల జామాయిల్ తోట ప్రమాదవశాత్తు దగ్ధమైంది. నాలుగు సంవత్సరాల క్రితం జామా యిల్ తోట సాగు చేశాడు. సోమవారం ఒక్కసారిగా మంటలు చెలరేగి కాలి పోతుండటంతో సమీపంలోని పొలాల్లో ఉన్నవారు చూసి యజమాని రాములుకు సమాచారం అందించారు. ఆయన వెంటనే అద్దంకి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించటంతో వారు వచ్చేలోపే అగ్నికి ఆహుతైంది.

విద్యారంగంలో అసంబద్ధ విధానాలు తగదు!



దర్శి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

కనిగిరి, మే 5 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో అసంబద్ధ విధానాలను అమలుచేయటం తగదని ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఐ.విజయసారథి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యా సంస్కరణల పేరుతో పాఠశాలల పునర్వ్యవస్థీకరణ పేరుతో విద్యారంగాన్ని ప్రయోగశాలగా మారుస్తున్నారని విమర్శించారు. ప్రతి పాఠశాలకు ఇద్దరు ఎస్టీటీలను కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక తరగతులను హైస్కూల్‌లకు అనుసంధానం చేసే విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. హైస్కూల్‌లో 45 మంది విద్యార్థులు దాటిన తర్వాత రెండవ సెక్షన్‌ను అమలు చేయాలని కోరారు. పీడీ పోస్టును కేటాయించాలన్నారు. 117 జీవో పేరుతో పాఠశాలలను 9 రకాలుగా విభజించటం సరికాదన్నారు. ప్రభుత్వం విద్యారంగంలో అమలుచేస్తున్న విధానాలను ఏపీటీఎఫ్ వ్యతిరేకిస్తుందన్నారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, హజరత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దర్శిలో నిరసన ర్యాలీ

దర్శి, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను సంరక్షించుకునేందుకు ఆందోళన బాట పట్టాల్సివస్తుందని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఎనిమిది రకాల పాఠశాలల ప్రతిపాదనలను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించి స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ పీఆర్‌సీ కమిషన్ వేసి ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను విడుదల చేయాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరరావుకు ఉపాధాయులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ దర్శి, ముండ్లమూరు మండలాల అధ్యక్షులు డి.రంగస్వామి, డి.శ్రీనివాసులు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు షేక్ మస్తాన్, వేమా రమణయ్య, వి.చక్రధర్, జి.వేణు, తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి బైకిస్ట్‌కు తీవ్రగాయాలు

కనిగిరి, మే 5 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి రోడ్డుపై పడిపోవటంతో యువకుడికి తీవ్రగాయాలైన ఘటన సోమవారం రాత్రి పట్టణంలోని కొత్తూరు వద్ద హైవేపై చోటుచేసుకుంది స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని పాతూరుకు చెందిన ఆలీ అనే యువకుడు బైక్‌పై కనిగిరి నుంచి కొత్తూరు వైపు వెళ్తున్నాడు. ఈక్రమంలో ముందున్న లారీని తప్పించబోయి బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానిక ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించినట్లు సమాచారం. ఈఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

5

మంగళవారం 6 మే 2025

ఉష్ణోగ్రత (అంచనా)

6-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	39	27
తెనాలి	38	26
నరసరావుపేట	39	26
బాపట్ల	38	27
రెంటచింతల	40	26



కృష్ణా పశ్చిమ డెల్టాలో అధ్వానంగా మారిన కాల్వ కట్ట

కాల్వల నిర్వహణకు..

కా సులు వాలి!

- ఖరీఫ్-2025-26 సీజన్‌కు గడ్డు కాలం..
- మరమ్మతులకు కాల్వల ఎదురు చూపులు
- నీటితీరువా వసూలు కాక.. నిధులు లేక
- ప్రభుత్వం ఆదుకుంటేనే బాగయ్యేది
- రైతుల నుంచి పన్ను వసూలు రూ. 33 కోట్లే
- సాగర్ కుడి కాల్వల పరిధిలో 355 అత్యవసర పనుల గుర్తింపు
- గత ఐదేళ్లలో ఒక్క పనీ జరగక రైతుల అవస్థలు

ఖరీఫ్-2025-26 సీజన్‌కు రాష్ట్రంలోని కాల్వల మరమ్మతుల కోసం ఎదురుచూస్తున్నాయి. అత్యవసర మరమ్మతుల కింద ఓఅండ్‌ఎం(ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్) నిధులు ఆయా డెల్టాలకు ఏటా మంజూరు చేయడం పరిపాటి. అయితే ఈసారి రైతుల నుంచి పన్నుల వసూళ్లు అంతంతమాత్రంగా ఉండడంతో ఈ నిధులకు ఇబ్బంది ఏర్పడింది. రాష్ట్రం మొత్తం మీద రూ. 142 కోట్ల విలువైన కాల్వల పనులు ప్రభుత్వం ఇచ్చే చల్లని కబురు కోసం ఎదురు చూస్తున్నాయి. గత వైసీపీ పాలనలో ఒక్క కాల్వకూ గుప్పెడు మట్టి పోసిందిలేదు. గండ్లు పూడ్చింది లేదు. పూడిక తీసిన పాపాన పోలేదు. దీంతో ప్రస్తుతం చివరి భూములకు చుక్కనీరు అందడం గగనమైంది.

బాపట్ల, మే 5, (ఆంధ్రజ్యోతి): కృష్ణా డెల్టా, సాగర్ ఆయకట్టు పరిధిలో కాల్వల మరమ్మతులు చేసేందుకు సమ యం ఆసన్నమయింది. సాధారణంగా ఏటా రై తులు చెల్లించే నీటి తీరువా నుం చి ఈ పనులకు నీటిపారుదల శాఖ నిధులు సమకూర్చుకుంటుంది. నీటి తీరువాలో 80 శాతం వాటాగా ఇరిగేషన్‌కే ప్రభుత్వం అందిస్తుంది. అయితే ఈ ఏడాది పన్నుల వసూళ్లకు సంబంధించి డిమాండ్‌లో కేవలం రూ.33 కోట్లే వసూలవడం.. పనుల విషయంలో అయోమయానికి కారణమైంది. అయితే నీటిపారుదల శాఖ మాత్రం ఓఅండ్‌ఎం పనుల కోసం రూ.142 కోట్ల విలువైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపింది. ఈ నెలలోనే ఈ ప్రతిపాదనలపై కడా(కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) సమావేశం నిర్వహించడం, పనులను ఆమోదించడం జరిగిపోయాయి. అయితే నిధులే సమస్యగా ఉండటంతో నీటిపారుదల శాఖ దీనిపై ప్రభుత్వానికి లేఖ రాసింది. అప్పటి నుంచి ప్రభుత్వం నిర్ణయాన్ని ప్రకటించకపోవడంతో ఇటు నీటిపారుదల శాఖ, సాగునీటి సంఘా ల్లో, అటు రైతుల్లో ఆందోళన పెరిగిపోతోంది.

నిధుల కోసం ఎదురు చూపులు..

కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ సాగునీటి సంఘాలను తీసుకొచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలు పెట్టి సంఘాల కమిటీలను అధికారికంగా ఎన్నుకునేలా చేసింది. సంఘాలు అత్యవసర పనులు ఎక్కడెక్కడ.. ఏమేమి చేయాలనేది గుర్తించాయి. రాష్ట్రంలోని సాగునీటి కాల్వలు, డ్రెయిన్‌ల అత్యవసర మరమ్మతుల కోసం కృష్ణా డెల్టా పరిధిలో రూ.50 కోట్ల పనులకు ప్రతిపాదనలు పంపితే, మైనర్ ఇరిగేషన్(చెరువులు) కింద రూ.55 కోట్లు, సాగర్ ఆయకట్టు కింద రూ. 37 కోట్లు, నీటిపారుదల శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఈ మొత్తాలకు సంబంధించి ప్రభుత్వం నిధులు సమకూర్చాల్సి ఉంది.



గోవిందాపురం మేజర్ కాలువలో పెరిగిన కంప చెట్లు

మరో రెండు నెలలే సమయం..

ప్రస్తుతం కృష్ణా డెల్టాలో ప్రస్తుతం తాగు నీటి కోసం చెరువులు నింపుకునేందుకు కాల్వలకు నీటిని విడుదల చేశారు. నిన్నటితో వాటిని కూడా ఆపాల్సి ఉంటే, మరో రెండు రోజులు కాల్వల్లో నీరు ప్రవహించే పరిస్థితి ఉంది. నీటిని కట్టేసిన వెంటనే కాల్వల పనులు వేగవంతం చేస్తేనే సకాలంలో పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. అంటే ఖరీఫ్ సీజన్ కోసం జూలై 10 నుంచి కాల్వలకు తిరిగి నీటిని విడుదల చేయాల్సి ఉంది. ఇక 2 నెలలు మాత్రమే సమయం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఈ రెండు రోజుల్లో నిధులు మంజూరు చేయగలిగితే గండ్లు పడటానికి సిద్ధంగా ఉన్న కాల్వల కట్టల మరమ్మతులు చేసే అవకాశం ఉంటుంది. ఈ ఐదేళ్లలో పంట పండడం గగనమైపోయిన చివరి భూముల రైతులు ఈసారయినా తిండిగింజలు పండించుకునేందుకు అవకాశం ఉంటుంది.

355 పనులకు.. రూ .19.28 కోట్ల ప్రతిపాదనలు

సాగర్ కుడి కాల్వ పరిధిలో వినుకొండ, లింగంగుంట్ల, సత్తెనపల్లి, మాచర్ల డివిజన్‌లలో అత్యవసర మరమ్మతులకు సంబంధించి 355 పనులను ఇరిగేషన్ శాఖ గుర్తించింది. ఈ పనులు చేపట్టేందుకు రూ 19.28 కోట్ల అంచనా వ్యయం సిద్ధం చేశారు. ఈ నిధులతో కాల్వల్లో పూడిక తీత, కంపచెట్లు, జమ్ము, తూటుకాడ తొలగింపు పనులు చేపడుతారు. మాచర్ల నియోజకవర్గ పరిధిలోని 38 పనులకు రూ 2.17 కోట్లు, గురజాల నియోజకవర్గ పరిధిలో 31 పనులకు రూ 2.17 కోట్లు, సత్తెనపల్లి నియోజకవర్గంలో 46 పనులకు రూ 2.34 కోట్లు, పెదకూరపాడు నియోజకవర్గంలో 36 పనులకు రూ.2.16 కోట్లు, తాడికొండ నియోజకవర్గంలో 34 పనులకు రూ 2 కోట్లు, నరసరావుపేట నియోజకవర్గంలో 51 పనులకు రూ 2.30 కోట్లు, చిలకలూరిపేట నియోజకవర్గంలో 29 పనులకు రూ 1.45 కోట్లు, ప్రత్తిపాడు నియోజకవర్గంలో 25 పనులు రూ 1.49 కోట్లు, వినుకొండ నియోజకవర్గం పరిధిలో 54 పనులకు వ్యయం రూ.2.70 కోట్లు, దర్శి నియోజక వర్గంలో 5 పనులకు వ్యయం రూ.20.48 లక్షలు, అద్దంకి నియోజకవర్గంలో 6 పనులకు రూ.26.56 లక్షలుగా అంచనాలు రూపొందించి, జలవనరుల శాఖ నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది.



నరసరావుపేట : షట్టరు లేని తూము

నీటి తీరువాపై నిర్లక్ష్యం..

సాగర్ కాల్వల్లో మరమ్మతులకు ఇవ్వాల్సిన నీటి తీరువా నిధులను దారి మళ్లించిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కింది. నీటి తీరువా వసూలు చేయడంలో రెవెన్యూ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. రైతులు ఏటా చెల్లించే నీటి శిస్తు ద్వారా వచ్చిన ఆదాయాన్ని పంచాయతీలకు 5 శాతం, ఇతర కేటాయింపులు పోగా.. 80 శాతం నిధులను మైనర్, మేజర్ ఇరిగేషన్లకు కేటాయించాలి. నీటి తీరువాకు సంబంధించిన నిధులను కాడా సాగు నీటి సంఘాల వారీగా కేటాయించాల్సి ఉంది. ఇందులో 10 శాతం పరిపాలనకు. 15 శాతం డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, 14 శాతం ప్రాజెక్టు కమిటీకి కేటాయించాలి. ఇంకా నిధులు చేరకపోవడంతో మరమ్మతుల నిర్వహణలో కూడా చేతులెత్తేసే పరిస్థితులు నెలకొన్నాయి. ఏటా సాగర్ ఆయకట్టు పరిధిలో నీటి తీరువా రూ.20 కోట్లు నుంచి రూ. 21 కోట్లు వస్తుందని అంచానా. రైతులు చెల్లించే నీటి తీరువాపై కాల్వల మరమ్మతులు అధారపడి ఉంటాయి. ప్రభుత్వం ఇచ్చే నిధుల మాట ఎలా ఉన్నా.. తాము చెల్లించే నీటి తీరువా నిధులైనా కేటాయించి అత్యవసర మరమ్మతులైనా చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పనులు మొదలు పెట్టమన్నాం..

డెల్టా పరిధిలో కాల్వలకు నీరు ఆపిన వెంటనే చేయాల్సిన అత్యవసర పనులు మొదలు పెట్టమని నీటి సంఘాలకు ఇప్పటికే ఆదేశాలిచ్చాం. టెండర్ల పనులను కూడా చేయమని చెప్పాం. ఎక్కడా జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. మరమ్మతుల నిధులకు ప్రభుత్వానికి ఇప్పటికే నివేదించాం. తప్పకుండా నిధులు మంజూరవుతాయి.. రైతులెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు.

- బానోతు రాంబాబు, సీఈ, నీటిపారుదల శాఖ, కృష్ణా డెల్టా విభాగం, విజయవాడ

వందే భారత్ హాల్ట్‌పై ఆశలు

- చీరాల రైల్వేకు ఆదాయం, ప్రజలకు ప్రయోజనం
- ఆదాయం అధికంగా ఉన్నా.. పట్టించుకోని రైల్వేశాఖ
- ప్రజాప్రనిధులు ఒత్తిడి లేకపోవడమేనని విమర్శలు

చీరాల, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలను వేగంగా గమ్యస్థానాలకు చేర్చే ఉద్దేశంతో.. ప్రారంభించిన వందేభారత్ రైలు సేవలు చీరాలలో అందు బాటులో లేకపోవడంపై ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు నాయకులు ప్రజాప్రతినిధులు కూడా దీనిపై దృష్టిసారించకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. నియోకవర్గంలో సుమారు 2 లక్షలు పైగా జనా భా ఉంది. ఇక్కడ అత్యంత పాచుర్యం పొందిన వస్త్ర, వాణిజ్య వ్యాపార సముదాయాలు కోకొల్లాలు. అలాగే వేల సంఖ్యలో విద్యార్థులకు విద్యాబోధన అందజేస్తున్న ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలలు ఉన్నాయి. పర్యాటకానికి అతి థుల రాకతో నిత్యం రద్దీగానే ఉంటుంది. అలాగే ప్రైవేటు ఫ్యాక్టరీల్లో ఉపాధి పొందుతున్న వారు వేల సంఖ్యలో ఉన్నారు. ఈ విధంగా చూస్తుంటే చీరాల ఇతర ప్రాంతాలకంటే ఎందులోనూ తక్కువ కాదు. పేరుకు బాపట్ల జిల్లా అ యినా కూడా చీరాలలోనే సౌకర్యాలు, వ్యాపారాలు అధికంగా ఉంటాయి. దీంతో చీరాల నుండి నిత్యం ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు, చీరాలకు వ చ్చే వారి సంఖ్య అధికమే. ఇక రైల్వేశాఖ ఆదాయం పరంగాను రాష్ట్ర స్థాయిలో చీరాల 30వ స్థానంలో నిలిచింది. ఈక్రమంలో చూసుకుంటే జిల్లాలోనే చీరా లకు ప్రత్యేక స్థానం ఉన్నట్లు చెప్పవచ్చు. ఈ విధంగా అన్ని రంగాల్లో ముందున్నచీరాలకు ఇతర రాష్ట్రాలు, దేశాల నుండి కూడా రాకపోకలు ఉంటాయి.

హాల్టింగ్‌కు వినతి..

వందేభారత్ రైలుకు చీరాల రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ లేదు. దీంతో చీరాలలో జరుగుతున్న వ్యాపారాలు దీంతో రైల్వేకు అందుతున్న ఆదాయంతో పాటు, కేంద్రానికి జీఎస్టీ రూపంలో జరుగుతున్న చెల్లింపుల వివరాలను రైల్వే అధికారులకు వ్యాపారులు అందజేశారు. హాల్టింగ్ ఏర్పాటు చేయాలని వినతులు అందజేశారు. అయినా ఇప్పటికీ దీనిపై రైల్వేశాఖ నుంచి కదలిక రాలేదు. ప్రజాప్రతినిధులు పట్టుబట్టకపోవడమే ఇందుకు కారణమంటూ చర్చలు సాగుతున్నాయి.



వందే భారత్ ప్రారంభ సమయంలో చీరాల్లో ఆగినప్పుడు ఫొటోలు దిగుతున్న ప్రజలు (ఫైల్‌ఫొటో)

రైల్వేకు ఆదాయం



వందే భారత్ రైలు చీరాలలో ఆగడం వల్ల రైల్వేకు అధికంగా ఆదాయం సమకూరుతుంది. అలాగే ప్రజలకూ ప్రయోజనం. ఇప్పుడు ప్రతి ఒక్కరూ సమయానికి ఎక్కువ విలువిస్తున్నారు. శరవేగంగా నడిచే వందే భారత్‌పై చీరాల ప్రజలు ఆశతో ఉన్నారు.

- గుర్రం రాఘవరావు, వస్త్రవ్యాపారి, చీరాల

వంతెన నిర్మాణానికి.. వీడిన గ్రహణం

- గుండ్లకమ్మ నదిపై నిలిచిన వంతెన నిర్మాణం
- మూడు జిల్లాల ప్రజల అవస్థలు
- వైసీపీ హయాంలో నిలిచిన నిధులు
- మంత్రి రవికుమార్ సమీక్షతో..ప్రారంభానికి కసరత్తు

అద్దంకి, మే 5 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ విధ్వంస పాలనతో అభివృద్ధికి దూరమైన పలు ప్రాజెక్టులు.. కూటమి ప్రభుత్వ హయాంలో ఒక్కొక్కటిగా పట్టాలెక్కుతున్నాయి. ఈ క్రమంలోనే బల్లికురవ మండలం వెలమవారిపాలెం, ముండ్లమూరు మండలం జమ్మలమడకల మధ్య గుండ్లకమ్మ నదిపై వంతెన నిర్మాణాన్ని వేగవంతం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పెదజాగర్లమూడి - పూరిమెట్ల రోడ్డులో ఉన్న వంతెన నిర్మాణానికి సుమారు రూ.8 కోట్లు నిధులు మంజూరు చేయగా పక్షం రోజుల్లో పనులు ప్రారంభం కానున్నాయి.

మూడు జిల్లాలకు అనుసంధానంగా..

ఈ వంతెన నిర్మాణం అటు ప్రకాశం, గుంటూరు, బాపట్ల జిల్లా ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుంది. ఈ ప్రాంతం ఒకప్పుడు మార్టూరు నియోజకవర్గం పరిధిలో ఉంది. అప్పట్లో నియోజకవర్గ అభివృద్ధి కోసం యద్దనపూడి, మార్టూరు, బల్లికురవ, సంతమాగులూరు, ముండ్లమూరు మండలాలలో ఉన్న అత్యధిక గ్రామా లను కలుపుతూ పెదజాగర్లమూడి - పూరిమెట్ల(పీపీ రోడ్డు)ను ఆర్అండ్‌బీ పరిధిలో చేర్చారు. అప్పటి నుండి విడతల వారీగా ఆయా ప్రాంతాల్లో తారు రోడ్ల నిర్మాణం పూర్తి చేశారు. అయితే ఈ రహదారిలో గుండ్లకమ్మ నదిపై వంతెన లేకపోవడంతో ఆయా మండలాల ప్రజలు.. అద్దంకి వచ్చే ఆయా మండలాల్లోని గ్రామాలకు వెళ్లాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో దర్శి నియోజకవర్గంలోని గ్రామాల నుంచి గుంటూరు, విజయవాడ, అమరావతి చేరుకు నేందుకు దగ్గరి మార్గంగా ఈ రహదారి అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. నిధులు మంజూరు చేయించారు. పనులు ప్రారంభించే సమయానికి ఎన్నికల కోడ్ వచ్చింది.

వైసీపీ హయాంలో నిలిచిన పనులు

వైసీపీ ప్రభుత్వ హయాంలో వంతెన నిర్మాణ పనులు ప్రారంభించినా, బిల్లులు చెల్లించకపోవడంతో అర్ధంతరంగా నిలిచిపోయాయి. నాలుగేళ్లగా నిర్మాణ పనులు ఎక్కడివక్కడే ఆగాయి. దీంతో నదికి ఇరువైపులా ఉన్న గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. చిన్నపాటి వర్షం కురిసినా, సాగర్ కాలువలలో నీటి ప్రవాహం ఉన్నా గుండ్లకమ్మ నదిలో నీటిప్రవాహం ఉంటోంది. దీంతో బాపట్ల జిల్లా పరిధిలోని అద్దంకి, బల్లికురవ, సం తమాగులూరు మండలాలు, పల్నా డు జిల్లాలోని వినుకొండ రూరల్, నూజెం డ్ల, ప్రకాశం జిల్లా పరిధిలోని ముండ్ల మూరు మండలాల్లోని పలు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించాలంటే అటు అద్దంకి లేదా అటు వినుకొండ వైపు నుంచి ప్రయాణించాల్సి వస్తుంది.



గుండ్లకమ్మ నదిపై పనులు నిలిచిపోయిన బ్రిడ్జి

పక్షం రోజుల్లో పనులు ప్రారంభించేలా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అద్దంకి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న గొట్టిపాటి రవికుమార్ విద్యుత్‌శాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. ఆయన ప్రత్యేక చొరవ తీసుకొని ఇటీవల ఆర్అండ్‌బీశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆ సమయంలో గుండ్లకమ్మ నదిపై అర్ధంతరంగా నిలిచిపోయిన పనులను వెంటనే ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో మరోపక్షం రోజులలో వంతెన నిర్మాణ పనులు ప్రారంభింప చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

48 కేంద్రాల్లో.. క్వింటా కొనలేదు!

- దిగుబడులు లక్షల టన్నుల్లో..ఇప్పటికి వచ్చింది 958 టన్నులే
- ప్రహసనంగా మారిన పంటల మద్దతు ధర
- మూలాలపై దృష్టి పెట్టని మార్క్‌ఫెడ్
- ఇప్పటికే ప్రభుత్వంపై విమర్శలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లా వ్యాప్తంగా 62 కొనుగోలు కేంద్రాలను మార్క్‌ఫెడ్ తెరిచి ఇప్పటికే నెలన్నర దాటింది. పెసలు, కంది, మినుములు, శనగ, జొన్నలను మద్దతు .దరకు సేకరించడం జరుగుతుందని మార్క్‌ఫెడ్ ప్రకటించింది. తెరిచిన కొనుగోలు కేంద్రాలే తక్కువగా ఉంటే వాటిల్లో 48 చోట్ల ఇప్పటి వరకు ఒక్క క్వింటా పంట కొనక పోవడం విస్తుగొలుపుతోంది. మద్దతు ధర కంటే బయటి మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉందా అంటే.. ఆ పరిస్థితి కూడా కనిపించడం లేదు. దాదాపు అన్ని పంటల ధరలు ఎంఎస్‌పీ కన్నా బయట రూ.100 నుంచి రూ.400 వరకు తక్కువగానే ఉన్నాయి. అయినప్పటికీ రైతులు బహిరంగ మార్కెట్ వైపే మొగ్గు చూపు తున్నారు కానీ, కొనుగోలు కేం ద్రాల ముఖం చూడడానికి కూడా ఇష్టపడడం లేదు.

ప్రస్ఫుటంగా వైఫల్యాలు..

దిగుబడులు అన్నదాతలు చేతికొచ్చిన మూడు వారాల తర్వాత కానీ మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలు తెరవలేదు. ఆ తర్వాత కూడా మద్దతు .దర విషయంలో అన్న దాతలకు అవగాహన కల్పించడంలో నిర్లక్ష్యమే ప్రదర్శించింది. గత ప్రభుత్వంలో దాదాపు గా మార్క్‌ఫెడ్‌ను నిర్వీర్యం చేయడమే కాకుండా.. అరకొరగా కొనుగోళ్లు జరిపిన వాటి విషయంలో నగదు జమ నెలల తరబడి జాప్యం కావడం.. ఇంకా అన్నదాతలను వెంటాడుతోంది. దీంతో ధర తక్కువయినా బయటి మార్కెట్‌కే రైతాంగం జై కొడుతోంది. ప్రస్తుతం నగదు జమ విషయంలో 15 నుంచి 20 రోజుల సమయం తీసుకోవడంతో పాటు ఇతరత్రా నిబంధనలు కూడా కేంద్రాల వద్ద స్పందన లేకపోవడానికి కారణంగా కనబడుతోంది. దాదాపు రూ. 2 కోట్ల వరకు అన్నదాతలకు పెం డింగ్ ఉన్నట్లు సమాచారం. ఈ బాలారిష్టాలకు తోడు పెట్టుబడుల సమయంలో నగదు సమ కూర్చిన దళారులకు పంట అమ్మకాలపై ముం దస్తు అనధికారిక ఒప్పందాలు కూడా రైతులకు శాపంగా పరిణమిస్తున్నాయి. మొక్కుబడిగా కొను గోలు కేంద్రాలు తెరవడంతో సరిపెట్టిందే తప్ప.. మూలాలపై దృష్టి పెట్టి అన్నదాతలను కొనుగోలు కేంద్రాలను బాట పట్టించడంలో మార్క్‌ఫెడ్ విఫలమైంది. ఇదిలా ఉంటే మొక్కజొన్నను మద్దతు ధరకు సేకరించే విషయంలో ఇంకా మార్క్‌ఫెడ్ దోబూచులాడుతూనే ఉంది. దీంతో ఇప్పటికే 70 శాతం పంట దళారుల వద్దకు చేరిపోయింది.

మొత్తం తెరిచిన కొనుగోలు కేంద్రాలు 62



పర్చూరు: అడుసుమల్లిలో పెసల సేకరణ (ఫైల్)

సేకరణ తీసికట్టుగా!

- జిల్లాలో పెసలు దిగబడి 8,000 టన్నుల వరకు ఉంటుందని వ్యవసాయశాఖ లెక్కకట్టింది. ఎంఎస్‌పీ రూ.8,682గా ఉంటే బయటి మార్కెట్‌లో దక్కుతున్నది రూ.7,000కు అటుఇటుగా ఉంది. సేకరణ లక్ష్యం 3,500 టన్నులు ప్రభుత్వం ఇస్తే.. ఇప్పటికి వచ్చింది 869 టన్నులే.
- కంది జిల్లాలో పరిమితంగానే సాగవడంతో లక్ష్యం 190 టన్నులుగా నిర్ణయించగా, కొనుగోలు 69 టన్నులకే పరిమితమైది. కంది మద్దతు ధర రూ.7,550 గా ఉండగా బహిరంగ మార్కెట్‌లో రూ.7,200గా ఉంది.
- మినుములు జిల్లాలో దిగుబడి 35,000 వేల టన్నులు లెక్కకట్టగా.. మార్క్‌ఫెడ్ సేక రణ మరీ తీసికట్టుగా 19 టన్నులకే పరిమిత మైంది. మద్దతు ధర రూ.7,400గా ఉంది.
- ఇక శనగ, జొన్న విషయంలో మార్క్‌ఫెడ్ ఇంతవరకు ఖాతానే తెరవలేదు. శనగ దిగుబడులు 45,000 టన్నుల వరకు ఉంటాయని వ్యవసాయశాఖ తేల్చింది. మార్క్‌ఫెడ్‌కు ఇచ్చిన లక్ష్యం 5 వేల టన్నులు కాగా, ఇప్పటికి క్వింటా కూడా కేంద్రాల వద్దకు రాలేదు.
- ఇక మొక్కజొన్న దాదాపు 23,500 హెక్టార్లలో సాగయింది. సేకరణకు సంబంధించి ఓ నిర్ణయానికి ప్రభుత్వం రాలేదు. మరో వైపు దిగుబడులలో 75 శాతం ఇప్పటికే దళారుల వద్దకు చేరినట్లు క్షేత్రస్థాయి పరిస్థితులు ధ్రువీకరిస్తున్నాయి.

48 కేంద్రాల్లో ఖాతానే తెరవలేదు

పెసలుకు మొత్తం 15 కేంద్రాలను తెరిస్తే 9 కేంద్రాల్లో 1,087 మంది రైతులు రిజిస్టర్ చేయించుకున్నారు. 571 మంది పంటను ఎంఎస్‌పీకి విక్రయించుకున్నారు. కంది కొనుగోలు కేంద్రాలు ఆరు కాగా నాలుగు చోట్ల 134 మంది రిజిష్టర్ చేసుకున్నారు. 64 మంది ఎంఎస్‌పీ లబ్ధి పొందగలిగారు. మినుములుకు 15 కేంద్రాలను తెరవగా ఒక్క చోట మాత్రమే 80 మంది రైతులు రిజిష్టర్ చేసుకున్నారు. 16 మంది తమ పంటను మద్దతు ధరకు అమ్ముకున్నారు. శనగకు 16 కేంద్రాలు తెరిస్తే ఇప్పటి వరకు జీరో ప్రొక్యూర్‌మెంట్ జరిగింది. అదే విధంగా జొన్న విషయంలో కూడా 10 కేంద్రాలను తెరిస్తే స్పందన్ నిల్‌గా ఉంది.

అవీ.. ఇవీ..

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి

● వ్యవసాయ మోటార్ ఆన్ చేస్తుండగా ఘటన

బల్లికురవ, మే 5 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో కౌలురైతు సురభి నాగేశ్వరరావు(49) మృతిచెందిన ఘటన మండలంలోని కూకట్లపల్లి ఎస్సీ కాలనీలో సోమవారం చోటుచేసుకొంది. అందిన సమాచారం మేరకు కూకట్లపల్లి ఎస్సీ కాలనీకి చెందిన కౌలు రైతు సురభి నాగేశ్వరరావు ఎస్ఎల్ గుడిపాడు గ్రామ పరిధిలోని పంటపొలాన్ని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. సోమవారం ఉదయం రోజుమాదిరిగానే పంటపొలంలో విద్యుత్ మోటార్‌ను ఆన్ చేసేందు కు ప్రయత్నించాడు. దీంతో ప్రమాదవశాత్తు తీగలకు విద్యుత్ సరఫరా కావడంతో రైతుకు తీవ్రగాయాలై కిందపడ్డాడు. వెంటనే పక్క పొలాలోని రైతులు గమనించి అపస్మారక స్థితిలో ఉన్న నాగేశ్వరరావును ఆటోలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ పోషణ కోసం వేరే గ్రామంలో పొలం కౌలుకు తీసుకొని పంటలు సాగుచేస్తూ, విద్యుత్‌షాక్‌తో రైతు మృతి చెందడంతో కూకట్లపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. నాగేశ్వరరావుకు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి సోదరుడు శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు బల్లికురవ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ వీరవల్లి శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వైద్యశాలలో ఉన్న మృతదేహానికి పోస్టు మార్టం చేయించి వారి బంధువులకు అప్పగిస్తామని పోలీసులు తెలిపారు.

చెన్నుపల్లిలో యువకుడి ఆత్మహత్య

బల్లికురవ, మే 5 (ఆంధ్రజ్యోతి) : యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని చెన్నుపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకొంది. గ్రామంలోని ముస్లిం కాలనీకి చెందిన షేక్ షరీప్(22) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం పక్కనే కొమ్మాలపాడు గ్రామానికి వెళ్లి అక్కడ ఒక తాడు కొనుగోలు చేశాడు. ఇంటికి వచ్చే మార్గమధ్యంలో చెన్నుపల్లి గ్రామ సమీపంలో వేపచెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యువకుడి ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. సోమవారం యువకుడి మృతదేహానికి వారి కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి


పేర్లి ప్రకాశరావు (ఫైల్)

తోటవారిపాలెం(చీరాల), మే 5 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పథకం పనిచేస్తూ గుండెపోటుతో కూలి మృతిచెందిన ఘటన మండల పరిధిలోని తోటవారిపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పేర్లి ప్రకాశరావు(54) ఎప్పటిలాగే సోమవారం ఉదయం కాలువలో నిర్వహిస్తున్న ఉపాధి పనులకు వెళ్లాడు. అయితే కొద్దిసేపు పని అనంతరం అలసటగా ఉండడంతో గట్టుకు ఆనుకుని కుప్ప కూలాడు. ఫీల్డ్ అసిస్టెంట్ పాపన సుజాత, కూలీల సహాయంతో ఆయన్ను చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీనిపై ఉపాధి కార్యాలయ సిబ్బంది వివరాలు నమోదు చేసుకున్నారు. మృతునికి భార్య, వివాహమయిన కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

మార్టూరు, మే5(ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు ప్రదేశాలలో జరిగిన రోడ్డు ప్రమాదాలలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం జాతీయరహదారిపై మార్టూరు మండల పరిధిలో చోటుచేసుకొంది. వాటిలో చిలకలూరిపేట వైపు వెళ్లే రోడ్డులో ఎలవర్తి కోల్డ్‌స్టోరేజీ సమీపంలో మండలంలోని నాగరాజుపల్లి గ్రామానికి చెందిన వడ్లమూడి కాలేషా పల్సర్ బైక్ పై పేట వైపు వెళుతుండగా,వెనుకవైపు నుండి గుర్తుతెలియని వాహనం ఢీకొన్నది.ఈ ప్రమాదంలో బైక్ పై నుండి రోడ్డుపై పడిపోయిన కాలేషా తలకు గాయమయ్యింది.దాంతో అతనిని 108 వాహనంలో చిలకలూరిపేటలోని ప్రవేటు ఆస్పత్రి కి తరలించారు.అదేవిధంగా కోనంకి నుండి ఇసుకదర్శి రోడ్డుకు రాంగ్ రూట్ లో స్కూటీపై వెళుతున్న కామేపల్లి జయకృష్ణ వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోగా అతనితలకు గాయాలయ్యాయి.జె పంగులూరు మండలం రామకూరు గ్రామానికి చెందిన అతనిని హైవే అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పిడుగుపాటుకు ఎడ్లజత మృతి

● ఒక ఇంటి మెట్లు, చెట్లు ధ్వంసం


మృతిచెందిన ఎడ్లజత

చీరాల, మే 5 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ఆదివారం కురిసిన భారీ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంబీభత్సం సృష్టించింది. ఈక్రమంలో పలుచోట్ల పొలాల్లో, చెట్లపై, ఇంటిపై పిడుగులు పడ్డాయి. మండలంలోని పాత చీరాల గ్రామానికి చెందిన పిట్టు నాగరాజు ఎడ్లబండితో జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో ఇంటి సమీపంలో చెట్టుకు కట్టేసిన రెండు ఎడ్లుపై పిడుగు పడింది. దీంతో రెండు మూగజీవాలు అక్కడికక్కడే మృతిచెందాయి. వీటి విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటాయని యజమాని తెలిపాడు. ప్రాణం కోల్పోయి చెట్లు కింద పడి ఉన్న ఎడ్ల కళేబరాలను చూసి యజమాని దంపతులు విలపించారు. అలాగే వేటపాలెం పరిధిలోని వడ్డె సంఘం గ్రామానికి చెందిన కొమ్మనబోయిన శ్రీనివాసరావు ఇంటి మెట్లుపై పిడుగు పడి మెట్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అంతేకాకుండా ఉజిలీపేటకు చెందిన మరో మహిళకు చెందిన గేదె పొలాల్లో ఉండగానే పిడుగు మృతి చెందింది. ఈక్రమంలో చోటుచేసుకున్న వరుస ఘటనలతో ప్రజలు భీతిల్లి పోయారు. పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్ బాక్సు సైతం పల్టీలు కొడుతూ రోడ్డుకు అడ్డంగా చేరింది.

మధ్యవర్తిత్వానికి వెళ్లిన వ్యక్తిపై దాడి


తీవ్రంగా గాయపడ్డ నాగరాజు

అద్దంకి, మే5 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వానికి వెళ్లిన వ్యక్తిపై దాడి చేయడంతో తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికుల కథనం మేరకు అద్దంకి పట్టణంలోని గుర్రాల కాలనీలో చిన్న విషయమై యువకుల మధ్య సోమవారం గొడవ జరగగా గాలేటి నాగరాజు మధ్యవర్తిత్వానికి వెళ్లాడు. దీంతో వారిలో కొంతమంది యువకులు నాగరాజుపై దాడి చేశారు. గాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే వైద్యం చేయించుకోకుండా నాగరాజు హడావుడి చేస్తుండడంతో అటువైపుగా వెళ్తున్న సీఐ సుబ్బరాజు వైద్యశాలకు వెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చి వైద్యం చేయించారు.

నాగులపాలెంలో గడ్డివామి దగ్ధం

● రూ.2 లక్షలకు పైగా ఆస్తినష్టం


మంటలను అదుపుచేస్తున్న సిబ్బంది

నాగులపాలెం(పర్చూరు), మే 5 (ఆంధ్రజ్యోతి) : గడ్డివామి దగ్ధమైన ఘటన మండల పరిధిలోని నాగులపాలెం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సాధినేని సాంబయ్యకు చెందిన గడ్డివామి పూర్తిగా కాలిపోయింది. గడ్డివామి అగ్ని ప్రమాదానికి గురికావడంతో స్థానికులు చీరాల అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది హుటా హుటిన ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపుచేశారు. అప్పటికే గడ్డి పూర్తిగా కాలిపోయింది. ఈప్రమాదంలో రూ.2లక్షలకు పైగా ఆస్తినష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.

వలస కార్మికులపై ఏదీ నిఘా?

● మార్టూరు ప్రాంతంలో 8 వేలకు పైగా ఇతర రాష్ట్రాల కార్మికులు ● పర్యవేక్షించని పోలీసులు, యజమానులు


గ్రానైట్ పరిశ్రమలో పనిచేసేందుకు వస్తున్న రాజస్థాన్ యువకులు

మార్టూరు, మే5: (ఆంధ్రజ్యోతి): మార్టూరు ప్రాంతంలో ఉన్న గ్రానైట్ వ్యాపారం ప్రధానంగా ఇతర రాష్ట్రాలకు చెందిన వలస కార్మికులపైనే ఆధారపడి ఉంటుంది. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన కార్మికులు రాకపోతే మార్టూరు ప్రాంతంలోని గ్రానైట్ పరిశ్రమలు లోని యంత్రాలు కదలవు. వారు పనిచేయని గ్రానైట్ పరిశ్రమ లేదంటే అతిశయోక్తి కాదు.

స్థానికంగా ఉన్న కార్మికులు గ్రానైట్ పరిశ్రమలో పనిచేయలేరు. దీంతో ప్రతి గ్రానైట్ పరిశ్రమ యజమాని కనీసం 15 నుండి 20 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులపైనే ఆధారపడతారు. వారిలో అత్యధికంగా రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన వారుకాగా, ఒడిషా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహార్, తమిళనాడు తదితర రాష్ట్రాలకు చెందిన వారు గ్రానైట్ కూలీలుగా ఈ ప్రాంతంలో పనిచేస్తున్నారు. గ్రానైట్ పరిశ్రమలతో పాటు కంకరమిల్లులు, స్పిన్నింగ్ మిల్లులో మరి కొంత మంది పనిచేస్తున్నారు. ఈ ప్రాంతంలో గ్రానైట్ పరిశ్రమలు 200కు పైగానే ఉన్నాయి. దాదాపుగా ఇతర రాష్ట్రాలకు చెందిన వారు 8 వేల మందికి పైగానే ఈ ప్రాంతంలో వివిధ గ్రానైట్ పరిశ్రమలు, గ్రానైట్ క్వారీలు పనిచేస్తున్నట్లు సమాచారం. ప్రతి వారంలో ఎంతో కొంతమంది వస్తుంటారు మరికొంతమంది ఇక్కడనుండి వెళ్లిపోతుంటారు. అమావాస్య రోజు మాత్రం రాజస్థాన్ కార్మికులు పనిచేయరు. దీంతో గ్రానైట్ పరిశ్రమలకు కూడా యజమానులు సెలవు ప్రకటిస్తారు.

కొరవడిన నిఘా

ఇతర రాష్ట్రాల గ్రానైట్ కార్మికులపై ఇక్కడ నిఘా పెద్దగా ఉండదు. ముఖ్యంగా గ్రానైట్ పరిశ్రమలలో పనిచేసే కూలీలపై పర్యవేక్షణ పెద్దగా ఉండదు. వాస్తవంగా ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు గంజాయి, గుట్కాలకు, అలవాటుపడిన వారు చాలా మంది ఉన్నారు. కార్మికుల మాటున నేరచరిత్ర ఉన్న వారు ఇక్కడికి వచ్చే అవకాశం లేకపోలేదు. ఈ నేపథ్యంలో కార్మికుల రాకపోకలపై నిఘా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏ ఏ గ్రానైట్ పరిశ్రమలలో ఎంత మంది ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కార్మికులుగా పనిచేస్తున్నారనే వివరాలపై పోలీసులు పర్యవేక్షణ చేయాల్సిన అవశ్యకత ఉంది. అంతేగాకుండా మార్టూరు కూడలిలో లారీబ్రోకర్ కార్యాలయాలు, కూడా కొంతమంది ఇతర రాష్ట్రాలకు చెందిన వారు నిర్వహిస్తున్నారు. వారిలో కొంతమందికి గ్రానైట్ అక్రమ రవాణాచేసే యువకులతో సంబందాలు ఉన్నాయి. కార్యాలయాలకు ఎవరు వస్తున్నారు, వారు వాస్తవంగా లారీలను సప్లయ్ చేస్తున్నారా, ఇంకా ఏమైనా అసాంఘిక చర్యలకు పాల్పడుతున్నారా..? అనే విషయంపై పూర్తిస్థాయి అవగాహన స్థానిక అధికారులకు ఉండాల్సిన అవసరం ఉంది. మార్టూరు కూడలిలో కొత్తయువకులు ఎవరు కనబడినా వారు ఇతర రాష్ట్రాలనుండి వచ్చిన గ్రానైట్ కార్మికులే అని ప్రజానీకం భావిస్తున్నారు. మరి వారు గ్రానైట్ పనికే వచ్చారా..? లేదా..? అనే విషయంపై సంబంధిత అధికారులు నిఘా పెట్టవలసిన అవసరం ఉంది. అదేవిధంగా గ్రానైట్ పరిశ్రమలలో, లేదా ఇతరత్రా చోట పనిచేసే ఇతర రాష్ట్ర కార్మికులకు గుర్తింపుకార్డులను ఇవ్వాలని గతంలో చర్చకు వచ్చిన సందర్భాలు ఉన్నాయి. ఆ దిశగా పోలీసుశాఖ కృషి చేయాల్సిన అవసరం ఉంది.

ఎప్పుడు ఉంటారో, ఎప్పుడు వెళతారో తెలియదు



గ్రానైట్ పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు గుర్తింపు కార్డులను ఇవ్వాలనే ఆలోచన మంచిదే. అయితే వారు ఎప్పుడు పనిచేస్తారో..? ఎంతకాలం ఉంటారో..? ఎపుడు వెళతారో..? మాకే అర్థంకాని పరిస్థితి. ఇంతవరకు రాష్ట్రంలో గ్రానైట్ పరిశ్రమలో పనిచేసేవారికి గుర్తింపు కార్డులను ఇవ్వలేదు. అయినా ప్రభుత్వ నియమ నిబంధనలను పాటిస్తాం.
సురేష్ గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు

వలస కార్మికులపై నిఘా పెడతాం



మార్టూరు ప్రాంతంలో గ్రానైట్ పరిశ్రమలు ఇతర పనులు కోసం ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న కార్మికులపై పోలీసు నిఘా తప్పనిసరిగా ఉంటుంది. గ్రానైట్ పరిశ్రమల యజమానులతో మాట్లాడి వారి పరిశ్రమలలో పనిచేసే వారి సమాచారాలు సేకరిస్తాం.
ఎం.శేషగిరిరావు సీఐ మార్టూరు

పొలాల్లోకి మురుగురాకుండా నివారించాలి

ఆర్డీవోకు సమస్యను వివరించిన మాజీ మంత్రి పాలేటి రామారావు


వినతిపత్రం ఇస్తున్న రైతులు, మజీ మంత్రి పాలేటి

చీరాల, మే 5 (ఆంధ్రజ్యోతి) : పంట కాలువల్లో మురుగునీరు చేరి రైతులు నష్టపోతున్నారని మున్సిపల్ అధికారులు ఎస్టీపీ ప్లాంట్ పనులు ప్రారంభించి సమస్యలు పరిష్కరించాలని మాజీ మంత్రి డా.పాలేటి రామారావు కోరారు. సోమవారం రైతులతో కలిసి ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, కమిషనర్ అబ్దుల్ రషీద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాలేటి మాట్లాడుతూ పురపాలక సంఘం పరిధిలోని వ్యర్థజలాలు దండుబాటలో నుంచి విజయనగర్ కాలనీ వద్ద ఉన్న ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్ కాలువలోకి చేరుతున్నట్లు చెప్పారు. తద్వారా గవినివారిపాలెం, అక్కయ్యపాలెం ఎత్తిపోతల పథకాల్లోకి మురుగు నీరు చేరి పంటలు దెబ్బతింటున్నట్లు చెప్పారు. ఈక్రమంలో గతంలో ప్రభుత్వం ఆ ప్రాంతంలో మురుగు నీటిని శుద్ధిచేసే విధంగా సుమారు రూ.8 కోట్లుతో తలపెట్టిన ఎస్‌టీపీ ప్లాంట్(సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్) నిర్మాణం త్వరితగతిగా ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పలువురు రైతులు ఉన్నారు.

మనమిత్ర వాట్సాప్ సేవలో అద్దంకి భేష్


సేవల గురించి వివరిస్తున్న ఈఈ మస్తాన్‌రావు

అద్దంకి, మే5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రభుత్వ సేవలకు సంబంధించి మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ సేవలు అమలులోకి తీసుకొచ్చింది. అయితే కొంతమేర అమలులో ఉన్నా ఇంకా పూర్తిస్థాయిలో అమలులోకి రాలేదు. అయితే అద్దంకి డివిజన్ విద్యుత్‌శాఖ అధికారులు మాత్రం ఒక అడుగు ముందుకు వేసి మన మిత్ర వాట్సాప్ ద్వారా వచ్చిన అర్జీలను పరిష్కరించి సంబంధిత వినియోగదారునికి నేరుగా వాట్సాప్ ద్వారా సమాచారం అందిస్తున్నారు. దీంతో మధ్యలో అధికారులు, సిబ్బంది ప్రమేయం లేకుండా పారదర్శకంగా పనులు చకచకా సాగిపోతున్నాయి. నెల రోజుల వ్యవధిలో 38 అర్జీలు మన మిత్ర వాట్సాప్ ద్వారా రాగా అన్నింటిని పరిష్కరించినట్లు ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు. వీటిలో కొత్త ట్రాన్స్‌పార్మర్ల ఏర్పాటుకు 10, వినియోగదారుడు ఖర్చు భరించే విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌పార్మర్ల మార్పు 3, అదనపులోడు కోసం 8, వ్యవసాయ విద్యుత్ ట్రాన్‌ఫార్మర్‌లు 17(62 మంది రైతులు) అర్జీలు రాగా పరిష్కరించినట్లు తెలిపారు. దీంతో విద్యుత్ వినియోగ దారులు గతంలో వలే అధికా రులు, సిబ్బంది చుట్టూ తిరిగే శ్రమ, వ్యయం కూడా తప్పినట్లు అయ్యింది. విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడం తో విద్యుత్‌శాఖ అధికారులు మిగిలిన ప్రాంతాల కంటే ముందే పారదర్శకంగా, వేగవంతంగా పనులు చేయాలనే తలంపుతో అర్జీల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి సారించారు. అదేసమయంలో విద్యుత్ వినియోగదారులలో చైతన్యం తీసుకు వచ్చే విధంగా అధికారులు తరచూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అవగాహన కూడా కల్పిస్తున్నారు.

వీళ్లు మారరా..?



ఒకే ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఐదుగురు మైనర్లు

సాల్మన్ సెంటర్(చీరాల), మే 5 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిసర ప్రాంతాల్లో మైనర్‌లు హద్దులు దాటుతున్నారు. ఒకవైపు రోడ్డు ప్రమాదాల్లో మరణాలు చవిచూస్తున్న వారిలో భయం, బాధ్యత కలుగడం లేదు. ఆదివారం జాండ్రపేట సమీపంలో ఓ మైనర్ రోడ్డు ప్రమాదంలో అసువులు బాశాడు. ఈక్రమంలో ఆ కుటుంబం బోరున విలపిస్తోంది. రెండోరోజే ఆ సమీపంలోనే బేర్ హాస్పిటల్ ఎదురుగా ఒక్క ద్విచక్ర వాహనంపై ఐదుగురు మైనర్‌లు దర్జాగా ప్రయాణం చేస్తున్నారు. ఈ ఘటన 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కింది. వీరిపట్ల ఇంట్లో పెద్దలు కూడా నిర్లక్ష్యంగా ఉంటున్నారు. పోలీసులు ఒకవైపు మైనర్‌లకు వాహనాలు ఇవ్వరాదని హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ, వీరు మాత్రం అధికారుల మాటలు పెడచెవిన పెడుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు కొంచెం కఠినంగా వ్యవహరించకుంటే పరిస్థితి చక్క బడేలా లేదు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు

అద్దంకి, మే 5 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని ఈఈ నల్లూరి మస్తానరావు అన్నారు. అద్దంకి పట్టణంలోని 3వ వార్డు పరిధిలో కొత్త నంబూరివారిపాలెం, కాటికాపురుల కాలనీలలో కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్‌స్తంభాలు, విద్యుత్‌లైన్లను సోమవారం ఈఈ నల్లూరి మస్తాన్‌రావు పరిశీలించారు. నంబూరివారిపాలెంలో ఇటీవల అంబేద్కర్ జయంతి కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి రవికుమార్ దృష్టికి స్థానికులు విద్యుత్ సమస్యలను తీసుకొచ్చారు. వెంటనే విద్యుత్‌స్తంభాలను మార్పు చేసి కొత్తలైన్లను ఏర్పాటు చేయాలని స్థానిక విద్యుత్‌శాఖ అధికారులను మంత్రి రవికుమార్ ఆదేశించారు. సుమారు రూ.20 లక్షలతో కొత్త నంబూరివారిపాలెం, కాటికాపరుల కాలనీలలో 45 విద్యుత్ స్తంభాలు, విద్యుత్‌లైన్లు ఏర్పాటు చేశారు. సోమవారం ఆయా ప్రాంతాలలో ఈఈ నల్లూరి మస్తాన్‌రావు పరిశీలించి స్థానికులతో మాట్లాడి ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సుమారు 4 దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలతో ఇప్పటి వరకు ఇబ్బంది పడ్డామని, కొత్త లైన్లు ఏర్పాటుతో సమస్య తీరిందని స్థానికులు అధికారుల వద్ద హర్షం వ్యక్తం చేశారు. అదనపు లోడు కోసం ప్రభుత్వం కల్పించిన 50 శాతం రాయితీని వినియోగించుకోవాలని అధికారులు వివరించారు. పాత నంబూరివారి పాలెం లో మరో 15 విద్యుత్ లైన్లను కూడా త్వరలో మార్పు చేస్తామని ఈఈ మస్తాన్‌రావు తెలిపారు. డీఈ దామోదరం, లైన్‌మెన్ నరేష్, స్థానిక టీడీపీ నేతలు నాగరాజు, కోండ్రు వీరాంజనేయులు తదితరులు ఉన్నారు.

ఘనంగా రామమందిర నిర్మాణం



రామమందిర ప్రారంభోత్సవంలో భక్తులు, పోలేరమ్మవారు

వేటపాలెం(చీరాల), మే 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొత్తపాలెం దత్తక్షేత్రంలో నూతనంగా నిర్మించిన రామమందిరం సోమవారం కమిటీ ప్రతినిధులు ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఆర్ఐ కిరణ్ కోడూరి హాజరయ్యారు. భక్తులు ప్రారంభ కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రత్తి వెంకటసుబ్బారావు, శివప్రసాద్, మురళీకృష్ణ, రంగనాయకులు, రామకృష్ణ, సత్యన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

తోటవారి పాలెం (చీరాల) : మండల పరిధిలోని తోటవారిపాలెంలో వేంచేసిన శ్రీ పోలేరమ్మ తిరునాళ్ల మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సోమవారం కమిటి ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఏటా నిర్వహించే తిరునాళ్లకు సుమారు 10 వేల మంది హాజర వుతుంటారు. అందుకు సంబంధించి సోమ వారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం పొంగళ్లు నిర్వహించనున్నారు. పోలీసులు బదోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

రేపు కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి

అద్దంకి : కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా బుధవారం అద్దంకి లోని దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు దేవస్థానం కార్యనిర్వహక అధ్యక్షుడు చిన్ని లక్ష్మీశ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 4-30 గంటల నుండి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. రాత్రి 7 గంటలకు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వీహెచ్‌పీ మండల శాఖ ఏర్పాటు


వీహెచ్‌పీ నూతన శాఖ

అద్దంకి : విశ్వహిందూ పరిషత్ అద్దంకి మండల శాఖను ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ శివన్నారాయణ తెలిపారు. సోమవారం స్థానిక గీతామందిరంలో నిర్వహించిన సమావేశంలో అద్దంకి మండలశాఖ అధ్యక్షుడిగా అన్నం రామానందనాథ్, ఉపాధ్యక్షుడిగా బొగ్గవరపు వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా గుంజి గోవిందు, సహ కార్యదర్శి గా అన్నం లక్ష్మణ్‌కుమార్, కోశాధికారిగా తోట చంద్రశేఖర్, భాగవతుల సూర్య మాల కొండమాచార్యులు, ముద్దంశెట్టి సాంబశివ రావు, మండలపు లక్ష్మీ నారాయణ, త్రిపురారిబొట్ల సుధాకర్ లను నియమించారు. కార్య క్రమంలో మద్దుల వెంకటేశ్వర్లు, వాసు గురుస్వామి, కొండ్రగుంట శ్రీనివాసరావు, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల మృతిపై కలెక్టర్‌కు నివేదిక

బల్లికురవ, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెన్నుపల్లి, ముక్తేశ్వరం గ్రామాలలో శనివారం ఇద్దరు కూలీలు ఉపాధి హామీ పథకం పనులు చేస్తూ మృతి చెందిన సంగతి తెలిసిందే. దీంతో జిల్లా అధికారులు వివరణ కోరగా సోమవారం ఎంపీడీవో కుసుమకుమారి నివేదికను పంపించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతు రెండు గ్రామాలలో ఉపాధి కూలీలు మృతి చెందడం బాధాకరమన్నారు. కూలీలకు పనుల వద్ద తాగునీటిని ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. అలానే ఓఆర్ఎస్ ప్యాకెట్లను వైద్య సిబ్బంది ద్వారా తీసుకొని అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచనలు చేశామన్నారు. కూలీలు కూడా ఎండగా ఉంటే కొద్దిసేపు పనుల వద్ద ఉన్న చెట్ల కింద సేదతీరేలా ఉంచాలని సిబ్బందికి సూచనలు చేశామన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న కూలీలు ఎండలు తగ్గే వరకు పనులకు వెళ్లవద్దని కూలీలకు ఎంపీడీవో సూచించారు. వేసవి ఎండలు తీవ్రంగా ఉన్న దృష్ట్యా గ్రామాలలో ఉదయం 7 గంటల నుండి 10 గంటల వరకు పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. కూలీలకు ఏమైన ఇబ్బందులు ఉంటే తెలియజేయాలని ఎంపీడీవో కోరారు.

మార్కెట్‌యార్డు డైరెక్టర్లుగా పలువురికి చోటు


రామాంజనేయులు, వనజ

మార్టూరు, మే5(ఆంధ్రజ్యోతి): పర్చూరు ఏఎంసీ మార్కెట్ యార్డు డైరెక్టర్లుగా మార్టూరు మండలానికి చెందిన ముగ్గురికి స్థానం దక్కింది. కొత్తగా మార్కెట్ యార్డుకు పాలక వర్గాన్ని నియమించారు. అందులో మండలంలోని వలపర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని ద్వారకపాడు గ్రామానికి చెందిన వెలగా రామాంజనేయులుకు (ఓసి) స్థానం దక్కింది. అదేవిధంగా రాజుగారిపాలెం నుంచి కొండపల్లి ధనలక్ష్మి (బీసీ), ద్రోణాదుల గ్రామం నుండి గద్దల అనిత (ఎస్సీ) లకు డైరెక్టర్లు పదవులు లభించాయి. ఇంకా యద్దనపూడి మండలంలో సూరవరపుపల్లి గ్రామానికి చెందిన తెలుగు మహిళ నాయకురాలు కోయ వనజసతీష్ (ఓసి)కు డైరెక్టర్‌గా స్థానం దక్కింది. పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబ శివరావు సూచనలు మేరకు, మార్కెట్ యార్డు అభివృద్ధికి కీలకంగా పనిచేస్తారనే నమ్మకంతో డైరెక్టర్లు గా వారిని ఎంపికచేసినట్లు టీడీపీ శ్రేణులు తెలిపాయి. అదేవిధంగా డైరెక్టర్లుగా ఎంపికైన వారందరూ ఎమ్మెల్యే ఏలూరి సాంబశి వరావుకు ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

నేడు బర్లీ పొగాకు రైతులతో ముఖాముఖి

● కార్యక్రమానికి హాజరుకానున్న ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్

ఉప్పుటూరు(పర్చూరు), మే 5 (ఆంధ్రజ్యోతి) : బర్లీ పొగాకు రైతుల సమస్యలపై పర్చూరు మండల పరిధిలోని ఉప్పుటూరు గ్రామంలో మంగళవారం సాయంత్రం 2.45 గంటలకు రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏవో ఎస్.రామమోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.రాజశేఖర్, కమిషనర్ ఆఫ్ అగ్రికల్చర్ డిల్లీరావు హాజరు కానున్నట్లు తెలిపారు. పొగాకు రైతుల సమస్యపై మాట్లాడనున్నట్లు పేర్కొన్నారు. రైతుల సమస్యలను అధికారుల సమక్షంలో స్వయంగా తెలుసుకుంటామన్నారు. నల్లబర్లీ సాగుచేసుకున్న రైతులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇంటి ప్రహరీపై దూసుకుపోయిన కారు

కొత్తపేట(చీరాల), మే 5 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి ఓ ఇంటి ప్రహరీ గోడను కారుతో ఢీ కొట్టారు. దీంతో గోడ చాలా భాగం దెబ్బతింది. అలాగే కారు కూడా దెబ్బతింది. అయితే ఇంటి యజమాని సోమవారం ఉదయం చూసేసరికి ఈ ఘటన చోటుచేసుకోగా ప్రమాదానికి కారకులు కారును అక్కడే వదిలి పరారయినట్లు తెలిసింది. కారు తెలంగాణా రిజిస్ట్రేషన్‌కు చెంది ఉంది. అయితే ఘటనపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

తహసీల్దార్‌కు ఏపీటీఎఫ్ ఉద్యోగుల వినతి

మార్టూరు, మే5 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలని. కోరుతూ సోమవారం తహసీల్దార్ ప్రశాంతికి ఏపీటీఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానాలను అనుసరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం గందరగోళం పరిస్థితులను కల్పిస్తుందని నిరసన వ్యక్తం చేశారు. దీనిలో భాగంగా ఏపీటీఎఫ్ ఉద్యోగులు ఉద్యమ కార్యచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ మాదుగుల కిషోర్,యస్‌కె జాన్ భాషా,జయకుమార్,యస్‌కె ఇర్షాద్,తవ్వా అమరబాబు,ప్రమీల,ఉమా మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి గా తమ్మన


తుమ్మన శ్రీనివాసరావు

అద్దంకి, మే5 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ మండల నూతన కార్యదర్శిగా అద్దంకి పట్టణానికి చెందిన తమ్మన శ్రీనివాసరావును నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ నియామకపు పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తమ్మన శ్రీనివాసరావును పలువురు అభినందించారు.


విద్యార్థులు నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి


విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న నరసింహారావు

చినగంజాం, మే 5(ఆంధ్రజ్యోతి) : స్థానికశాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో శిక్షణ తరగతులను సోమవారం వినోదాత్మకంగా నిర్వహించారు. విద్యార్థులు ఆలోచనా శక్తి పెంచుకుటూ తమలో దాగిన నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలని జనవిజ్ఞాన వేదిక మండల కన్వీనర్, ఆంగ్ల ఉపాధ్యాయులు ఎస్.నరసింహారావు అన్నారు. శిక్షణ తరగతులలో భాగంగా విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్‌లో వర్డ్‌గేమ్‌ను ఆంగ్ల ఉపాధ్యాయులు, కంప్యూటర్ శిక్షణలో భాగంగా వార్డ్ పెయింట్ ఎలా ఉపయోగించాలో రిసోర్స్‌పర్సన్ వై.రామాంజనేయులు వివరించారు. కథలు, కథనాలు సృజనాత్మకృతాల్లో భాగంగా కథలు చదవడం, దేశభక్తి గీతాల ఆలాపన కార్యక్రయాన్ని మరో రిసోర్స్ పర్సన్ వి.శ్రీనివాసరావులు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథపాలకులు ఎ.మోహనలక్ష్మీనరసింహాచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5



శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు


మంగళవారం 6 మే 2025

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	37.6	29.6
కావలి	38	28
ఆత్మకూరు	40	28
ఉదయగిరి	40	27
కందుకూరు	36	28



మెట్టకు మేలు జరిగేనా!?



- పాతికేళ్లుగా జరగని లోకలైజేషన్ ప్రక్రియ
- లేఅవుట్లుగా మారిన వేల ఎకరాల పొలాలు
- అయినా పాత లెక్క ప్రకారమే నీటి కేటాయింపులు
- తొమ్మిది నెలల క్రితం మంత్రులు, కలెక్టర్ ఆదేశం
- నేటికీ తేలని వాస్తవ ఆయకట్టు
- మొదట ఇరిగేషన్.. తర్వాత రెవెన్యూ శాఖల నిర్లక్ష్యం

జిల్లాలో లోకలైజేషన్ ప్రక్రియ (వాస్తవ ఆయకట్టు నిర్ధారణ) ప్రహసనంగా మారింది. ఎప్పుడో రెండున్నర దబ్బాల క్రితం నిర్ధారించిన ఆయకట్టు ప్రకారమే ఇప్పటికీ సోమశిల, కండలేరు జలాశయాల నుంచి నీటి కేటాయింపులు జరుపుతున్నారు. ఈ పాతికేళ్లలో కొన్ని వేల ఎకరాల పొలాలు లేఅవుట్లుగా, చేపలు, రొయ్యలు గుంటలుగా మారిపోయాయి. ఇలా తగ్గిన భూమి స్థానంలో మెట్ట ప్రాంతాల్లోని భూములను స్థిరీకరించాలని కొన్నేళ్ల నుంచి విజ్ఞప్తులు అందుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ అంశంపై దృష్టి సారించింది. ప్రస్తుతం ఏ కాలువ కింద ఎంత వాస్తవ ఆయకట్టు ఉందో లెక్క తేల్చాలంటూ తొమ్మిది నెలల క్రితం జిల్లాకు చెందిన మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణతోపాటు కలెక్టర్ ఓ ఆనంద్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. కానీ నెలలు గడుస్తున్నా ఈ ప్రక్రియ పూర్తి కాలేదు. గత నెలలో జరిగిన ఐఏబీలోనూ ఈ అంశం చర్చకు రావడం గమనార్హం.

నెల్లూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రధానమైనది పెన్నా డెల్టా. సోమశిల కింద 5.50 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంటే అందులో మెజారిటీ పెన్నా డెల్టాలోనే ఉంది. సర్వేపల్లి, నెల్లూరు రూరల్, కోవూరు, ఆత్మకూరు, కావలి నియోజకవర్గాల పరిధిలో డెల్టా విస్తరించి ఉంది. ఇప్పటి వరకూ కేటాయిస్తున్న నీటి లెక్కల ప్రకారం చూస్తే ఇది 2.47 లక్షల ఎకరాలుగా ఉంది. ఈ ప్రాంతాల్లో చాలా భూములు లేఅవుట్లుగా రూపాంతరం చెందాయి. మరికొన్ని భూములు చేపలు, రొయ్యల గుంటలుగా మారిపోయాయి. ముఖ్యంగా నెల్లూరు నగరం చుట్టు పక్కల వేల ఎకరాల పంట భూముల్లో లేఅవుట్లు వెలిశాయి. బుచ్చి, ఇందుకూరుపేట, విడవలూరు, కొడవలూరు ప్రాంతాల్లో చేపలు, రొయ్యల గుంటలు సాగు చేస్తున్నారు. అంతేగాక జిల్లాలో అనేక ప్రాంతాల్లో వేల ఎకరాల సాగు భూముల్లో సాగు జరగడం లేదు. కానీ ఈ భూములను కూడా లెక్కల్లోకి తీసుకొని ఏటా సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశంలో నీటి కేటాయింపులు జరుపుతున్నారు. దీంతో నీరు వృథా అవుతోంది. నిబంధనల ప్రకారం అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు లోకలైజేషన్ చేయాల్సి ఉంటుంది. ఆ లెక్కల ప్రకారమే సాగునీటి కేటాయింపులు జరపాలి. కానీ జిల్లాలో ఈ పద్ధతిని అనుసరించడం లేదు. పాతికేళ్ల క్రితం సోమశిల ఆయకట్టును నిర్ధారించారు. ఏ కాలువ కింద ఎంత ఆయకట్టు ఉంది? ఏటా ఎంత నీరు కేటాయించాలి? అన్నది నిర్ణయించారు. ఇప్పటికీ ఆ దామాషా ప్రకారమే కేటాయింపులు జరుగుతున్నాయి.

● అంతులేని అలసత్వం

రైతుల విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకున్న మంత్రులు.. వీలైనంత త్వరగా లోకలైజేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ కూడా పలు మార్లు సమావేశాలు నిర్వహించి లోకలైజేషన్ వేగంగా పూర్తి చేయాలని సూచించారు.. కానీ ఈ పని చేయాల్సిన రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు మాత్రం కదలడం లేదు. తొలుత లోకలైజేషన్ ప్రక్రియలో ఇరిగేషన్ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించగా, ఇప్పుడు ఆ వంతును రెవెన్యూ శాఖ పోషిస్తోంది. సర్వే నెంబర్ల వారీగా ఏ భూమి సాగు జరగడం లేదన్నది రెవెన్యూ శాఖకు తెలుస్తోంది. అలానే ఎక్కడెక్కడ అనధికారికంగా సాగు చేస్తున్నారన్నది కూడా వారే చెప్పగలరు. కానీ రెవెన్యూ అధికారులు మాత్రం ఇరిగేషన్ అధికారులు సహకరించడం లేదు. దీంతో లోకలైజేషన్ ప్రక్రియ మరింత ఆలస్యమవుతోంది.

● కొత్త ఆయకట్టుకు అవకాశం

సోమశిల కింద డెల్టాలోని భూములకు నీరిచ్చాకనే మిగిలిన ప్రాంతాలకు కేటాయింపులు జరపాలని నిబంధనలు ఉన్నాయి. ఇప్పుడు డెల్టాతోపాటు అన్ని కాలువల కింద ఉన్న ఆయకట్టులో కొన్ని వేల ఎకరాల సాగు భూములు మాయమయ్యాయి. ఆ లెక్క తేలిస్తే ప్రస్తుతం ఏ కాలువ కింద ఎంత ఆయకట్టు ఉందన్న విషయం స్పష్టమవుతుంది. దీంతో ప్రస్తుత స్థిరీకరణ ఆయకట్టు తగ్గుతుంది. ఎంత మేర తగ్గిందో అదే స్థాయిలో కొత్త ఆయకట్టును సోమశిల కింద స్థిరీకరించేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఇది మెట్ట ప్రాంత రైతాంగానికి ఎంతో ప్రయోజనాన్ని చేకూరుస్తుంది. డెల్టాలో తగ్గిన వేల ఎకరాల ఆయకట్టు మెట్టలో స్థిరీకరణ జరిగి సాగులోకి వస్తుంది. తద్వారా మెట్టలో కాలువలను కూడా బాగు చేసుకునేందుకు వీలు పడుతుంది. ఇటీవల ఇరిగేషన్ అధికారులు ప్రాథమిక సర్వే చేయగా ఒక్క డెల్టాలోనే సుమారు 30 వేల ఎకరాలకు పైగా పొలాలు కనుమరుగైనట్లు తేలింది. అదే విధంగా జిల్లా మొత్తం చూస్తే ఇంకెన్ని వేల ఎకరాల ఆయకట్టు తగ్గిందో అర్థం చేసుకోవచ్చు. లోకలైజేషన్ పూర్తయితే ఆయకట్టు కింద తగ్గిన విస్తీర్ణం దామాషాను నాన్ ఆయకట్టు కింద స్థిరీకరణ చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది.



ముత్తుకూరులో లేఅవుట్‌గా మారిన పంట పొలం

రేపటి నుంచి రెండో పంటకు నీరు

● ఇరిగేషన్ ఎస్ఈ దేశానాయక్

నెల్లూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : రెండో పంట సాగుకు సంబంధించి బుధవారం నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు ఇరిగేషన్ శాఖ ఎస్ఈ దేశా నాయక్ వెల్లడించారు. గత నెలలో జరిగిన సాగునీటి సలహా మండలి (ఐఏబీ)లో తీసుకున్న నిర్ణయాల ప్రకారం నీటి విడుదల జరుగుతుందని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సోమశిల డ్యాం నుంచి రోజుకు 1500 క్యూసెక్కుల చొప్పున సాగుకు విడుదల చేయనున్నట్లు చెప్పారు. డెల్టాలో రెండు లక్షల ఎకరాలకు, కనుపూరు కాలువ కింద 20 వేల ఎకరాలకు నీరు ఇస్తున్నట్లు తెలిపారు. రైతులంతా నీటిని సక్రమంగా వినియోగించుకుంటూ సాగు చేసుకోవాలని ఎస్ఈ కోరారు. ఎక్కడైనా తలెత్తితే ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.



సోమశిల జలాశయం (ఫైల్)

డెంగ్యూ, మలేరియా కేసులను గుర్తించండి

● మలేరియా నివారణ అధికారి డాక్టర్ హుస్సేనమ్మ

నెల్లూరు (వైద్యం), మే 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డెంగ్యూ, చికెన్‌గున్యా, మలేరియా కేసులను వెంటనే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ పేర్కొన్నారు. సోమవారం డీ ఎంహెచ్‌వో కార్యాలయంలో మలేరియా సబ్ డివిజన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా లో శాశ్వత నీటినిల్వలను గుర్తించి, వాటిలో దోమల లార్వా ఉన్నట్లయితే నివారణ చర్య లు తీసుకోవాలన్నారు. మురుగుగుంతల్లో గంబూజియా చేపలను వదలాలని చెప్పా రు. ప్రస్తుతం సెలవులు ఉన్న కారణంగా ప్రభుత్వ వసతి గృహాలలో పర్యటించి మస్కి టో నెట్‌ల ఏర్పాటుకు సిఫార్సు చేస్తామన్నా రు. దోమల కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఇంటింటికి తిరిగి హెచ్చరించా లని ఆమె తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఏఎమ్‌వో నాగార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవ శోభ

● వేదగిరిలో వార్షిక వేడుకలకు నేడు అంకురార్పణ

వేదగిరి క్షేత్రంలో లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం అంకురార్పణతో ప్రారంభం కానున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి ఈ ఉత్సవాలు జరుగుతుండటంతో అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికార యంత్రాంగం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ఇప్పటికే ఏర్పాటైన ఉత్సవ కమిటీ తరలివచ్చే భక్తుల కోసం మంచినీరు, పారిశుధ్యం, భద్రత, రవాణాకు తొలి ప్రాధాన్యం ఇచ్చింది. 11వ తేదీన స్వామి వారికి బంగారు గరుడసేవ, 12న ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనృసింహస్వామి కల్యాణం జరగనుంది. ఆ మరుసటి రోజు నూతన వధూవరులను నరసింహపురం పురవీధుల్లో రథంపై ఊరేగించనున్నారు.



నెల్లూరురూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి) :నెల్లూరు నగరానికి పడమర వైపున, పెన్నానదికి సమీపాన వెలసియున్న వేదగిరి లక్ష్మీనరసింహస్వామి వార్ల బ్రహ్మోత్సవాలను ఈసారి అట్టహాసంగా జరిపించేందుకు సర్వం సిద్ధమైంది. క్షేత్రాన్ని శోభయామానంగా తీర్చిదిద్దుతున్న అధికారులు, ఉత్సవ కమిటీ వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకుని కొండపైకి తరలివచ్చే భక్తజనానికి చల్లని చలువపందిళ్లు నిర్మిస్తున్నారు. నగరంలోని ములుముడి బస్టాండ్ నుంచి కొండపైకి ఆర్టీసీ బస్సుల ఏర్పాటు, భక్తులకు భద్రతను కట్టుదిట్టం చేయనున్నారు. 300 మంది పోలీసులతో పహారా ఏర్పాటు చేయనున్నట్లు ఆ శాఖ ప్రకటించింది. దేవరపాళెం పంచాయతీతోపాటు పంచాయతీ రాజ్ శాఖ ప్రత్యేక పారిశుధ్య పనులను నిర్వహించనుంది. సౌత్‌మోపూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం చొరవతో నెల్లూరులోని కార్పొరేట్ హాస్పిటళ్లతో శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు. ఈసారి కొండపై పార్కింగ్ ప్రాంతాలను పెంచుతున్న అధికారులు, జొన్నవాడ రేవు నుంచి కొండపైకి పైపుల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు ప్రణాళిక తయారు చేశారు.

ఉత్సవాలు ఇలా..

- **6వ తేదీన** రాత్రి 7 గంటలకు అంకురార్పణ
- **7న** ఉదయం చప్పర ఉత్సవం, ధ్వజారోహణం, రాత్రి 8 గంటలకు శేషవాహన సేవ
- **8న రాత్రి** హంసవాహనం
- **9న రాత్రి** సింహవాహనం
- **10న** రాత్రి హనుమంత సేవ
- **11న** సాయంత్రం మోహినీ ఉత్సవం, అఖండ జ్యోతి, అర్ధరాత్రి 12 గంటలకు బంగారు గరుడసేవ
- **12న** రాత్రి కల్యాణ మహోత్సవం, అర్ధరాత్రి 12 గంటలకు గజవాహన సేవ
- **13న** ఉదయం నరసింహపురంలో రథోత్సవం
- **14న** రాత్రి 8 గంటలకు అశ్వవాహన సేవ
- **15న** ఉదయం ఏడుకోన్నేళ్ల వద్ద తీర్థవాది, రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణం
- **16న** సాయంత్రం పుష్పయాగం, రాత్రి 9 గంటలకు ఏకాంతసేవ

● గజ ఈతగాళ్లతో నిఘా

వేదగిరిలోని ఏడుకోన్నేళ్ల వద్ద అగ్నిమాపక దళం గజ ఈతగాళ్లతో నిఘా ఉంచింది. చెంచులక్ష్మి అమ్మవారి వంశీకులైన చెంచుకులస్థులు కొండ పరిసర ప్రాంతాలలో వేడుకలు పూర్తయ్యే వరకు ఉంటారు. వారందరికీ అన్ని సౌకర్యాలను సమకూర్చనున్నారు.

భక్తులకు ఏలోటు రానివ్వం

ఈసారి బ్రహ్మోత్సవాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాము. ఎక్కడా చిన్న లోపం కూడా రానివ్వకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాము. తాగునీరు, పారిశుధ్యం, భక్తులకు భద్రత, రవాణ సౌకర్యాలకు ప్రాధాన్యం ఇస్తున్నాము. ఎవరైన సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నాము.

- అచ్యుత శంకర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్

పకడ్బందీగా లేఅవుట్ల సర్వే

● ఎవరూ నష్టపోకుండా చర్యలు

● నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు(జడ్పీ), మే 5 (ఆం ధ్రజ్యోతి): జిల్లాలో అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు పకడ్బం దీగా సర్వే చేస్తున్నట్లు నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. నుడా కార్యాలయంలో సోమవారం సర్వే బృందాలతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణపై మం త్రి నారాయణ ప్రత్యేకశ్రద్ధ వహించారని, 17 మంది అధికారుల ను సర్వే కోసం జిల్లాకు పంపారని తెలిపారు. వారంతా స్థానిక అధికారులతో కలసి జిల్లాలోని అన్నీ లేఅవుట్లను సర్వే చేస్తారని తెలిపారు. ఎవరూ నష్టపోకుండా చర్యలు చేపడుతున్నట్లు ఆయ న వివరించారు. ఇందుకు అంతా సహకరించాలని కోరారు. నుడా పరిధిలోని లేఅవుట్లను భౌతికంగా సర్వే చేసి, గ్రామ, నగర స్థాయిలో లేఅవుట్లలో నిబంధనలు అమలు జరిగాయా... లేదా... అని పరిశీలిస్తారని పేర్కొన్నారు. నెల్లూరు జిల్లాను పైలెట్ ప్రాజె క్టుగా మంత్రి నారాయణ తీసుకున్నారని కోటంరెడ్డి తెలిపారు. జిల్లాలో జరిగే సర్వే ఆధారంగా రాష్ట్రమంతా క్రమబద్ధీకరణకు అమలుకు చర్యలు తీసుకుంటారని వివరించారు. ఈ సమావేశంలో టౌన్ ప్లానింగ్ జేడీ మహాలక్ష్మి, అధికారులు సంజీవ్, హిమ బిందు, నుడా కార్యదర్శి పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధం



థర్మల్ కేంద్రం ఎదుట కార్మికుల మానవహారం

ముత్తుకూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధమని జెన్కో కార్మికులు హెచ్చరించారు. నేలటూరు జెన్కో థర్మల్ కేంద్రం ఎదుట సోమవారం వారు మానవహారం నిర్మించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికుల సంఘం నాయకులు మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి 25రోజులుగా శాంతియుత నిరసన తెలుపుతున్నా అధికారులు స్పందించలేదన్నారు. థర్మల్ కేంద్రంలోని ఏహెచ్‌పీ, సీహెచ్‌పీ, ఈసీసీఎస్ విభాగాలలో పనిచేస్తున్న కార్మికులకు కాంట్రాక్ట్ కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

ఎంప్లాయిమెంట్ రిటర్న్స్ సమర్పించాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మే 5 (ఆంధ్రజ్యోతి) : పబ్లిక్, ప్రైవేట్ ఎస్టాబ్లిస్‌మెంట్ రిటర్న్స్ కోసం సంవత్సరంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆన్‌లైన్ ద్వారా ఎంప్లాయిమెంట్ రిటర్న్స్ సమర్పించాలని జిల్లా ఉపాధి అధికారి ఎం వినయ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. www.emplament.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో ఎంప్లాయిమెంట్ లాగిన్ ద్వారా ఎంప్లాయిమెంట్ రిటర్న్స్ సమర్పించాలన్నారు. పూర్తి వివరాల కోసం జిల్లా ఉపాధి కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే 96426 53931, 91608 88066 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

బీమాతో భరోసా!

● 'ఉపాధి' శ్రమజీవులకు ఊరట ● పనిచేస్తూ మరణిస్తే రూ.2లక్షలు

● గాయపడితే చికిత్సకు బిల్లు పెట్టుకునే వీలు

ఉదయగిరి, మే 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనులు చేసే శ్రమజీవులకు ప్రభుత్వం బీమాతో భరోసా కల్పించాలని నిర్ణయించింది. పని చేస్తుండగా మృతి చెందితే రూ. 2లక్షలు, గాయపడితే వైద్యానికి బిల్లు పెట్టుకోవానికి వీలు కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. జిల్లాలో సుమారు 2.81 లక్షల జాబ్‌కార్డులు ఉండగా 4.43 లక్షల మంది కూలీలు ఉన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలో అన్ని మండలాల్లోనూ ఉపాధి హామీ పథకం శ్రమజీవులకు ఈ బీమాను వర్తింప చేయనున్నారు. మండలస్థాయి అధికారులు శ్రమజీవులకు అవగాహన కల్పించి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.ఉపాధి శ్రమజీవుల వివరాలను వెంటనే నమోదు చేయించేలా చూడాలని క్షేత్రస్థాయి పరిశీలకులను ఉన్నతాధికారులు ఆదేశించారు. దరఖా స్తుల స్వీకరణ ముమ్మరంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు.



ఉపాధి పనులు చేస్తున్న కార్మికులు

20న సమ్మె చేస్తాం!

● డీఎంహెచ్‌వోకి ఆశా నేతల నోటీసు

నెల్లూరు (వైద్యం) మే 5 (ఆంధ్రజ్యోతి) : డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాతకు ఏఐ ఆశా వర్కర్స్ యూనియన్ నేతలు సోమవారం సమ్మె నోటీసు ఇచ్చారు. తమకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న సమ్మెలో పాల్గొంటున్నట్లు వారు ఆ నోటీసులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయలక్ష్మి, దుగ్గిరాల అన్నపూర్ణమ్మ మాట్లాడారు. యాజమానులకు కట్టుబానిసలుగా చేసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 20 ఏళ్లుగా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్న ఆశా కార్యకర్తలను, కార్మికులుగా గుర్తించి రెగ్యులర్ చేయాలని కోరారు. ఆశాలను కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌గా గుర్తించి రూ.10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటిని కూడా వారికి వర్తింప చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి మధుసూదన, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



డీఎంహెచ్‌వో సుజాతకు సమ్మె నోటీసు ఇస్తున్న ఆశాల యూనియన్ నేతలు

పైలాన్ ధ్వంసం.. వైసీపీ నాయకుల కోసం ఆరా

● ముమ్మరంగా గాలిస్తున్న పోలీసులు ● మాజీ ఎమ్మెల్యే ప్రతాప్, వైసీపీ నాయకులపై కేసు ● ఇప్పటికే నలుగురి అరెస్ట్.. రిమాండ్ ● నిందితుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం

కావలి, మే 5 (ఆంధ్రజ్యోతి) : కావలి పట్టణానికి మంచినీటి సరఫరా కోసం కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన అమృత్ పథకం పైలాన్ ధ్వంసం చేసి ఐదేళ్ల దాటిన తర్వాత నిందితులను ఎట్టకేలకు పోలీసులు గుర్తించారు. ఇప్పటికే 12 మందిని గుర్తించి వారిలో నలుగురిని అరెస్ట్ చేయగా, మిగలిన 8 మంది కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. అయితే ఎఫ్ఐఆర్‌లో కొంతమంది వైసీపీ నాయకుల పేర్లు ఉండటంతో ఆ పార్టీలో కలవరం మొదలైంది. ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన జగన్ మీడియా ప్రతినిధి కుర్రు శ్రీనివాసరావు, ఇతర విలేకరులు కేదారు మాలకొండయ్య, బెహరా వెంకట లక్ష్మీనారాయణ, వానింబేడి ప్రసాద్‌లను మేజిస్ట్రేట్ వద్ద హాజరుపరచగా వారికి రిమాండ్ విధించటంతో కావలి సబ్ జైలుకు తరలించారు. వీరు ఇచ్చిన వివరాల ప్రకారం శ్రావణ్‌కుమార్, జ్యోతి అనిల్, వెంకట్రావు, కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డిప్రతాప్ కుమార్ రెడ్డి, మన్నెమాల సుకుమార్ రెడ్డి, కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి, కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, చెన్ను ప్రసాద్ రెడ్డిల పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ప్రస్తుతం వీరంతా పరారీలో ఉన్నారు. వీరుగాక ఇంకొంతమంది నాయకుల పేర్లు ఎఫ్ఐఆర్‌లో చూపడంతో అందరిలోనూ గుబులు మొదలైంది. వైసీపీ నాయకులు, విలేకరులతోపాటు పైలాన్‌ను ధ్వంసం చేసిన ఎక్స్‌కవేటర్లు, రాత్రికిరాత్రే శిథిలాలను తరలించిన ట్రాక్టర్ల నిర్వాహకులతో కలిపి సుమారు 30 మంది వరకు ఈ కేసులో నిందితులు ఉండవచ్చని పోలీసులు అనధికారికంగా వెల్లడిస్తున్నారు.

● జరిగింది ఇదీ..

8-1-2018లో అప్పటి రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కావలిలో అమృత్ పథకం పైలాన్‌ను ఆవిష్కరించారు. అయితే అప్పటి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి పైలాన్ ఆవిష్కరణలో ప్రొటోకాల్ పాటించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు పైలాన్‌ను పగలగొట్టి ఆ స్థానంలో ప్రెస్‌క్లబ్ భవనం నిర్మిస్తామని ఎమ్మెల్యే రామిరెడ్డి చెప్పగా ఇందుకు విలేకరులలో కొంతమంది వ్యతిరేకించి ఈ వ్యవహారంపై అప్పటి సబ్‌కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, డీఎస్పీల దృష్టికి తీసుకెళ్లారు. కాగా, 10-4-2020న రాత్రి వరకు ఉన్న పైలాన్ 11వ తేదీ తెల్లారేసరికి మాయమైంది. ఆ మరుసటి రోజు అక్కడ ప్రెస్‌క్లబ్ భవనం నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమానికి అధికారులను ఆహ్వానిస్తూ కావలి జర్నలిస్టుల పేరుతో ఓ ఫ్లెక్సీ వెలసింది. ఆ తర్వాత ప్రెస్‌క్లబ్ భవనానికి శంకుస్థాపన కూడా జరిగింది. పైలాన్ ధ్వం సంపై అప్పటి కమిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, వైసీపీ అధికారంలో ఉండటంతో నిందితులు దొరకలేదంటూ పోలీసులు కేసును క్లోజ్ చేశారు. గతేడాది అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమి నాయకులు పైలాన్ ధ్వంసం కేసులో నిందితులెవరో తేల్చాలని పోలీస్‌లకు ఫిర్యాదు చేసారు. ఈ మేరకు పోలీస్‌లు విచారించి నిందితులను అరెస్ట్ చేసి విచారించగా మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌తోపాటు పలువురు వైసీపీ నాయకులపై కేసు నమోదు చేశారు. కాగా, ఈ కేసులో ప్రధానంగా వైసీపీ నాయకులు ఉండగా వారిని కాదని విలేకరులనే ప్రధానంగా చేర్చడం కావలిలో చర్చ నీయాంశమైంది.



పైలాన్‌ను ధ్వంసం చేసిన స్థలంలో జర్నలిస్టుల పేరుతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ (ఫైల్)

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	134
స్కిన్ చికెన్	238
స్కిన్‌లెస్	262

కోడిగుడ్ల ధర (100): 500

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9154
వెండి కిలో ధర	రూ. 96.900
వెండి ఒక గ్రాము	రూ.99.90

చిరువ్యాపారుల కోసమే షాపింగ్ కాంప్లెక్స్

కావలి, మే 5(ఆంధ్రజ్యోతి): చిరువ్యాపారుల కోసమే షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి వారికి తక్కువ ధరకు అద్దెకు ఇవ్వనున్నట్లు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని ఉదయగిరి రోడ్డులో నిర్మిస్తున్న మున్సిపల్ షాపింగ్ రూములను సోమవారం ఎమ్మెల్యే మున్సిపల్ డీఈ సాయిరాంతో కలిసి పరిశీలించారు. ఉదయగిరి రోడ్డులో 360 షాపులను నిర్మిస్తున్నామని, త్వరలో ఆర్డీవో, తహసీల్దారు కార్యాలయం, ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఎదుట షాపులు నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులతో పాటు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు కావలి మండల సర్వసభ్య సమావేశం

కావలి రూరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): కావలి ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీదేవి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, జడ్పీటీసీ, కోఆప్షన్ సభ్యుడు, సర్పంచులు, హాజరు కావాలని, మండలస్థాయి అధికారులు సమగ్ర నివేదికతో పాల్గొనాలని తెలిపారు.

10 నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ

కందుకూరు, మే 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్‌లో ఈనెల 10 నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణకు కొత్తబ్యాచ్‌లు ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ షేక్ రియాజుద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్, ఆపై విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకులంతా ఈ కంప్యూటర్ శిక్షణకు హాజరయ్యేందుకు అర్హులేనని వివరాలకు 9848050543ను సంప్రదించాలని స్కిల్ హబ్ సెంటర్ కో ఆర్డినేటర్ ఇమ్రాన్‌ఖాన్ తెలిపారు.

పీజీఆర్ఎస్‌కు 2 వినతులు

కొండాపురం, మే 5(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావిజ్ఞప్తుల పరిష్కార వేదికకు బాధితుల నుంచి 2 వినతులు అందినట్లు తహసీల్దారు కోటేశ్వరరావు, ఎంపీడీవో ఆదినారాయణ తెలిపారు. మండలస్థాయిలో అన్ని శాఖల అధికారుల సమక్షంలో ప్రతి సోమవారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి అందిన 2 వినతులు పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు.

కిలో పొగాకు రూ.180

కలిగిరి, మే 5(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రైతులు 327 పొగాకు బేళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 11 కంపెనీ ప్రతినిధులు పాల్గొని 282 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-35, ఆర్ఆర్-3, సీఆర్-2, జంపింగ్‌లాట్స్-5 కారణాలతో 282 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.210, సగటు ధర రూ.253.81గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి టీ ఇసాక్‌స్వరన్‌దత్ తెలిపారు.

ఆదర్శ నేత కలికి యానాదిరెడ్డి

● ఘన నివాళులర్పించిన ఎమ్మెల్యే, వివిధ రాజకీయ పార్టీల నేతలు



కలికి యానాదిరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, నేతలు

కావలిటౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): కావలి నుంచి ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలవడమే కాక మంత్రి పదవి అలంకరించిన ఏకైక నేత కలికి యానాదిరెడ్డి ఆదర్శ రాజకీయ నాయకుడని ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి కొనియాడారు. మాజీ మంత్రి కలికి యానాది రెడ్డి 19వ వర్ధంతిని పురస్కరించుకుని ట్రంకు రోడ్డు బ్రిడ్జి కూడలిలోని ఆయన విగ్రహం వద్ద సోమవారం కలికి అభిమానుల ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు టీడీపీ, వైసీపీ, వివిధ పార్టీల నేతలు, అభిమానులు పాల్గొని కలికి విగ్రహానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. అనంతరం ఏరియా వైద్యశాల ప్రాంగణంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దివంగత కలికి యానాదిరెడ్డి, గొట్టిపాటి కొండపనాయుడులు కావలి రాజకీయాలలో ఒక ధ్రువతారలుగా వెలుగొందారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కనమర్లపూడి నారాయణ, దామిశెట్టి సుధీర్ నాయుడు, గంధం ప్రసన్న, కుందుర్తి సోదరులు, రాజు, గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబూరావు, కండ్లగుంట మధుబాబు నాయుడు, పోట్లూరు శ్రీనివాసులు, పోతుగంటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మా పొలాలకు దారి చూపించండి



సబ్ కలెక్టరుకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కందుకూరు, మే 5(ఆంధ్రజ్యోతి) : మా పొలాలకు దారి చూపించాలని కోరుతూ గుడ్లూరు మండలం పూరేటిపల్లి గ్రామానికి చెందిన రైతులు సోమవారం కందుకూరు సబ్‌కలెక్టరు తిరుమణి శ్రీపూజను కలిసి విజ్ఞప్తి చేశారు. దశాబ్దాలుగా రోడ్డు నుంచి పొలాల్ల గుండా ఎగువన ఉన్న పొలాలకు ట్రాక్టర్లు, ఎడ్లల బండ్లు వెళ్లేందుకు దారి ఉండేదని, పంటలకు ఎరువులు తీసుకెళ్లాలన్నా, పంట ఉత్పత్తులు ఇళ్లకు తెచ్చుకోవాలన్నా ఈ దారే శరణ్యమని, ఇటీవల సర్వే నెం.283లోని భూములను ఒంగోలుకు చెందిన వ్యక్తులు కొనుగోలు చేసి దారి మూసివేశారన్నారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గనిపినేని వెంకటేశ్వర్లు, మరికొందరు రైతులు సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు కలిసి వినతిపత్రం అందజేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

వలేటివారిపాలెం, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శాఖవరం హైస్కూల్‌లో 1982-87వ సంవత్సరాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు డీ.జానకిరామయ్య, జీవీ.రంగయ్య, ఎస్‌కే.బేగం, ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు పీ.చిన్నయ్యలను శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఎంతో ఉన్నత స్థాయిలో ఉన్నారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.నాగేంద్రరావు, ఎన్.శ్రీనివాసులు, కే.వెంకటేశ్వర్లు, వీ.మల్లికార్జున, వీ.బ్రహ్మయ్య, ఎస్‌కే.ఫిరోజ్, జీ.అరుణ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కావలిటౌన్, మే 5(ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్యనభ్యసించాలనుకునే వారు దరఖాస్తు చేసుకోవాలని కావలి ఎంఈఓ-2 వెంకటసుబ్బయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటవ తరగతిలో ప్రవేశానికి విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం దారిద్ర రేఖకు దిగువనున్న పేద విద్యార్థులకు 25శాతం సీట్లు ఇస్తుందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అనాథ విద్యార్థులు ఉచిత విద్య పొందేందుకు ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డు, ఫొటోతో ఈనెల 15 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

డీఎస్సీ ప్రిపరేషన్‌కు సమయం పెంచాలి : సీపీఎం



ఆర్డీవోకి వినతిపత్రం అందజేస్తున్న నేతలు

కావలి, మే 5(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ప్రిపరేషన్ సమయం 90 రోజులకు, వయోపరిమితి 47 ఏళ్లకు పెంచాలని, రెండవసారి టెట్ నిర్వహించాలని సీపీఎం సీనియర్ నాయకుడు తాళ్లూరు మాల్యాద్రి కోరారు. ఈ మేరకు ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో ఆర్డీవో ఎం. వంశీకృష్ణకు వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు సీతారామయ్య, కార్యదర్శి రాధా కృష్ణయ్య, తదితరులు తెలిపారు.

మంచినీటి సమస్యపై చర్యలు చేపట్టండి

లింగసముద్రం, మే 5(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తితే చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు పంచాయతీ కార్యదర్శులను, బోరు మెకానిక్‌లను ఆదేశించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన పంచాయ తీ కార్యదర్శులు, బోరు మెకానిక్‌లతో చర్చిం చారు. సచివాలయ్యా కార్యదర్శులతో ఫోన్‌లో మాట్లాడారు. ఎక్కడైనా మంచినీటి పైపులు పగిలి, నీటి సరఫరా నిలిచిపోతే వెంటనే చర్యలు తీసుకొని మంచినీటి సరఫరాను పునరుద్ధరించాలన్నారు. చేతి పంపులు మరమ్మతులకు గురైతే తక్షణం బాగు చేయించాలని చెప్పారు. వేసవిలో ప్రజలు మంచినీటికి ఇబ్బందులు పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కావలిటౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ గొబ్బెళ్ల కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఒక్కో పాఠశాలను ఒక్కో విధంగా పరిగణలోకి తీసుకుంటూ ఉపాధ్యాయుల కేటాయింపులో అన్యాయంగా వ్యవహరిస్తూ ఉపాధ్యాయులను గందరగోళానికి గురిచేస్తుందన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు పారదర్శంగా చేపట్టాలని, పీఆర్సీలో భాగంగా ఇంటీరియం రిలీఫ్ ఇవ్వాలని, పెండింగ్ బాకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దారు శ్రావణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీ ఎఫ్ నాయకులు మధుసూదన్‌రావు, కే.రఘునాథరావు, పెంచలయ్య, రమణకుమార్, సమాధి వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, రాజయ్య పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌గా పెంచలయ్యను నియమించాలి

● ఎంపీడీవో కార్యాలయంలో బైఠాయించిన టీడీపీ నేత, రెండు గ్రామాల ప్రజలు



కార్యాలయంలో బైఠాయించిన గ్రామస్థులు

దగదర్తి(బిట్రగుంట), మే 5 (ఆంధ్రజ్యోతి): గత టీడీపీ పాలనలో పనిచేసిన పెంచలయ్యను ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియమించాలని ఇరిగేషన్ బోర్డు మాజీ డైరెక్టర్ మాలేపాటి రవీంద్ర నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు దగదర్తి ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం దగదర్తి, చెన్నూరు గ్రామాల ప్రజలతో కలిసి ఆయన బైఠాయించారు. ఆయన మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేసిన పెంచలయ్యను వైసీపీ ప్రభుత్వ పాలనలో తీసివేశారన్నారు. ప్రస్తుతం ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న వ్యక్తి టీడీపీ పార్టీ కార్యకర్తలకు ఉపాధి హామీ పనుల్లో తీవ్ర అన్యాయం చేస్తున్నారని తెలిపారు. ఇరుగ్రామాల ప్రజలకు ఉపాధిహామీ పనుల్లో న్యాయం జరగాలంటే పెంచలయ్యను ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియమించాలని కోరుతూ ఎంపీడీవో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందచేశారు. ఆయన వెంట స్థానిక నేతలు కంచర్ల కృష్ణయ్య, రమణమ్మ, ప్రజలు తదితరులు ఉన్నారు.

అదుపుతప్పి టమోటా లారీ బోల్తా



జాతీయ రహదారిపై బోల్తాపడిన లారీ

వలేటివారిపాలెం, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని నూకవరం-బడేవారిపాలెం గ్రామాల మధ్య జాతీయ రహదారిపై సోమవారం ఉదయం 6 గంటల సమయంలో టమోటా లారీ అదుపుతప్పి బోల్తా పడింది. కడప నుంచి కందుకూరుకు వేగంగా వస్తున్న ఈ లారీ మలుపు వద్ద అదుపు తప్పి పడింది. లారీ డ్రైవర్, క్లీనర్‌కు ఎలాంటి ప్రమాదం లేకుండా సురక్షితంగా బయటపడ్డారు.

హైవేపై కారు..

జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న కారు మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడిన ఘటన మండలంలోని బడేవారిపాలెం సమీపంలో సోమవారం జరిగింది. ఆ కారులో ఉన్న డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. విజయవాడ నుంచి కడపకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆ మలుపులో ఉదయం ఒక ప్రమాదం. సాయంత్రం మరో ప్రమాదం జరిగింది.

12 నుంచి నాటక పోటీలు

లింగసముద్రం : మండలంలోని పెదపవనిలో ఎం.రాఘవేంద్ర స్మారక నాటక కళా పరిష త్ ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి 15 వరకు తృతీయ ఉభయ తెలుగు రాష్ట్రాల నాటక పోటీ లు జరుగుతాయని పెదపవని పావని ఆర్ట్స్ అధ్యక్షుడు మలిశెట్టి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షు డు సీహెచ్ వెంకట్రావులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

విద్యా వ్యవస్థలో అసంబద్ధ విధానాలు సరిచేయాలి

● ఏపీటీఎఫ్ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీటీఎఫ్ నేతలు

ఉదయగిరి, మే 5 (ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థలో అసంబద్ధ విధానాలు వెంటనే సరిచేయాలని ఏపీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పీ తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చూడాలని, అన్ని ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి ఒకేలా ఉండేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఏపీటీఎఫ్ ఉద్యమిస్తోందన్నారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి ఐఆర్ 30శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మాల్యాద్రి, ఎండీ ఖాజా, ఓబులేసు, షబ్బీర్, నాగేశ్వరరావు, రమేష్, మాధవరాజు, బాలకృష్ణ, పాల్గొన్నారు.

స్లాట్ బుకింగ్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఉదయగిరి, మే 5 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ ఫర్ స్టాంప్స్ శాఖలో నూతనంగా అమలవుతున్న స్లాట్ బుకింగ్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సబ్ రిజిస్ట్రార్ మెల్కిరోషన్ సూచించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ ఈ విధానం ప్రజలకు సౌకర్యవంతంగా, సౌలభ్యంగా ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ ఏరోజు చేసుకోవాలనుకుంటున్నారో ముందుగా ఆ సమయానికి బుక్ చేసుకొని సమయానికి కార్యాలయానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఈ విధానం ద్వారా సమయం ఆదా అవుతుందన్నారు. రోజుకు 36 స్లాట్స్ ఇచ్చారన్నారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

చేజర్ల, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న మహిళలకు ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సోమశిల ప్రాజెక్ట్ ఛైర్మన్ వేలూరు కేశవచౌదరి, మండల టీడీపీ కన్వీనర్ రావి లక్ష్మీనరసారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఇడబ్ల్యూఎస్ వారి సహకారంతో పేద మహిళల కోసం ప్రభుత్వం ఈకార్యక్రమాన్ని చేపట్టిందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు బి మురళి, ఎంపిడివో విజయలలిత పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ గ్రామోత్సవం



గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

సంగం, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దీపురం దళితవాడలో ఉన్న పోలేరమ్మ ఆలయం వార్షికోత్సవంలో భాగంగా సోమవారం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, సాయంత్రం పొంగళ్లు పొంగించారు. అనంతరం పోలేరమ్మ తల్లి ఉత్సవ విగ్రహాన్ని పూలతో అలంకరించి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఈ గ్రామోత్సవంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ప్రభుత్వ భూముల్లో కలప నరికివేతపై ఫిర్యాదు

దుత్తలూరు(ఉదయగిరి), మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భైరవరం గ్రామ సమీపంలోని ప్రభుత్వ భూమిలో కలపను కొందరు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారని గ్రామస్థులు సోమవారం తహసీల్దారు వై నాగరాజుకు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమంగా కలప నరికివేతపై జిల్లా కలెక్టర్, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈవిషయమై వీఆర్వో మాల్యాద్రిని వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కలప నరికివేతను నిలిపివేశామన్నారు.

సోమశిలలో 50.754 టీఎంసీల నీరు

అనంతసాగరం మే 5 (ఆంధ్రజ్యోతి): సోమశిల ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా సోమవారం నాటికి 50.754 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 30, దక్షిణ కాలువకు 50, డెల్టాకు 1,000 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

గ్రామాల అభివృద్ధిలో కమిటీలు ఎంతో కీలకం

● ఎమ్మెల్యే కాకర్ల సురేష్



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

దుత్తలూరు (ఉదయగిరి), మే 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధిలో తెలుగుదేశం పార్టీ కమిటీలు ఎంతో కీలకం అని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. సోమవారం మండలంలోని ఏరుకొల్లు, భైర వరం, రాచవారిపల్లి, మందాలనామయుడుపల్లి తదితర పంచాయ తీల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై కమిటీలను నియమించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి ఆమోదంతోనే కమిటీల ఎంపిక జరుగుతుందన్నారు. మనస్పర్థలు వీడి పార్టీ, గ్రామాల అభివృద్ధికి కలిసి పనిచేయాలని సూచించారు. అనంతరం స్థానిక నాయకులు, ప్రజల నుంచి సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం, పొలిటికల్ మేనేజరు మాలేపాటి చైతన్య, నాయకులు చీకుర్తి రవీంద్ర బాబు, ఉండేలా గురవారెడ్డి, సుబ్బరాయుడు, చీదర్ల మల్లికార్జున, చేజర్ల భాస్కర్ రెడ్డి, లెక్కల వెంగళరెడ్డి పాల్గొన్నారు.

కనుపూరు కాలువకు నీరు విడుదల



కనుపూరు కాలువకు నీటిని విడుదల చేస్తున్న ఛైర్మన్, ఇరిగేషన్ అధికారులు

సంగం, మే 5 (ఆంధ్రజ్యోతి): సంగం బ్యారేజి నుంచి కనుపూరు కాలువకు సోమవారం నీటిని విడుదల చేశారు. ఈసందర్భంగా కనుపూరు కాలువ ప్రాజెక్టు ఛైర్మన్ మస్తాన్ నాయుడు, డీఈ పాండురంగారెడ్డి కాలువ హెడ్ రెగ్యులేటర్ల వద్ద పూజలు చేశారు. అనంతరం హెడ్ రెగ్యులేటర్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నారుమళ్లు, పశువుల తాగునీటి అవసరాల మేరకు 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామన్నారు. తదుపరి సోమశిల జలాశయంలో నీటి విడుదలను బట్టి కనుపూరు కాలువకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈలు వెంకటేశ్వర్లు, వాసు, ఇరిగేషన్ సిబ్బంది, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

వెంగమాంబ సన్నిధిలో టెండర్ల నిర్వహణ

దుత్తలూరు(ఉదయగిరి), మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ వెంగమాంబ పేరంటాలమ్మ బ్రహ్మోత్సవాలు జూన్ 15 నుంచి 19వ తేదీ వరకు జరుగుతుండడంతో భక్తుల సౌకర్యార్థం వివిధ ఏర్పాట్లపై ఆలయ ఆవరణలో సోమవారం సీల్డు టెండర్లు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యుత్ దీపాలం కరణ, షామియానాలు, బాణసంచా, పుష్పాలంకరణ, జంగిల్ క్లియరెన్స్, రంగులు వేయుట తదితర వాటికి సీల్డు టెండర్లు నిర్వహించారు. ఈ సీల్డు టెండర్లను తక్కువ కోడ్ చేసిన వారు దక్కించుకున్నారు. అలాగే తాత్కాలిక దుకాణాల ఏర్పాటుకు వేలంపాట నిర్వహించగా ఎవరూ పాల్గొనక పోవడంతో వాయిదా వేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ప్రధాన వ్యవస్థాపక ధర్మకర్త తుమ్మల సురేష్‌బాబు, పచ్చవ కరుణాకర్‌బాబు, దేవదాయ ధర్మదాయ శాఖాధికారి గణపం రమణారెడ్డి, ఆలయ ఈవో ఉషశ్రీ, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత ప్రవేశాలు

ఉదయగిరి, మే 5 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో 25శాతం ఉచిత ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఎంఈవో మస్తాన్‌వలి అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో 1వ తరగతిలో చేరే విద్యార్థులకు అవకాశం ఉంటుందన్నారు. అనాథ, హెచ్ఐవీ బాధిత, ఎస్సీ, ఎస్టీ వర్గాల పిల్లలతో పాటు ఆర్థికంగా వెనుకబడిన మైనార్టీ, బీసీ, ఓసీ వర్గీయులను అర్హులుగా నిర్ధారించడం జరుగుతుందన్నారు. అలాంటి వారు గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1.20లక్షలు, పట్టణాల్లో రూ. 1.44 లక్షలు ఆదాయం కలిగి ఉండాలన్నారు. 15వ తేదీలోపు చేసుకున్న దరఖాస్తులను లాటరీ ద్వారా ఎంపికచేయడం జరుగుతుందని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అక్రమంగా జామాయిల్ కర్ర తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

కలువాయి, మే 5 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా జామాయిల్ కర్ర తరలిస్తున్న ట్రాక్టర్‌ను మండలంలోని రామన్నగారిపల్లె సమీపంలో సోమవారం అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. చింతలపాళెం సమీపంలోని ఫారెస్ట్ ప్లాంటేషన్‌లో జామాయిల్ చెట్లను దొంగతనంగా నరికి తీసుకువెళ్తుండగా కలువాయి, గోనుపల్లి సెక్షన్ల అటవీశాఖ సిబ్బంది కాపుకాచి పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్‌ను రాపూరుకు తరలించి కేసు నమోదుచేసి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ జరుపుతున్నట్లు రాపూరు అటవీశాఖ రేంజర్ రవీంద్రబాబు తెలిపారు.

అక్రమ విద్యుత్ వినియోగదారులపై కేసులు



విద్యుత్ మీటరును పరిశీలిస్తున్న విజిలెన్స్ ఏడీ పరిశుద్ధరావు

అనంతసాగరం మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమశిల, అనంతసాగరం, పడమటికంభపాడు గ్రామాల్లో సోమవారం డిస్కం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఏడీ పరిశుద్ధరావు, ఏఈలు కోటయ్య, సుధీర్, సిబ్బంది గృహాలు, వ్యాపార సముదాయాలు తనిఖీసి అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న ఆరుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఏడీ తెలిపారు.

గ్రీవెన్స్‌కు అధికారుల డుమ్మా

ఉదయగిరి, మే 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం తహసీల్దారు సుభద్ర నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి పలు శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. ఈసందర్భంగా తహసీల్దారు వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ ఇకపై గ్రీవెన్స్ కార్యక్రమానికి హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకునేందుకు జిల్లా ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు.